mohan PUBLICATIONS
Granthanidhi.blogspot.in
ఆధ్యాత్మిక, జ్యోతిష, వాస్తు, ఆరోగ్యాది అనేక విషయాలు తెలుసుకోండి... ఫేస్‌బుక్
FB@mohanpublications
మోహన్ పబ్లికేషన్స్
కోటగుమ్మం, అజంతా హోటల్ ఎదుట, రాజమహేంద్రవరం - 533 101.
Mohanpublications.com
SUNDAY SPECIAL MAGAZINES
గ్రంథనిధి

వార్త
ఆదివారం
23 జూలై 2017

డ్రగ్స్ పడగ!

ప్రమాదంలో దేశ భవిత..!

హాలీవుడ్‌లో తొలి హిందీ రీమేక్

హృతిక్‌రోషన్ లేటెస్ట్ ఫిలిం 'కాబిల్'కు అరుదైన ఖ్యాతి దక్కనుంది.. యామీ గౌతమ్ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో హృతిక్ అంధుడిగా నటించాడు.తన జీవిత భాగస్వామిని దూరం చేసినవారిపై అంధుడైన వ్యక్తి ఎలాంటి ప్రతీకారం తీర్చుకుంటాడన్నదే ఈ కథాంశం.

ఈ సినిమాలో హృతిక్ నటనకు మంచిపేరు వచ్చింది.. సినిమాకు ప్రేక్షకాదరణ కూడ బాగానే వచ్చింది. కాబిల్ సినిమాను ఫాక్స్ ఇంటర్నేషనల్ ప్రొడోన్స్ సంస్థ ఇంగ్లీషులో రీమేక్ చేయాలని భావిస్తోందట.. కాబిల్ దర్శకుడు సంజయ్ గుప్తా ఈ విషయం వెల్లడించారు.. ఇంతవరకు హిందీ సినిమాను ఇంగ్లీషులో రీమేక్ చేసిన దాఖలాలు లేవు.. అన్నీ అనుకున్నట్టు అయితే కాబిల్‌కే ఆ ఖ్యాతి దక్కుతుంది. ఇంగ్లీష వెర్షన్‌లో కూడ హృతిక్ నటించే అవకాశం ఉంది.. కాకుంటే ఇది ఇంకా కన్ఫర్మ్ కాలేదు.. హృతిక్ ప్రస్తుతం ఫ్యామిలీతో న్యూయార్క్ టూర్‌లో ఉన్నాడు.. అక్కడినుంచి వచ్చాక ఈ సినిమా గురించి అఫీషియల్ స్టేట్‌మెంట్ ఇచ్చే అవకాశముంది.

న్యూయార్క్ వేదికగా జరిగిన ఐఫా అవార్డుల వేడుకలో తనదైన శైలిలో కన్పించి ఆశ్చర్యపరిచింది శిల్పా.. కొత్తవాళ్లెవరైనా ఆమె వయసు 42 ఏళ్లంటే అస్సలు నమ్మే పరిస్థితి లేదు.. మొత్తానికి యోగా మహిమతో శిల్పా ఫిజిక్ మెయింటైన్ చేస్తున్న తీరుకు హ్యాట్సాఫ్ అనాల్సిందే..

తారాతీరం

నేనూ భాగమతినే..

మాయ .. అనే సినిమాతో పరిచయమైన భామ అవంతిక మిశ్రా.. ఇపుడీమె రెండో సినిమా చేసేస్తోంది.. వైశాఖం మూవీతో రాబోతోంది.. ఈ సినిమాలో బోలెడన్ని కమర్షియల్ హంగులు ఉంటాయని, తన కెరీర్‌లో వైశాఖం చాలా స్పెషల్ అంటోంది.. ఈ సినిమాలో అవంతిక పోషిస్తున్న పాత్ర పేరు భాగమతి కావటం విశేషం.. ప్రస్తుతం ఫిదా మూవీలో భాగమతిగా మలయాళ భామ సాయిపల్లవి హంగామాకు టాలీవుడ్ రెడీ అవుతోంది.. అవంతిక కూడ భాగమతి అనే పాత్రతో తన కెరీర్ టర్న్ అవుతుందని ఆశిస్తోంది.. ఈ కేరక్టర్ చాలా స్ట్రాంగ్ మెంటాలిటీ కలిగి ఉంటుంది. అలాగే తండ్రికి బాగా చేరువ.. రియల్ లైఫ్‌లో కూడ నేను తండ్రికి దగ్గరగా ఉండే అమ్మాయినే అని చెబుతోంది..

ఈషా గ్లామర్ గ్రామర్

పదేళ్ల క్రితమే మిస్ ఇండియా ఇంటర్నేషనల్ అవార్డు అందుకున్న ఈషా గుప్తా ఇపుడు ఫిలిం కెరీర్‌లో స్పీడ్ పెంచింది.. కొన్నేళ్ల పాటు మోడలింగ్‌ను ఎంజాయ్ చేసి .. జన్నత్2 మూవీతో అరంగేట్రం చేసిన ఈమె గత రెండేళ్లుగా చకచకా సినిమాలు చేసేస్తోంది.. హీరోయిన్‌గా స్పెషల్ ఐటెం డ్యాన్సర్‌గా చేయటంలో పాటు విలన్ పాత్రల్లో కూడ మెప్పించేస్తోంది. గ్లామర్ చూపించటానికి అసలైన మార్గం అయిన ఫొటో షూట్స్‌ను వదిలిపెట్టలేదు. రీసెంట్‌గా చేసిన ఓ ఫొటో షూట్‌లో అయితే అదరగొట్టేసింది..

కె.లీలా సువర్ణ

నొప్పితో బాధపడుతున్నారా ?

ఐతే మా డాక్టర్‌తో మాట్లాడండి. ఫోన్ : 903 056 1155

ఆస్టియో ఆర్థరైటిస్

కీళ్ళ అరుగుదల,
వాపులు,
మోకాళ్ళ నొప్పి,
నడుము నొప్పి,
ఆస్టియో పోరాసిస్

రుమాటాయిడ్ ఆర్థరైటిస్

కీళ్ళ వాపులు,
ఉదయం ఎక్కువ నొప్పి,
వేళ్ళ వాపులు,
RA ఫాక్టర్ పాజిటివ్,
తరుచు జ్వరం రావటం

గౌట్

కాలి బొటన
వేలు వాపులు,
రక్తంలో
ఆసిడ్ లెవల్స్
ఎక్కువగా ఉండటం

స్పాండిలైటిస్

సర్వైకల్ స్పాండిలైటిస్,
లంబార్ స్పాండిలైటిస్,
సిరోనెగిటివ్ ఆర్థరైటిస్,
సోరియాటిక్ ఆర్థరైటిస్
SLE ఆర్థరైటిస్, సయాటికా

మైగ్రేన్

వన్‌సైడ్ నొప్పి,
విపరీతమైన నొప్పి,
వాంతులు రావడం,
వీటిని దాదాపు
100 శాతం
నయం చేయవచ్చు

PCOD

గర్భాశయతిత్తి గడ్డలు,
ట్యూబ్స్ బ్లాకేజ్,
ఋతు సమస్యలు,
తరచు అబార్షన్,
హార్మోన్ సమస్యలు

www.drpositive.in

An ISO 9001 - 2000 Certified ®

పాజిటివ్ హోమియోపతి

మరింత సమాచారం కొరకు టోల్ ఫ్రీ : 1800 108 1900

బేగంపేట | అమీర్‌పేట | జూబ్లిహిల్స్ | కూకట్‌పల్లి | విక్రమ్‌పురి | A.S.రావు నగర్
కాచిగూడ | దిల్‌సుఖ్‌నగర్ | మెహిదీపట్నం | నిజామాబాద్ | హన్మకొండ | కరీంనగర్ | ఖమ్మం | తమిళనాడు

ఆదివారం వార్త

23 జూలై 2017

విషయ విశేషం

'సంఘీ'భావం
ఆహార వృధా, నష్ట నివారణతోనే
ఆహార భద్రత!.. 5
మూడో కన్ను
గోవుల గాండ్రింపు...6
కవర్‌స్టోరీ
డ్రగ్స్ పడగ!
ప్రమాదంలో దేశ భవిత!...8
ప్రేమ కథామాలిక
సష్టి..ప్రేమ వృష్టి!..14
సాహిత్యంలో ప్రేమ...18
కథ
సాగిపోయే ఖాళీలు.....20
ఈవారం కవిత్వం
కంటనీరు....23

మంచి ముత్యాలు

మనం ఇతరులకోసం ఏంచేస్తామో
అది మన శక్తికి నిదర్శనం.
మనం ఇతరుల కోసం ఏ బాధల్ని
అనుభవిస్తామో అది మన ప్రేమకు నిదర్శనం.
-బిబిఎస్.డబ్ల్యు.కాట్

చిత్రభారతి
అపజయం తెలియని అందగాడు....30
ఇంకా..కృతి, మొగ్గ,
నవ్వుల్.. రువ్వుల్, వాస్తు వార్త,
పదమథనం ..వారఫలం..
వగైరా... వగైరా.

భావ వీచిక

ఆదర్శ భారతీయుడు

ధనం పట్ల మనిషి వ్యవహరించే తీరే అతడి వ్యక్తిత్వాన్ని సూచిస్తుంది. 'ఫ్రీగా వస్తే ఫినాయిల్ అయినా తాగేస్తారు..'అనే మాటను తరచు వింటూ ఉంటాం. అది కొందరి విషయంలో నిజం. అలాగే ఏంచేస్తే ప్రభుత్వం నుంచి, లేదా ఇన్సూరెన్స్ సంస్థలనుంచి డబ్బు రాబట్టుకోవచ్చు అని కొంతమంది పథకాలు వేస్తుంటారు. నష్టపరిహారాలకోసం, బీమా డబ్బులకోసం ఇళ్లు కావాలని తగలబెట్టుకునేవారూ ఉన్నారు. ఇది తరచు మనకు తెలియవచ్చే విషయాలు. అయితే ఇందుకు భిన్నంగా నిజాయితీగా వ్యవహరించి, వచ్చే లక్షల్ని వద్దని చెప్పే వ్యక్తులు చాలా అరుదు. అటువంటి అరుదైన వ్యక్తులే ఇటీవల వార్తల్లోకెక్కారు. అమరనాథ్ యాత్రికులపై టెర్రరిస్ట్‌ల దాడి జరిగిన సందర్భంలో కొందరు మరణించడం, కొంతమంది గాయపడటం తెలిసిందే. అలా గాయపడినవారిలో బిల్లిమోరాకు చెందిన నట్వర్‌భాయి పటేల్, సుశీలాబెన్ పటేల్ దంపతులు కూడా ఉన్నారు. వీరు బ్యాంక్ ఉద్యోగాలు చేసి రిటైర్ అయినవారు. ప్రభుత్వం క్షతగాత్రులకు ఒక్కొక్కరికీ రూ.2లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించినా పై దంపతులు మాత్రం తమకు ఆ ఎక్స్‌గ్రేషియా అవసరం లేదని, తమకు అయిన గాయాలు స్వల్పమేననీ, అయినా తమ ఆర్థిక పరిస్థితి బాగానే ఉన్నదనీ, ఒకవేళ ముందుముందు ఏదైనా వైద్యం అవసరమైనా చేయించుకోగల స్థోమత తమకు ఉందనీ చెప్పి సహాయం అందుకునే వారి జాబితానుంచి తమ పేర్లు తొలగించమని వారు అభ్యర్థించారు. తమకెంత ఆస్తి ఉన్నా, ఇంకా ఇంకా కూడబెట్టాలనుకునే కొందరు రాజకీయ నేతలు, కొందరు అధికారులు వీరిని చూసి నేర్చుకోవలసింది ఎంతైనా ఉంది. ఆదర్శాలు మాటల్లోకాక చేతల్లో చూపే నట్వర్‌భాయ్‌లాంటి వారి అవసరం భారత్‌కు ఎంతైనా ఉంది. అప్పుడే అందరికీ మేలు జరిగేది. డబ్బు, ఆస్తులు ఏ కొందరి గుప్పిట్లోనో కాక అందరికీ సమంగా అందినప్పుడే భారత్ పేదరికం, ఆకలి కేకలు లేని సంక్షేమ భారత్‌గా అవతరించేది. ఏమైనా నట్వర్ భాయ్ జంట ఆదర్శనీయులు, అభినందనీయులు!

లేఖలు

విలువైన కవర్‌స్టోరీ

జూలై 9 వార్త ఆదివారం అనుబంధంలో 'కావవే' వరదా!' అరికట్టెదెలా?' కవర్‌స్టోరీ ఎంతో విలువైనదిగా ఉంది. తరచు బీభత్సం సృష్టించే వరద విపత్తులను, వాటిని అరికట్టడంలో శ్రద్ధచూపని వైనాన్ని, ప్రణాళికల అమలులో నిర్లక్ష్యాన్ని ఎంతో వివరంగా తెలియజేశారు. అందరిలో ఆలోచనను, అవగాహనను కలిగించే చక్కని ముఖచిత్ర కథనాన్ని అందించిన మీకు మా అభినందనలు.

-జి.సత్యసాయి, హైదరాబాద్; ఎన్.రాజేందర్, వరంగల్; వి.భాస్కర్, విజయవాడ.

కథ నచ్చింది...

జూలై 9 వార్త ఆదివారం అనుబంధంలో ప్రచురించిన 'అతడికై ఆమె ' కథ బాగుంది. రామ్, రేవతి పాత్రల చిత్రీకరణ చక్కగా ఉంది. ముఖ్యంగా రేవతి పాత్రను ఎంతో ఉదాత్తంగా తీర్చిదిద్దారు. మీకు మా అభినందనలు.

- డి.కళ్యాణి, నల్గొండ; ఆర్.బాబూరావ్, కడప.

వెరైటీ ప్రేమకథ

వార్త ఆదివారం మేగజైన్ జూలై 9 సంచికలో 'ప్రేమకథామాలిక' శీర్షికన అందించిన 'వలపు వాగ్దానం' కథ వైవిధ్యంతో అలరారింది. ఈ శీర్షికన వస్తున్న కథలన్నీ వేటికవి ప్రత్యేకంగా ఉండి, ప్రేమ భావన గురించిన వివిధ దృక్కోణాలను ఆవిష్కరిస్తున్నాయి. రచయిత కస్తూరి మురళీకృష్ణకు ధన్యవాదాలు.

-టి.నాగరాజ్, కాకినాడ; వి.లలిత, గుంటూరు.

అలరించిన అంశాలు..

జూలై 9 వార్త ఆదివారం మేగజైన్‌లో 'సంఘీ'భావంలో 'వృద్ధులకేదీ భరోసా?'.. వృద్ధుల దయనీయస్థితిని పిల్లల, ప్రభుత్వాల నిర్లక్ష్యధోరణిని చర్చించిన తీరుబాగుంది. 'అతడికై ఆమె' కథను రచయిత్రి చక్కగా నడిపారు. 'బోనాలు' ఆర్టికల్‌లో బోనాలను గురించిన వివరాలు బాగున్నాయి. ఫొటోలు కూడా దీటుగా ఉన్నాయి. వరదల గురించిన కవర్ కథనం ద్వారా అయినా ప్రభుత్వాల్లో కదలిక వచ్చి, వేగంగా చర్యలు చేపడితే బాగుండు. ఈవారం కవితలన్నీ బాగున్నాయి.

-డా.శివ భూషణం, కర్నూలు.

ముచ్చటైన మేగజైన్

జూలై 9 వార్త ఆదివారం మేగజైన్‌లో వంతెనల గురించిన 'భావవీచిక' ఆలోచింపచేసేదిగా ఉంది. 'సంఘీ'భావం వృద్ధులే కనిపించే దేవుళ్లు అన్న భావన పెంపొందించింది. 'కృతి' ద్వారా నూతన పుస్తక పరిచయభాగ్యం కలుగుతోంది. 'అతడికై ఆమె' కథాకర్తకు అభినందనలు. బ్యాక్ కవర్ ఎంతో ముచ్చటగా ఉంది.

-నేమాన సుభాష్‌చంద్రబోస్, విశాఖపట్నం.

‘సంఘీ’భావం

ఆహార వృధా, నష్ట నివారణతోనే ఆహార భద్రత!

దేశానికి ఇప్పుడు ఆహార భద్రత పెనుసవాలుగా మారింది. ఊబకాయం ఒకవైపు, ఆకలిచావు మరోవైపు భారతదేశ భిన్న పార్శ్వాలను, అసమానతలను చూపిస్తున్నది. దీనికి కారణాలు అందరికీ తెలుసు. కానీ ఆహార వృధా, నష్టాన్ని నివారించే సమగ్ర విధాన నిర్ణయమే కరువైంది.

ఆహార భద్రతను సాధించాలన్నా, ఆకలిచావులను నివారించాలన్నా, ఆకలిని భారత్‌నుంచి పారదోలాలన్నా దేశంలో అపారంగా జరిగే ఆహార వృధాను, ఆహార నష్టాన్ని సమర్ధవంతంగా అరికట్టాలి. ప్రధాని నరేంద్రమోడీ రెండు నెలల క్రితం తన ‘మన్ కీ బాత్’లో ఈ విషయంపైనే ఎక్కువసేపు మాట్లాడి ప్రజల్లో కొంత చైతన్యం తెచ్చారు. పాలకుల్లో, విధాన నిర్ణేతల్లో ఈ విషయంపై కొంత ఇప్పుడిప్పుడే చర్చ జరుగుతున్నది. అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చి చూస్తే భారతదేశంలో ఆహార వృధా, ఆహార నష్టం అపారంగా ఉంటున్నది. ముఖ్యంగా వ్యవసాయంలో పంట అనంతర అదనపు విలువను జోడించే ప్రయత్నం జరగపోవడంతోనే పంట ఉత్పత్తుల వృధా ఎక్కువగా కనిపిస్తున్నది. తెలుగు రాష్ట్రాల్లో ఇటీవల పళ్లు, కూరగాయలు, మిర్చి, ఇతర ఉత్పత్తులను రైతులు రోడ్లపై పోసి నిరసన తెలిపారు. టమాటాలను కూడా రోడ్లపై పారబోసి వ్యవసాయ ఉత్పత్తులకు పట్టిన ధరల గ్రహణాన్ని ఎత్తిచూపించారు. మరోవైపు ఆహార వృధా కూడా అసాధారణంగా ఉంది. కుటుంబం నుంచి సమాజందాకా ఆహార వృధాను తీవ్రంగా పరిగణించడం లేదు. పెళ్లిళ్లు, పేరంటాలు, హోటళ్లు, రెస్టారెంట్లు, పార్టీలు, లాడ్జీల్లో అవసరానికి మించి ఆహారాన్ని తయారుచేసి అది వినియోగించే వారు లేకపోవడంతో రోడ్లవెంట పారబోస్తున్నారు. కనీసం ఆకలి బాధతో ఉన్నవారికి పంపిణీ చేసే వ్యవస్థను కూడా ఏర్పాటు చేయడం లేదు. ఐక్యరాజ్యసమితికి చెందిన ఆహార వ్యవసాయ సంస్థ ఇటీవల చేసిన అధ్యయనంలో దేశంలో ప్రతి ఏటా 1.3 బిలియన్ టన్నుల ఆహారాన్ని వృధా చేస్తున్నారని తేలింది. ఇది ప్రతిరోజూ లక్షలాది మంది అన్నార్తుల ఆకలి తీరుస్తుందని ఆ సంస్థ పేర్కొన్నది. అయితే ఆహార వృధాను తగ్గించాలంటే ఫుడ్ బ్యాంక్ ఏర్పాటు చేయాలని, ప్రతి పట్టణంలో, ప్రతి పల్లెలో ఇవి ఉండాలని ఆ సంస్థ సూచించింది. ఇంట్లోకానీ, బయట కానీ మిగిలిన ఏ ఆహారాన్ని అయినా చెత్తలో వేయకుండా ఫుడ్ బ్యాంకులకు అందచేస్తే అవి అవసరమయిన పేదలకు అందచేస్తుందని తద్వారా ఆకలిని తీర్చగలుగుతామని ఆ సంస్థ పేర్కొన్నది. మరోవైపు దేశ ఆహార ప్రాసెసింగ్ మంత్రిత్వశాఖ చేసిన మరో అధ్యయనంలో దేశంలో ఏటా 92 వేల కోట్ల విలువ చేసే వ్యవసాయ ఉత్పత్తులు ప్రజల చేతులకు చేరకముందే చెడిపోతున్నాయని పేర్కొన్నది. ఈ నష్టం, వ్యవసాయానికి కేంద్రం ప్రతి ఏటా కేటాయించే 35 వేల కోట్లకు మూడు రెట్లు ఎక్కువగా ఉందని ప్రభుత్వ శాఖ ప్రకటించిందంటే ఆహార నష్టం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

దేశంలో పళ్లు, కూరగాయలు, ఆహారానికి ఉపయోగించే బియ్యం, గోధుమలు, మాంసం, చికెన్ సరైన ప్రాసెసింగ్ జరక్క 30శాతం దాకా కుళ్లిపోతున్నాయి. పంటపొలం నుంచి కుటుంబంలోని ఇంటిదాకా ప్రతి పంట చెక్కుచెదరకుండా చేరాలన్నా, వృధాగా చెత్తకుప్పలోకి వెళ్లకుండా ఉండాలన్నా సప్లై చైన్ మేనేజ్‌మెంట్ సక్రమంగా ఉండాలి. అంటే వ్యవసాయ పంటను సరైన రీతిలో ప్రాసెస్ చేయాలి. శీతలీకరణ వాతావరణంలో నిలువ ఉంచాలి. ప్యాకేజింగ్ సరిగ్గా ఉండాలి. కానీ ఇవేవీ సరిగ్గా లేకపోవడం వల్లనే రైతులు పొలాల్లోనే పంటకు గిట్టుబాటు ధర రాలేదని పశువులకు మేత పెట్టడం లేదా తగలబెట్టడం లేదా రోడ్లపై పారబోసి నిరసన తెలపడం లాంటి పనులు చేస్తున్నారు. ఇవన్నీ మన దేశంలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ వైఫల్యాలను సూచిస్తున్నాయి.

ఆహార వృధాను, నష్టాన్ని నివారించలేకపోవడంతో దేశంలో ప్రతిరోజు 20 కోట్ల మంది ఆకలితో అల్లాడిపోతున్నారు. 7 వేల మంది ఆకలితో చనిపోతున్నారు. ఇంతటి దయనీయ దృశ్యం మరెక్కడా లేదు. దేశంలో మొత్తం వ్యవసాయ ఉత్పత్తుల్లో 10 శాతం మాత్రమే కోల్డ్ స్టోరేజీల్లో ఉంటున్నదని మిగతా ఉత్పత్తులకు శీతలీకరణ సదుపాయం లేక రెండు మూడు రోజులకే పాడైపోతున్నాయని ఐఐఎం కలకత్తా అధ్యయనం వెల్లడించింది. పాడైపోయిన ఈ ఆహారాన్ని వృధాగా వదిలివేయడంవల్ల వాతావరణ సమతుల్యత కూడా దెబ్బ తీస్తున్నది.

ఆర్థిక వ్యవస్థకే కాకుండా భూతల ఉనికికి కూడా ఆహార వృధా, నష్టం వెల కట్టలేని విధంగా నష్టానికి కారణమవుతున్నది. ఫ్రాన్స్, అమెరికాలో ఫుడ్ బ్యాంకులు విస్తృతంగా ఉంటాయి. ఆహార వృధాను అక్కడ నిషేధించారు. ఎవరైనా ఆహారాన్ని వృధా చేసినా జరిమానాలు విధించేలా చట్టాలున్నాయి. సూపర్ మార్కెట్‌లు, హోటళ్లు, రెస్టారెంట్లు తమ దగ్గర ఆహారం మిగిలితే ఫుడ్ బ్యాంకులకు పంపించాలి. లేదంటే చారిటీ సంస్థలకు అప్పచెప్పాలి. ఇంకా లేదంటే రైతులకు పంటపొలాల్లో వినియోగించుకునేందుకు పంపిణీ చేయాలి. మిగులు ఉత్పత్తిని తిరిగి జాతి సంపద సృష్టికి వినియోగించాలి తప్ప చెత్తలోకి పంపిస్తే అవి తీవ్ర నేరాలుగా పరిగణిస్తారు. కానీ ఇక్కడ మన దేశంలో ఆహార వృధాను, నష్టాన్ని తగ్గించే సమగ్ర విధాన నిర్ణయం లేదు. శిక్షలు వేసే కఠిన చట్టాలు లేవు. అందుకే వృధా, నష్టం అనేది జాతిపాలిట శాపంగా మారింది.

విదేశాల్లో విజయవంతమైన పోస్ట్ హార్వెస్టింగ్ విధానాలను ఇక్కడ అమలు చేయడం లేదు. ఉదా: రేట్లు రాలేదని టమాటాలను, నిమ్మకాయలను, మిర్చిని మనం పారబోస్తున్నాం. కానీ ప్రభుత్వమే వీటిని మద్దతు ధరకు సేకరించి కోల్డ్ స్టోరేజీల్లో నిలువ చేసి వాటికి ప్రాసెసింగ్ ద్వారా అదనపు విలువను జోడించాలి. అంటే టమాటను ఎండబెట్టి ఏడాదివరకు వాడుకునేలా చేయవచ్చు. ఇంకా లేదంటే వాటితో సాస్, ప్యూరీ, పచ్చడిని తయారుచేయవచ్చు. రా సూప్‌ను తయారు చేయవచ్చు. మిర్చితో ఎండుకారం తయారుచేసి విదేశాలకు ఎగుమతి చేయవచ్చు. పళ్లు, కూరగాయలను కూడా శీతలీకరణలో నిలువచేసి పరిశుభ్రం చేసి రెడీమేడ్‌గా వాడుకునేలా సప్లై చైన్ మేనేజ్‌మెంట్‌ను పకడ్బందీగా నిర్వహించాలి. తద్వారా ఆహార వృధా, నష్టాన్ని తగ్గించి దాన్ని మానవ అవసరాలకు ఉపయోగించవచ్చు. ఆకలి లేని సమాజాన్ని సృష్టించవచ్చు.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

మూడో కన్ను

గోవుల గాండ్రింపు!

– ఎ.వి.వి. ప్రసాద్

జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, హర్యానా, మహారాష్ట్ర, అసోం, రాజస్థాన్ తదితర రాష్ట్రాలలో కొంత కాలం నుండి 'గోరక్షకులు' జరుపుతున్న దాడులు చూస్తే వాటి వెనుక గోరక్షణకంటె మరో సామాజిక వర్గాన్ని తమ కత్తులకు బలి చేయడమే లక్ష్యంగా కనిపిస్తుంది. ఈ ప్రతికూల పరిస్థితికి కారణం– గోరక్షణ పేరుతో రాజకీయ నాయకులు యువతను రెచ్చగొట్టడమే. గోవుకు మతం రంగునో, రాజకీయ రంగునో పులమడంవల్లనే అన్ని అనర్థాలు ఉత్పన్నమవుతున్నాయన్నది గమనించవలసి ఉంది. పార్టీల నాయకులు గోవును తమ రాజకీయ 'కేంద్రం'గా భావించడం మానేస్తే 'గోరక్షకుల' సంఖ్య కూడా తగ్గిపోతుంది. రెచ్చగొట్టేవారు లేకపోతే కొందరు గోవధకు కూడా దూరంగానే ఉంటారు. అంటే గోవధ జరుగుతున్నా, లేక దానిని నిరోధిస్తున్నామనే గోరక్షకులు పెరుగుతున్నా.. దానివెనుక ఉండేది రాజకీయ నేతలే!

గోవు పేరు చెప్పి కుట్రలు చేసెడి
కుటిల మతులు నేడు కొల్లలాయె;
కుప్ప కూలు జగము గోవులు గాండ్రించ
విశ్వవినుత నామ! వినురవేమ!!

గోవులు గాండ్రిస్తున్నాయి..ఆశ్చర్యంగా అనిపించినా, వాస్తవమే అది. గోవులు సాధుజంతువులు కదా! అవి అంబా అని జాలిగా మొరపెట్టు కుంటాయిగాని– పెద్దపులి వంటి క్రూరజంతువులా గాండ్రించడమేమిటి? అనే సందేహం కలగవచ్చు. కానీ దేశంలో ఇప్పుడున్న 'దృశ్యం' చూస్తే ఆవులు కూడా తమ రక్షణకోసం గాండ్రిస్తున్నాయనే అనిపిస్తుంది. 'గోరక్షణ' పేరుతో కొన్నిరకాల 'శక్తులు' దేశంలో 'హింసాత్మక ఘటనల'కు పాల్పడుతున్నపుడు వాటినుంచి గోవులను, బాధితులను రక్షించేదెవరు? అటువంటివారెవరూ కనిపించడమేలేదు. కానీ 'గోరక్షక దళాలు మాత్రం ఎక్కువవుతున్నాయి. ఆ దళాలు నిజంగా గోవులను రక్షిస్తున్నాయో, లేక ఆ తెరలమాటున గోవులనే భక్షిస్తున్నాయో ఎవరికి తెలుసు! గోవులను రక్షిస్తున్నామని చెప్పి ముఖాలకు ఆ ముసుగు తగిలించుకొని శత్రువర్గంపై దాడి జరపడానికి కొందరు ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు కూడా అన్ని చోట్లా ఎక్కువవుతున్నాయి. గోరక్షణ పేరుతో హింసాకాండ రానురాను శ్రుతిమించుతోంది కూడా. ప్రధాని మోడీ, రాష్ట్రపతి ప్రణబ్ ఇటీవల పలుమార్లు మీడియా ద్వారా 'గోరక్షకుల'కు హెచ్చరికలు చేస్తూనే ఉన్నా– దేశంలోని వివిధ ప్రాంతాలలో నిత్యం ఏదో ఒక చోట నుండి దాడులు, హింసాకాండ వార్తలు వినబడుతూనే ఉన్నాయి.

ముఖ్యంగా 'పశువుల సంత క్రమబద్ధీకరణ' కింద కేంద్రప్రభుత్వం గత మే 23న జారీచేసిన గెజిట్ నోటిఫికేషన్ తర్వాతనుండి ఈరకమైన హింసాకాండ మరింతగా పెరిగి పోయినట్లు కనిపిస్తుంది. ఆ నోటిఫికేషన్ పశువధకు వ్యతిరేకంగా ఇచ్చినదే అయినా, దానికి కూడా వక్రభాష్యం చెప్పి దానిపై 'స్టే' వచ్చేలా చేసిన ప్రబుద్ధులున్నందునే ప్రస్తుతం దేశంలోని గోవులవంటి సాధు జంతువులు పెనుప్రమాదంలో పడ్డాయనిపిస్తుంది.

పశువుల అమ్మకాలను క్రమబద్ధీకరించడంలో తప్పేముంది! నిబంధనల ప్రకారం, పశువులను అమ్మకానికి తెచ్చిన వ్యక్తి తాను వాటిని అమ్మబోయేది వధకోసం కాదని పశువుల మార్కెట్ కమిటీకి రాతపూర్వకంగా హామీ ఇవ్వవలసి ఉంటుంది. అలాగే వాటిని కొనుగోలు చేసేవారు కూడా వాటిని వధకోసం కాదనే హామీ పత్రం ఇవ్వవలసి ఉంటుంది. ఇది గోరక్షణకోసం తీసుకున్న ఒక మంచి చర్యే అయినా– దాని వల్ల ఏదో భూకంపం వస్తున్నట్లుగా కృత్రిమ సమస్యలను సృష్టించి మద్రాసు హైకోర్టు మదురై బెంచి నుంచి మే నెలాఖరులో కొందరు 'స్టే' సాధించారు.

కేంద్ర నిర్ణయం రాజ్యాంగ వ్యతిరేకమనీ, సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీసేదిగా ఉన్నదంటూ పిటిషన్లు దాఖలవడంతో మదురై బెంచి ఆ స్టేను మంజూరుచేసింది. నోటిఫికేషన్ అమలును నాలుగు వారాలపాటు నిలిపివేస్తూ కోర్టు ఇచ్చిన ఆ స్టేను కొనసాగించడానికి తర్వాత కొందరు సుప్రీంకోర్టుకు కూడా వెళ్లారు. దానిపై సుప్రీం కోర్టు జులై 11న తాజా ఉత్తర్వులిస్తూ మదురై బెంచి ఇచ్చిన స్టే దేశ వ్యాప్తంగా అమలవుతుందనీ, కేంద్రం తదుపరి నోటిఫికేషన్ విడుదల చేసేదాకా ఈ స్టే అమలులో ఉంటుందనీ పేర్కొంది. దాని వల్ల అర్థమవుతున్నదేమిటి? పశువధకు అభ్యంతరాలు లేవనేకదా! కోర్టు ఉత్తర్వులలో ఆ విషయం స్పష్టంగా చెప్పకపోవచ్చు. కానీ దేశంలో చాలామందికి ఆవిధంగానే అర్థమయినట్లు కనిపిస్తోంది. ఆ తర్వాత మళ్లీ వివిధ ప్రాంతాలలో హింసాకాండ పెరిగిపోయింది. అదే అదనుగా సంఘ వ్యతిరేకశక్తులు 'గోరక్షకుల' ముసుగు వేసుకొని రెచ్చిపోవడమూ కనిపిస్తోంది. సమాజంలో ఈవిధమైన 'అశాంతి'కి ఎవరు కారణం! ప్రశాంతంగా తన గడ్డి తాను తింటూ, ప్రజలకు కమ్మని పాలిస్తూ ఏదో ఓమూల 'గోశాల'లో ఎవరికీ పట్టని విధంగా బతికే ఓ సాధుప్రాణిని ఇలా అనవసరంగా రోడ్డెక్కించడమెందుకు! అన్నది ఆలోచించవలసి ఉంది.

ప్రశాంతంగా ఉన్న సరస్సులో రాయివేయడం వల్లే దేశంలో పలుచోట్ల 'కల్లోల పరిస్థితి' కనిపిస్తున్నదనడంలో తప్పులేదనిపిస్తుంది.

మహాత్మాగాంధి సబర్మతి ఆశ్రమం శతవార్షికోత్సవం సందర్భంగా జూన్ 29న అహ్మదాబాద్‌లో ప్రధాని మోడీ మాట్లాడుతూ ఈ 'గోరక్షకుల' బెడద గురించే ప్రధానంగా ప్రస్తావించడం గమనించవలసిన అంశం, దేశంలో కొన్ని శక్తులు గోరక్షకుల పేరుతో ఆగడాలు సృష్టిస్తున్నాయనీ, గోభక్తి పేరుతో మనుషులను కొట్టి చంపడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదనీ, అలాంటివారిపై కఠినచర్యలు తీసుకొంటామనీ మోడీ ఆ కార్యక్రమంలో మాట్లాడుతూ దేశంలోని అందరికి ఒక హెచ్చరిక వినిపించారు.

అయితే మోడీ ఆ హెచ్చరిక చేసిన కొన్ని గంటల వ్యవధిలోనే జార్ఖండ్‌లో మరో హత్య జరిగింది. పశు మాంసం రవాణాచేస్తున్నాడనే అనుమానంతో కారులోవెళ్తున్న ఓ వ్యక్తిపై కొందరు వ్యక్తులు దాడి జరిపి అతిదారుణంగా కొట్టిచంపారు. దానిని ఎవరు ఆపగలిగారు? ప్రభుత్వం ఆపలేకపోయింది, కోర్టూ ఆపలేకపోయింది. తర్వాత విచారణలు జరగడం, ఎవరికో శిక్షలు పడడం కాదు.. గోవు పేరు చెప్పి ఇలాంటి మారణకాండ ప్రబలడానికి బాధ్యులవుతున్న వారిని ఎవరూ ఎందుకు అదుపుచేయలేకపోతున్నారనేది ఆలోచించవలసి ఉంది.

గోహత్య మహాపాతకమని నమ్మే దేశం మనది. ఆ గోవును ఇంటి మహాలక్ష్మిగా కొలిచే దేశం మనది. గోవును పూజించకుండా కొత్త ఇంటి లోకి కూడా వెళ్లని ఉత్తమోత్తమ సంప్రదాయంగల దేశం మనది. అయినా గోహత్యలు పెరిగిపోతున్నాయి, ఆ హత్యలు అడ్డుకోవడాని కంటూ గోరక్షకులు జరిపే హత్యలూ పెరిగిపోతున్నాయి. వాటిని ఎక్కడో అక్కడ, ఎంతో కొంత నిరోధించడానికి జరిగే ప్రయత్నాలను అడ్డుకొనే వారూ ఎక్కువవుతున్నారు. ఈ 'అశాంతి'ని నిరోధించడానికి ఏ న్యాయస్థానాలూ చర్యలు తీసుకోలేకపోతున్నాయి!.

****

గోమాత అంటాం. అంటే గోవును తల్లిగా భావించి, అంతటి గొప్ప స్థానంలో ఉంచి పూజిస్తున్నాం. సాధుజంతువులలో సైతం మరి దేనికీ లభించని అత్యున్నత స్థానంలో ఆవును ఉంచుతున్నాం. పంచగవ్యాలు అంటే ఆవుపాలు, ఆవుపెరుగు, ఆవునెయ్యి, మూత్రం, పేడ.. ఈ ఐదింటిని కలిపి తయారుచేసే పదార్థాన్ని సేవిస్తే ఎన్నో రకాల రోగాల నుంచి ఉపశమనం లభిస్తుందని ఆయుర్వేద డాక్టర్లే కాదు, ఆధునిక శాస్త్రజ్ఞులు కూడా చెబుతున్నారు. అటువంటప్పుడు అంతటి గొప్ప లక్షణాలు గల గోవును కేంద్రంగా చేసుకొని హింసకు పాల్పడడమేమిటి? రాజకీయాలు నడపడమేమిటి? గోవును పూజించే సమున్నత స్థితినుంచి రాజకీయ సింబల్‌గా మార్చే దిగజారుడు ధోరణి అలవడడం దేనికి? గోవుచుట్టూ మనం తిరగడం మానేసి రాజకీయాన్ని తిప్పడంవల్లే ఈ దుస్థితి ఏర్పడుతోందనిపిస్తుంది.

పశువులను అమ్మడం, కొనడం తప్పు కాదు. రైతులుగాని, ఇతరులుగాని అటువంటి క్రయ-విక్రయాలు నిత్యం జరుపుతూనే ఉంటారు. కానీ ఆ క్రయ విక్రయాల లక్ష్యం వధ కాకూడదన్నదనే కేంద్రం జారీ చేసిన నోటిఫికేషన్‌లోని ప్రధాన ఉద్దేశం. దానిని పాటించడంవల్ల ఏ వర్గానికీ ప్రత్యేకంగా వచ్చే నష్టం ఏమీ ఉండదు.

పశువధ ముఖ్యంగా గోవధ మన లక్ష్యం కానప్పుడు నిబంధనలు ఉంటే వచ్చే నష్టం ఏముంటుంది? ఆ నిబంధనలు వ్యతిరేకిస్తున్నా మంటే మనసులో దురుద్దేశం ఉన్నదనే కదా అర్థం! అలాంటిది కొందరిలో ఉండడంవల్లే దానిని నిరోధించేవారూ ముందుకొస్తున్నారు. ఇద్దరిదీ హింసాత్మక ప్రవృత్తే అవుతోంది. తొలుత దానిని మనసుల నుంచి తొలగించుకోవలసి అవసరం ఉంది. ఒక ఆవును వధించకపోతే వచ్చే నష్టం ఎవరికీ ఉండదు. కేవలం వధించాలనే దురుద్దేశంతో అలాంటి పనులు చేసేవారు ఎక్కువవుతున్నారు. అందుకే గోరక్షకులూ బయల్దేరుతారు. కానీ ఆ గోరక్షకులు ఏదో ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకొని నిష్కారణంగా దాడులు జరపడంవల్లే అనవసరంగా 'అశాంతి' కమ్ముకొంటోంది.

జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, హర్యానా, మహారాష్ట్ర, అసోం, రాజస్థాన్ తదితర రాష్ట్రాలలో కొంత కాలం నుండి 'గోరక్షకులు' జరుపుతున్న దాడులు చూస్తే వాటి వెనుక గోరక్షణకంటె మరో సామాజిక వర్గాన్ని తమ కత్తులకు బలి చేయడమే లక్ష్యంగా కనిపిస్తుంది. ఈ ప్రతికూల పరిస్థితికి కారణం- గోరక్షణ పేరుతో రాజకీయ నాయకులు యువతను రెచ్చగొట్టడమే. గోవుకు మతం రంగునో, రాజకీయ రంగునో పులమడంవల్లనే అన్ని అనర్థాలు ఉత్పన్నమవుతున్నాయన్నది గమనించవలసి ఉంది. పార్టీల నాయకులు గోవును తమ రాజకీయ 'కేంద్రం'గా భావించడం మానేస్తే 'గోరక్షకుల' సంఖ్య కూడా తగ్గిపోతుంది. రెచ్చగొట్టేవారు లేకపోతే కొందరు గోవధకు కూడా దూరంగానే ఉంటారు. అంటే గోవధ జరుగుతున్నా, లేక దానిని నిరోధిస్తున్నామనే గోరక్షకులు పెరుగుతున్నా.. దానివెనుక ఉండేది రాజకీయ నేతలే!

గోవు విషయంలో రాజకీయ పార్టీలకు తొలుత ఒక స్పష్టమైన వైఖరి ఉంటే తర్వాత వారి కార్యకర్తలు, ప్రజలు తేలికగానే అనుసరిస్తారు. ఒక పార్టీ గోవధకు వ్యతిరేకంగా ఏదైనా మాట్లాడి నపుడు మరో పార్టీ దానికి వ్యతిరేకంగా మాట్లాడడంవల్ల ఆయా పార్టీల కార్యకర్తలు, ప్రజలలో అయోమయం పెరిగిపోయి హింసాత్మకఘటనలు జరగడానికి కారణమవుతోంది. ముందు ఈ పరిస్థితిలో మార్పు రావాలి.

దేశంలో అన్ని పార్టీల లక్ష్యం గోవధకు వ్యతిరేకమనే సందేశం ప్రజల్లోకి వెళ్తే అన్ని వర్గాల వారిలోను సహజంగానే దానికి అనుగుణమైన మార్పు వచ్చేస్తుంది. అప్పుడు ప్రత్యేకంగా గోరక్షకుల అవసరమే ఉండదు. గో రక్షకుల ముసుగులో అసాంఘిక కార్యకలాపాలు జరగడం కూడా తగ్గిపోతుంది. సమాజంలో ఏ వర్గానికి నష్టం రాని విధంగానే ప్రతి పార్టీ వ్యవహరించాలిగాని ఏదో ఒక వర్గానికి కొమ్ము కాయకూడదు కదా!

ప్రధాని మోడీ జూన్ 29న సబర్మతి ఆశ్రమంలో ఇచ్చిన సందేశం తర్వాత జూలై 16న అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతూ కూడా గోరక్షకుల పేరుతో జరుగుతున్న హింసపై మరోమారు హెచ్చరికలు చేశారు. అంటే గడచిన మూడు వారాల్లో పరిస్థితి మారలేదనే కదా అర్థం. అందుకే గోరక్షకులకు హెచ్చరికలు జారీ చేయడంతోపాటు, గోవధకు పాల్పడేవారికి హెచ్చరికలు చేయడంతోపాటు దేశమంతా 'స్వచ్ఛభారత్' తరహాలో అన్ని పార్టీలు కలిసి 'గోరక్షా భారత్' వంటి కార్యక్రమం చేపట్టేలాచేస్తే నిజమైన ప్రయోజనం కలుగుతుందనిపిస్తుంది. గోరక్ష అనేది ఏదో ఒక పార్టీకి సంబంధించిన అంశం కాదనీ, అన్ని పార్టీలు కలిసి ప్రచారం చేస్తే ప్రజలలో కూడా సత్వర మార్పు వస్తుందనీ ముందుగా ఆయా పార్టీల నేతలు కూడా గ్రహించవలసి ఉంది.

ఈ నేపథ్యంలో ఆవును జాతీయ జంతువుగా ప్రకటిస్తే తప్పక అదనపు ప్రయోజనం చేకూరుతుంది. ప్రస్తుతం మన దేశ జాతీయ జంతువుగా క్రూరమృగమైన పులి ఉంది. ఆ స్థానంలో గోవును జాతీయ జంతువుగా ప్రకటిస్తే గోవధకు వ్యతిరేకంగా శాంతియుత కృషి జరిపినట్లవుతుంది. 1972లో వన్యప్రాణి సంరక్షణ చట్టం అమలులోకి వచ్చినప్పటినుంచి 'రాయల్ బెంగాల్ టైగర్' జాతీయ జంతువుగా కొనసాగుతోంది. దృఢ సౌష్టవం, గాంభీర్యం, చురుకుదనం మొదలైన అంశాలను దృష్టిలో ఉంచుకొని అప్పట్లో పులిని జాతీయ జంతువుగా ఎంపిక చేశారు. కానీ గోవును జాతీయ జంతువుగా చేస్తే దేశ ప్రతిష్ఠ ఇనుమడించడంతోపాటు గోవధను పూర్తిగా నిరోధించడానికి కూడా శాంతియుత మార్గం ఏర్పరచి నట్లవుతుంది. ఈ విషయంలో రాజస్థాన్ హైకోర్టు ఇటీవల వ్యక్తం చేసిన అభిప్రాయం కూడా సబబే అనిపిస్తుంది.

రాజ్యాంగంలోని 48, 51ఎ (జి) అధికరణం ప్రకారం ఆవులకు తగిన రక్షణ కల్పించడంతోపాటు వాటిని పూర్తిగా సంరక్షించడం మన విధి. ఆ విధిని సక్రమంగా నెరవేర్చడం ప్రతి భారతీయుని బాధ్యత. ఆ బాధ్యతను ప్రతిఒక్కరు తెలుసుకొనేట్లుగా చేయడం ప్రభుత్వ కర్తవ్యం. ఇందుకు అన్ని పార్టీలు తప్పనిసరిగా ఒక్క మాటపై ముందుకు కదిలితే ప్రత్యేకంగా గోరక్షకులూ అవసరం లేదు, వారి ముసుగులో అక్రమాలకూ తావుండదు. ఇది గ్రహించాలి. కేంద్రం కూడా అప్పుడప్పుడు ఏవో ప్రకటనలు చేయడంతో సరిపెట్టకుండా నిజమైన చిత్తశుద్ధితో ఏకీకృత కార్యాచరణ ప్రారంభించాలి. దానికోసమే గోవులు గాండ్రిస్తున్నాయి.

డ్రగ్స్ పడగ!

ప్రమాదంలో దేశ భవిత!

కవర్ స్టోరీ

ఎన్.నారాయణ స్వామి
సీనియర్ జర్నలిస్ట్.

మనిషిని నిర్వీర్యుణ్ణి చేయడానికి బ్రౌన్ షుగర్, భంగ్, గంజాయి, హెరాయిన్, మార్జువానా, హషిష్ వంటివి నీడల్లా వెంటాడుతున్నాయి. మాదక ద్రవ్యాలు వివిధ దేశాల్లో అనేక రూపాలు, పేర్లతో దర్శనమిస్తుంటాయి. మాదకద్రవ్యాల క్షుద్రవ్యాపారం నలుదిక్కులా వేగంగా విస్తరిస్తోంది. మాదక పదార్థాలు వాడటం మొదలుపెట్టగానే మనిషిని నిర్వీర్యం చేసి వారి జీవితాలలో చీకటి కోణాలను ఆవిష్కరిస్తాయి. మానసిక బలహీనతలను అవకాశంగా చేసుకొని మత్తుమందుల్ని విక్రయించి సొమ్ముచేసుకునే విషసంస్కృతి హేయమైంది. మాదకపదార్థాలకు బానిసలైన వారి జీవితాలు చీకటి బతుకులే అని చెప్పవచ్చు. మాదకపదార్థాలను తీసుకున్నప్పుడు తెలియని ఉత్సాహం, ఆనందం ఉంటుంది. మందు ప్రభావం తగ్గిపోయిన తర్వాత బాధలకోరల్లో ఇరుక్కుని నానా అవస్థలు పడుతుంటారు. మత్తుమందుల విషవలయంలో చిక్కుకున్న వ్యక్తులు బయటపడలేక నికృష్ట జీవితాలను గడుపుతుంటారు. సాధారణ జీవితంలోకి తిరిగి రాలేక నరకం అనుభవించేవారెందరో. ఇప్పుడు డ్రగ్స్ రాకెట్లు మన భాగ్యనగరంలోని కాలేజీలను, స్కూళ్లను కూడా టార్గెట్ చేయటం అందరికి ఆందోళన కలిగిస్తోంది. భావితరం మాదకద్రవ్యాల మత్తులో నిర్వీర్యమయ్యే ప్రమాదం ఎంతైనా ఉంది. ఈ నేపథ్యంలో మాదక ద్రవ్యాల తయారీ, అక్రమరవాణా, డ్రగ్స్ రాకెట్ల చీకటి వ్యవహారాలు..నియంత్రణ వ్యవస్థ తీరుతెన్నులు..వగైరా, వగైరా అంశాల సమగ్ర కథనం ఈవారం మీకోసం....

క్షణికానందం కోసం ఎందరో నూరు వసంతాల జీవితాన్ని బుగ్గిపాలు చేసుకుంటున్నారు. మానసికంగా దెబ్బతిన్న లెక్కలేనంతమంది మత్తుమందును ఆశ్రయిస్తున్నారు. స్మగ్లింగ్ కింగ్‌లకు 'నార్కోటిక్ మాఫియా' ప్రపంచ నలుమూలలకీ మాదకద్రవ్యాల్ని చీకటి మార్గంలో రవాణా చేయడానికి అనుసరిస్తున్న వ్యూహాలు దేశాధినేతలకే సవాళ్లుగా నిలుస్తున్నాయి. కూరగాయల బస్తాల్లో, ఆడియో క్యాసెట్లలో, జంతువుల శరీరాల్లో గంజాయి, హెరాయిన్ వంటి మత్తుమందుల్ని అమర్చి ఎగుమతులు చేస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా, కోటానుకోట్ల వాణిజ్యంగా ఎదిగిన డ్రగ్స్ రవాణాకి 'భారతదేశమే' హైవే అని అంతర్జాతీయ నివేదికలు ఘోషిస్తున్నాయి. ఎక్కడెక్కడి మాదక ద్రవ్యాలు ముందుగా మన దేశానికి చేరుతున్నాయి. ఈ దేశం నుంచే ఇతర దేశాలకూ 'భద్రంగా' రవాణా అవుతున్నాయి. హైటెక్ యుగంలో కొత్తరకం బిజినెస్ ట్రిక్కులను స్మగ్లింగ్ కింగ్‌లు అనుసరిస్తున్నారు. ఈ విష వ్యాపారానికి అడ్డుతెర వేయడానికి తీసుకుంటున్న చర్యలు నామమాత్రమే! 'డ్రగ్స్ వ్యాపారం' నేటి ప్రపంచానికి ఓ ప్రమాద సూచి. విశ్వవ్యాప్తంగా పాకిన ఈ మత్తు జబ్బును మట్టుబెట్టడానికి ప్రపంచంలోని అన్ని దేశాలు కార్యాచరణ రూపొందించి గట్టిచర్యలు తీసుకోవటం తక్షణ కర్తవ్యం. తర్వాత చేపట్టే ప్రతి చర్యా ఫలితాలను ఇవ్వదు.

'డ్రగ్స్' పిడికిట్లో వేలాదిమంది యువత చిక్కుకుపోయి వారి జీవితాలను బలిచేసుకుంటున్నారు. మాదక పదార్థాల దొంగరవాణా విషయంలో దేశం కూడా సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తుంది.

అమెరికా, యూరోపియన్ దేశాలకు 'గోల్డెన్ ట్రయాంగిల్' ప్రాంతంలోని మత్తు పదార్థాలు భారతదేశం గుండానే రవాణా చేస్తున్నారు. వేరే దేశాల సరిహద్దుల నుంచి డ్రగ్స్ విస్తృత స్థాయిలో భారత దేశానికి దిగుమతి అవుతున్నాయి. నల్లమందు, గంజాయి నేపాల్‌లోని టెరాయ్ ప్రాంతంగుండా దేశంలోకి ప్రవేశిస్తున్నాయి. ఇండో-నేపాల్ సరిహద్దులు తెరిచి ఉండడంతో ఈ డ్రగ్స్ సులువుగా రవాణా అవుతున్నాయి. పాకిస్థాన్ దేశం నుంచి పెద్ద ఎత్తున మత్తు పదార్థాలు జమ్ము-కాశ్మీర్, రాజస్థాన్, పంజాబ్, గుజరాత్ రాష్ట్రాలకు రవాణా అవుతున్నాయి. గతంలో పాకిస్థాన్, భారతదేశం సరిహద్దులో యుద్ధ వాతావరణం అలుముకుని, సరిహద్దును మూసివేసిన తర్వాత వివిధ మత్తుపదార్థాల రవాణా తగ్గింది. గుజరాత్, కాశ్మీర్, రాజస్థాన్ రాష్ట్రాల సరిహద్దులో గట్టిచర్యలు తీసుకోకపోవడం వలన పరిస్థితి దారుణంగా ఉంది. భారతదేశంలోని పశ్చిమప్రాంతం రేవులకు పాకిస్థాన్ నుంచి మత్తుపదార్థాలు చేరుతుంటాయి. ఇక్కడ నుంచి ఈ పదార్థాలను అరబ్బు దేశాలకు రవాణా చేస్తున్నారు. ఈశాన్య సరిహద్దుల్లో ఉన్న మోరె గ్రామం పేరు చెప్పగానే మాదకద్రవ్యాల పుట్టినిల్లుకదా అంటారు. దేశ సరిహద్దులో ఉన్న ఆ గ్రామం పేరు మారుమోగిపోతుంది. డ్రగ్స్ ఉత్పత్తిలో అగ్రగాములైన 'గోల్డెన్ ట్రయాంగిల్' (మియన్మార్, లావోస్, థాయిలాండ్) దేశాల నుంచి మాదకద్రవ్యాలు నేరుగా మోరె గ్రామానికి చేరుతున్నాయి. గోల్డెన్ ట్రయాంగిల్ ప్రాంతం మణిపూర్ 150కి.మీ.దూరంలో ఉండటంతో

పరిస్థితి మరింత క్లిష్టంగా తయారైంది. ఈశాన్య రాష్ట్రాలు మాదక ద్రవ్యాల దొంగరవాణా వల్ల తీవ్రంగా బలపడుతున్నాయి. ఈశాన్య రాష్ట్రాల ప్రజలు, సరిహద్దు దేశ ప్రజల భాష, సంస్కృతులతో సామీప్యం కలిగి ఉండటంతో మాదకద్రవ్యాల అక్రమరవాణా మరింత సులభసాధ్యమవుతోంది. భారతదేశం నుంచి బంగ్లాదేశ్, శ్రీలంక,, మాల్దీవులకు బ్రౌన్ షుగర్ రవాణా అవుతోంది. భారతదేశంలోని ఈశాన్య రాష్ట్రాల సరిహద్దుల్లోని దట్టమైన అడవులగుండా మత్తు పదార్థాల రవాణా జోరుగా సాగుతోంది. ఈశాన్య రాష్ట్రాలు బర్మాతో వెయ్యి కి.మీ. సరిహద్దును కలిగి ఉన్నాయి. బర్మానుంచి మిజోరం, మణిపూర్, నాగాలాండ్, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాలకు హెరాయిన్ పెద్దమొత్తంలో దిగుమతి అవుతోంది. షాన్ ఇండిపెండెంట్ ఆర్మీ, కరెన్ ఇండిపెండెంట్ ఆర్మీ బర్మాస్ కమ్యూనిస్ట్ పార్టీ వంటి తీవ్రవాద సంస్థలు హెరాయిన్‌ను స్మగ్లింగ్ చేస్తున్నాయి. ముంబైని ప్రధాన కేంద్రంగా చేసుకున్న దావూద్ ఇబ్రహీం, చోటా రాజన్ ముఠాలు ఇప్పటికీ దహను, బెంచూర్, పాల్‌గడ్, జహిసర్ లలో డ్రగ్‌డెన్‌లు నడుపుతున్నాయి. వీటిలో హెరాయిన్, ఓపియమ్ (నల్ల మందు) తయారుచేస్తుంటారు. ఈ మత్తుపదార్థాలలో ఉపయోగించే ఎసిటిక్ ఎన్‌హైడ్రేడ్ అనే ద్రవం ఏటా దాదాపు వంద టన్నుల చొప్పున మన దేశంలోకి వచ్చి చేరుతోందని అధికారులే పేర్కొంటున్నారు. ఇది ఈశాన్య ప్రాంతాలనుంచి పాకిస్థాన్ సరిహద్దుల నుంచి వస్తుంది. రాజస్థాన్, మహారాష్ట్రల్లో ఈ ద్రవపదార్థంతో డగ్స్‌ను రూపొందించే కుటీరపరిశ్రమలు ఉన్నాయని చెబుతున్నారు. రసాయన శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో రహస్య ప్రయోగ శాలల్లో మాదకద్రవ్యాల్ని తయారుచేస్తున్న పాతకాలపు పద్ధతులు అక్కడక్కడా కనిపిస్తూనే ఉన్నాయి. అఫ్ఘనిస్థాన్‌లో 'లెన్సింగ్' అనే పాత పద్ధతి ద్వారా ఓపియమ్‌ను సృష్టించే ప్రాసెసింగ్ యూనిట్లు అనేకం ఉన్నాయి. పాపి మొక్కల భాగాల్ని, ఆకుల్నీ కలిపి ముద్దగా చేసి, వాటికి ఈ మొక్కల్నుంచీ స్రవించే పాలను కలిపి, ఆపైన రకరకాల కార్బన్ పదార్థాలు చేర్చి ఓపియమ్‌ను తయారుచేస్తారు. లెన్సింగ్ పద్ధతిలో డ్రగ్స్‌చేసే ప్రాంతంలో పెద్దపొయ్యిలు, మసి బారిన రాగి పాత్రలతో ఆ వాతావరణమే అసహ్యంగా ఉంటుంది. నల్లమందుకు నిమ్మరసం చేరిస్తే మార్ఫిన్ తయారవుతుంది. గంజాయికి మరికొన్ని మాదక, సుగంధ ద్రవ్యాల్ని చేర్చి 'భంగు'ను తయారుచేస్తున్నారు. దీన్ని భారత్‌లో ఎక్కువగా తయారుచేస్తారు. పాకిస్థాన్ సరిహద్దులు దాటి వచ్చే చొరబాటుదార్లు హెరాయిన్, ఓపియమ్, బ్రౌన్‌షుగర్, ఎల్‌ఎస్‌డి లాంటి డ్రగ్స్‌ను తీసుకువస్తారు. గోల్డెన్ క్రెసెంట్ దేశాల స్మగ్లింగ్ ముఠాలు పాకిస్థాన్‌లోని ఉమర్‌కోట్, ఖిప్రో, చాబ్రో, సియోల్ కోట్ ప్రాంతాలలో స్థావరాలను ఏర్పాటు చేసుకుని రహస్యంగా ఇక్కడనుంచి భారత్‌కి మత్తుపదార్థాలను సరఫరా చేస్తున్నారు. ఈ స్మగ్లింగ్ ముఠాలకు చెందిన ప్రతినిధులు జైసల్మీర్, గంగానగర్, జమ్ము, పంజాబ్‌ల్లోని కొన్నిప్రాంతాలలో ఉన్నారు. ఈ ప్రతినిధులకు పాక్‌నుంచి హెరాయిన్, ఓపియమ్, మార్ఫిన్, హాషిష్, ఎల్‌ఎస్‌డిలతో బాటు ఎసిటిక్ ఎన్‌హైడ్రేడ్ కూడా వీళ్లకి చేరుతుంది. ఆతర్వాత మాఫియా ప్రతినిధులు ఢిల్లీకి చేరవేస్తున్నారు. వీలునుబట్టి ఢిల్లీనుంచి మత్తుమందులను అమెరికా, బ్రిటన్‌లకు, ఇతర యూరప్ దేశాలకు ఎగుమతి చేస్తుంటారు. పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు మాఫియా ప్రతినిధులు ఢిల్లీ దళాలు ప్రముఖుల నివాసాల మధ్య నివాసాలు నెలకొల్పుకున్నారు.

ముంబయి నుంచే సులభం...

మాదకద్రవ్యాల అక్రమరవాణా ముంబయి నుంచి అయితే మరీ సులభమని విదేశీ నార్కొటిక్ ప్రతినిధుల అభిప్రాయం. ఈ ప్రతినిధులు స్థానిక మాఫియాలీడర్లతో భాగస్వామ్యం పంచుకొంటున్నారు. బడాముఠాలకు చెందినవారే కాకుండా చిన్నాచితక గుండాలతోను విదేశీ నార్కో ప్రతినిధులకు సంబంధాలున్నాయి. కస్టమ్స్ ఎక్సైజ్ చట్టాల బారిన పడకుండా ఉండేందుకు స్మగ్లర్లు అనేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పొరుగుదేశాల నుంచి వచ్చే మత్తు పదార్థాలను నార్కో ప్రతినిధులు, ముంబయి మాఫియా గ్యాంగులు తెలివితేటలతో స్వాధీనం చేసుకుంటారు. కస్టమ్స్, ఎక్సైజ్ చట్టాల బారిన పడిన దాఖలాలు చాలా తక్కువ. కస్టమ్స్ బలహీనతను స్మగ్లర్లు ఆసరాగా తీసుకుని విదేశీ సరుకును పెద్ద ఎత్తున దిగుమతి చేసుకుంటున్నారు. గల్ఫ్ దేశాలకు పేపర్ ఎగుమతి పేరుతో పర్మిట్లు సంపాదించి హెరాయిన్ నిర్భయంగా దేశం దాటిస్తున్నారు. కస్టమ్స్, ఇతర అధికారులతో కుమ్మక్కై ముంబాయి అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి అమెరికా, బ్రిటన్, నైజీరియాలకు డ్రగ్స్‌ను ఎగుమతి చేస్తున్నారు. కార్గోషిప్‌ను కేవలం పదిశాతంమాత్రమే తనిఖీ చేయగలంకానీ,మొత్తం తనిఖీ చేయడం, అయ్యేపనికాదని కస్టమ్స్ అధికారులంటున్నారు.

అరికట్టలేరా?

'మాఫియా ముఠాలపైన కన్నేసి, ఈ మాదకద్రవ్యాలను అరికట్టలేకపోతోంది భారత్' అని అంతర్జాతీయస్థాయిలో చర్చ జరుగుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మాఫియా ముఠాలపైన అగ్రదేశాలన్నీ కన్నేసి ఉంచాయి. స్మగ్లర్లకు రక్షణ కల్పించే ప్రదేశం భారత్. ఈ దేశాన్ని మించిన క్షేమకరమైన ప్రదేశం మరొకటి లేదని 'ఇండియాని' స్మగ్లర్లు గొప్పగా మెచ్చుకోవడాన్ని బట్టి దేశం దీనిపట్ల ఎంత శ్రద్ధ వహిస్తుందో అర్థం అవుతుంది. ఇప్పటికీ ముంబాయిలో ముఠాలు మాండ్రెక్స్‌ను ఒక మాత్ర రూపాయికి (చాక్లెట్ కంటే చీప్‌గా) విక్రయిస్తున్నారు. ఇలాంటివాటిని కూడా అరికట్టే నాధుడే కరువయ్యారు. ఎన్‌సిబి పోలీసు యంత్రాంగంలో తగినంత మందిని నియమించక పోవడం వల్లనే మాఫియా ముఠాల సభ్యులకు ఈ మాత్రలను సులువుగా విక్రయించగలుగుతున్నారు. మన దేశాన్ని పట్టి పీడిస్తున్నది టెర్రరిజమ్ ఒక్కటే కాదు, నార్కో టెర్రరిజమ్ కూడా. పాక్ తీవ్రవాద సంస్థలు (ఐఎస్ఐ) ప్రోత్సాహంతో భారత్‌కు మాదక ద్రవ్యాలు చేరుతున్నాయి. గతంలో పంజాబ్ పోలీసులు జరిపిన విస్తృత దాడుల్లో నార్కో టెర్రరిజమ్ జాడలు బయటపడ్డాయి. ఖలిస్తాన్ కమాండోఫోర్స్‌కి చెందిన 'జబ్బర్ ఖల్సా'కు హాషిష్, స్మాక్ డ్రగ్స్ గుట్టుగా చేరుతుండటమే. వీళ్ల మాదక ద్రవ్యాల్ని ప్రార్థనా మందిరాల్లో భద్రపరిచి నప్పుడు పంజాబు పోలీసులు ఆకస్మికదాడులు జరపడంతో ఈ బండారం బయటపడింది.

యువత లక్ష్యంగా..

పాకిస్థాన్ ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్ (ఐఎస్ఐ) కన్ను భారత యువత మీద ఉంది. యువత బలహీనతను ఆసరాగా తీసుకుని మాదకద్రవ్యాలు వారికి అందేటట్లుచేస్తోంది. పాకిస్థాన్ నుంచి తమిళనాడుకు ఛరస్‌ను చేరవేస్తున్నారు. మదురై చుట్టుపక్కల ఛరస్ బానిసలైన యువకులనేకులకు 'ప్రసాద్ థెలీ' అన్న కోడ్‌లతో మదురై ప్రాంతాలలో ఛరస్ దొరుకుతుంది. భారత్‌లో రైతులకు రుణాలు ఇచ్చి మాదకద్రవ్యాల పంటను పండిస్తున్నారు. గోల్డెన్ ట్రయాంగిల్ క్రెసెంట్‌ల్లో కూడా రైతులకు ఆర్థిక సహాయం చేసి మాదకద్రవ్యాల పంటను పండిస్తున్నారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్, మనాలీల్లో కాన్‌బిస్, పాపీల సాగు సాగుతోంది. ఐదువేల హెక్టార్లలో కోక్, పాపీ, కాన్‌బిస్‌లను పండిస్తున్నట్లుగా ఇంటర్నేషనల్ నార్కొటిక్స్ స్ట్రాటజీ రిపోర్ట్ వెల్లడించింది.

తెలుగు రాష్ట్రాల్లో గంజాయి...

ఆంధ్రరాష్ట్రంలోని కోస్తా, తెలంగాణ రాష్ట్రంలో పలు జిల్లాలు గంజాయి వాసనలతో దద్దిరిల్లుతున్నాయి. శీలవతి, జటారు, గుండా రకాల గంజాయిని పండిస్తున్నారు. విశాఖజిల్లాలోని పాడేరు అడవుల్లోను, నల్లమల అడవుల్లోను జ్ఞానపత్రిని సాగుచేస్తున్నారు. వరంగల్, నిజామాబాద్ జిల్లాలో అయితే గోప్యంగా కాకుండా, పబ్లిక్గానే గంజాయిని పండిస్తున్నారు. ఎక్సైజ్‌వారు గంజాయిని స్వాధీనం చేసుకుని తగులబెడుతున్నా మరోపక్క గంజాయిపంట పండుతూనే ఉంది. గిరిజన ప్రాంతాల్లో ఎక్సైజ్ వారు గంజాయిని స్వాధీనం చేసుకుంటే గిరిజనులు వారికి అడ్డుతగిలిన సందర్భాలు అనేకం.

మనిషిని నిర్వీర్యుణ్ణి...

మనిషిని నిర్వీర్యుణ్ణి చేయడానికి బ్రౌన్ షుగర్, భంగ్, గంజాయి, హెరాయిన్, మార్జువానా, హషిష్ నీడలా వెంటాడుతున్నాయి. ఈశాన్య ఆఫ్రికా దేశాలు యెమెన్‌లలో పొగాకు మాదిరి 'కాత్' ఆకుల్ని నమలడం అలవాటు. ఉ.అమెరికా, ఆగ్నేయాసియా దేశాల్లోని పట్టణ ప్రాంత యువకులు హెరాయిన్‌ను తీసుకుంటారు. ఉత్తర భారత్‌లో పెరిగే 'కానబిస్ సటీవా' అనే ఆకులనుంచి, పువ్వుల నుంచి తయారయ్యేది' మార్జువానా. ఈ మొక్కనుంచి తయారయ్యే మరో మాదక ద్రవ్యం హషిష్, అరేబియా, టర్కీ ఈజిప్టులలో కూడా హషిష్ మొథాక్వాలస్‌లాంటి 'డిప్రెసెంట్లు', కొకైన్,కెఫిన్, నికోటిన్‌లాంటి 'స్టిమ్యులెంట్లు' సర్వసాధారణం.

దేశందాటితే...

మాదకద్రవ్యాలు భారత్‌ను దాటిన దగ్గర నుంచీ అంతర్జాతీయ మార్కెట్‌లో వాటి వ్యాపారం ఊపందుకుంటుంది. అమెరికా, బ్రిటన్‌లలో ఉన్న 'కొకైన్ కార్టెల్స్', 'లాకోసా నాస్ట్రా', 'మాఫియా గ్రూప్స్' ముఠాల ప్రతినిధుల ద్వారా భారీ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. ఈ ప్రతినిధులు వీధి బాలల్నీ, నిరుద్యోగులైన యువతీయువకుల్నీ ఎన్నుకొంటారు. వీళ్లని టూరిస్టు, స్టూడెంట్ వీసాల మీద వివిధ దేశాలకు పంపి చీకటి సామ్రాజ్యాన్ని విస్తరింపజేస్తున్నారు. ఇలా దేశాలు పట్టి తిరిగేవాళ్లలో నైజీరియన్‌లు అగ్రగణ్యులు. ఈప్రాంతంలో డ్రగ్స్ ఉత్పత్తికావు కానీ స్మగ్లర్లలో అధికులు నైజీరియన్లే అమెరికా, మెక్సికో, న్యూయార్క్‌లలో అండర్ వరల్డ్ గ్రూపుల ప్రాబల్యం ఎక్కువగా ఉంది. టూరిజంరంగం అభివృద్ధి సాధించిన దేశాల్లోనూ, ప్రాంతాల్లోనూ డ్రగ్స్ వ్యాపారం జోరుగా ఉంది. మాఫియా ముఠాల ప్రోద్బలంతో చేరిన విదేశీయులు స్థానికులకూ, టూరిస్టుకూ మాదకద్రవ్యాల్ని అమ్ముతుంటారు. ఈ వ్యవహారం థాయిలాండ్, మొనాకో దేశాల్లో కనపడుతుంది. బ్యాంకాక్ నగరంలోని రిసార్ట్స్ అన్నిటిలో డ్రగ్స్ లభిస్తున్నాయి. హెరాయిన్, ఓపియమ్‌లాంటి పాతతరం వాటితోపాటు సింథటిక్ డ్రగ్స్ కూడా ఎక్కువగానే లభిస్తున్నాయి. మాదకపదార్థాలను మార్కెట్లోకి చేరవేయడానికి మాఫియా ముఠాలు విస్తృతమైన నెట్‌వర్క్‌తో అంతర్జాతీయ సంబంధాల్ని నెలకొల్పుకుంటున్నాయి. ఈ హైటెక్ సొసైటీలో ముఠాలు సూట్‌కేసులు, బ్యాగుల్లో స్మగ్లింగ్ చేస్తున్నారు. ఆ ముఠాలు వారి అనుచరుల ద్వారా నలుమూలలకీ డ్రగ్స్‌ని వేగంగా పంపేస్తారు. భారత్‌లోని నిఘా విభాగాల అసమర్థత స్మగ్లర్లకు వరమయింది. ఈశాన్య ప్రాంతాల్లోనూ, పాక్ సరిహద్దుల్లోనూ, రక్షణ దళాలుగానీ, నార్కొటిక్ అధికార్లుగానీ సమర్థంగా వ్యవహరించకపోవడం వల్లనే స్మగ్లర్లు రాజ్యమేలుతున్నారు. గోల్డెన్ ట్రయాంగిల్ నుంచి నార్కొటిక్ మాఫియా వాళ్లు చిన్ పర్వతశ్రేణులమీదుగా మణిపూర్, మిజోరం, అస్సాం ప్రాంతాల్లోకి ప్రవేశిస్తున్నారు. ఇక అక్కడి నుంచి పథకం ప్రకారం మాదకదవ్యాలను కోల్‌కత, పాట్నాల గుండా ఢిల్లీ, చెన్నైలకు చేరుస్తున్నారు. చెన్నైలోని తీవ్రవాద సంస్థకు చెందిన వ్యక్తుల ద్వారా మాదకద్రవ్యాలు శ్రీలంకకు చేరుతున్నాయి. ఈ సంస్థకి చెందినవారు మెకనైజ్డ్ బోట్లలో చేరవేస్తున్నా నౌకా బృందాలు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నాయి.

దేశాల సరిహద్దులో...

ప్రపంచంలోని అనేక దేశాల సరిహద్దుల్లో మాదక ద్రవ్యాల వ్యాపారం జోరుగానే ఉంది. ఒక దేశంలో మాదకద్రవ్యాల పంట, మరోదేశంలో దాని వినియోగం, ఇంకొక దేశంలో మనిషిని నిలువునా ముంచే మత్తుమందులు, మాదకద్రవ్యాలు వినియోగదారుడికి చేరేలోపు ఎన్నో చేతులూ, మరెన్నో దేశాలూ మారిపోతాయి. కొన్నిసార్లు డ్రగ్ అసలు స్వరూపమే మారిపోవచ్చు. మైకంలో తేలిపోతూ, వింత లోకాలకు తీసుకుపోయి మురిపించే మాదకద్రవ్యాలకోసం వేలకువేల రూపాయలు ఖర్చుచేసే యువకిశోరులు నేల నలుచెరగులా ఉన్నారు. ఖుషీకోసం ఈ ద్రవ్యాలను సేవించే జల్సారాయుళ్లు చెప్పలేనంత మంది. మందుబాబుల అవసరాలను ఆసరాగా తీసుకుని అక్రమ వ్యాపారస్తుల వేషాలూ, చేసే చేష్టలు బోలెడు. చిన్న కష్టాల్ని సైతం ఎదుర్కోలేని ప్రజలనుంచి, గెలిచి పేరు తెచ్చుకోవాలనుకునే క్రీడాకారుల వరకు మత్తుపదార్థాలు సేవించేవారెందరో. ఈమత్తుపదార్థం నరాల్లో ఉన్న క్షణకాలం ఏదైనా చేయాలన్న తపనపడతాడు. ఇక ఈ మత్తుకు బానిసైనవాడు అది దొరకనంతసేపు నరకాన్ని చవిచూస్తాడు. చాలామంది యువకులు థ్రిల్‌కోసం గంజాయి, నల్లమందు, హెరాయిన్ లాంటి మాదకద్రవ్యాలకు అలవాటు పడి చివరకు వాటికి బానిసలయ్యారు. మత్తుకు ధనిక, మధ్య, పేద తేడా ఉండదు. ప్రతి ఒక్కరూ బానిసలే. కొంతమందికి కష్టాలనుంచి ఊరట లభిస్తుందని మాదక ద్రవ్యాల్ని ఆశ్రయించి, చివరకు ఊబిలో కూరుకుపోతారు.

బానిసలైనవారు కోట్లలో..

ప్రపంచ జనాభాలో మాదకద్రవ్యాలకు అలవాటుపడినవారు నాలుగుశాతం అని నల్లమందుకు 15కోట్లమంది, నిద్రమందులకు కోటిమంది బానిసలయ్యారని ఆరోగ్య సంస్థ అంచనావేసింది. మాదకద్రవ్యాల ధరవరలు కూడా డిమాండ్ రవాణా చేసే ప్రాంతాన్ని బట్టి ధరలు ఆధారపడి ఉంటాయి. ఈ ద్రవ్యాలు ఉత్పత్తి అయ్యే ప్రాంతాల్లో వీటి ధర వేలల్లో ఉంటే చాలా దూరంగా ఉండే దేశాల్లో కోట్ల రూపాయలలో పలుకుతోంది.

భారత్‌లో కిలో కానబిస్ రేటు 60వేల నుంచి 80 వేల రూపాయల వరకు ఉంటే అద్‌కానబిస్ రేటు ఆస్ట్రేలియాలో పాతిక లక్షల రూపాయలకు పైగా ఉంటుంది. డిమాండ్ ఉండే ప్రాంతాలకు డ్రగ్‌సని చేరవేసేందుకు అన్ని ముఠాలు ప్రయత్నిస్తుంటాయి. ఇంటర్నెట్, కొరియర్ ద్వారా వినియోగదారులకు వాడుతుంటే, ఆఫ్రికా దేశాల్లో ఎల్ఎస్‌పి మాండ్రెక్స్ మత్తును సేవిస్తున్నారు. థాయిలాండ్‌లో 'ఎస్టేట్ ఆర్మీ'కి చెందిన స్మగ్లర్లు కొత్తగా రెండు మార్గాలను ఏర్పరచుకున్నారు. పారిస్, ఆమ్‌స్టర్‌డామ్ మీదుగా ఫ్రాంక్‌ఫర్ట్‌కి ఒక మార్గం అయితే ద.చైనా మీదుగా బంగ్లాదేశ్, ఇండియాకు మరొకటి అని చైనా గూఢచార దళాలు వెల్లడించాయి. ప్రపంచంలో డ్రగ్స్ వ్యాపారం టర్నోవర్ కొన్నివేల కోట్ల రూపాయల్లో ఉంది.

ఒక ఖండం నుంచి మరో ఖండానికి మాదకద్రవ్యాల రవాణా విచ్చలవిడిగా పెచ్చరిల్లిపోతోంది. మాఫియాబృందాలు సమాంతర ప్రభుత్వాలు ఏర్పాటుచేసుకున్నాయి. దక్షిణ అమెరికాలోని కొలంబియా దేశం మాదక పదార్థాల ఉత్పత్తిదారుల కబంధ హస్తాలలో ఇరుక్కుపోయింది. ఆ దేశంలో ఎగుమతయ్యే కొకైన్ మత్తుపదార్థం జర్మనీ, బ్రిటన్ వీధులలో లభిస్తుంది.

యూరోపియన్ యూనియన్ ఏకీకృత మార్కెట్‌గా ఆవిర్భవించి రెండుదేశాల మధ్య రాకపోకలమీద ఆంక్షలు సరళీకృతమయ్యాయి. దీంతో మాదకద్రవ్యాల సరఫరా మున్నెన్నడూ లేనంతగా అధికమైంది. ఆ దేశాలలో హషీష్, మార్జువానా మత్తు పదార్థాలకు బానిసైన వారు ఐదుకోట్ల వరకు ఉంటారని అంచనా. మధ్య ఆసియా నుంచి లెబనాన్‌లోని బెకలోయ నుంచి ఎగుమతి అయ్యే మాదక ద్రవ్యాలు ఇటలీలో అమ్ముడుపోతాయి. లాటిన్ అమెరికా ప్రాంతం నుంచి ఓడల్లో ఎగుమతి అయ్యే కొకైన్, స్పెయిన్ తీరాలకు చేరి అక్కడ నుంచి ఉత్తర ఐరోపా దేశాలకు చేరి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మత్తుమందులు బాల్టిక్ తీరదేశాలు ఫిన్‌లాండ్, సెయింట్‌పీటర్స్ బర్గ్ లలో నివసిస్తున్న జనాభాకు చేరి వారి జీవితాన్ని నాశనం చేస్తున్నాయి. ఎంత కఠినమైన చట్టాలను తీసుకొచ్చి నిఘా ఉంచినా అంతర్జాతీయ స్థాయిలో మాదకద్రవ్యాల దొంగరవాణా జోరుగా సాగుతూనే ఉంది. మాఫియా గ్యాంగులు, స్మగ్లర్లు మత్తుమందులను ఒకదేశం నుంచి మరోదేశానికి రవాణా చేయడానికి స్మగ్లర్లు భూమార్గం, సముద్ర మార్గమే కాకుండా విమాన మార్గాలను సైతం తమ వ్యాపారానికి వినియోగించుకుంటున్నారు. అప్పుడప్పుడు పరిస్థితులకను గుణంగా తమ మార్గాలను మార్చుకుంటున్నారు. మొదట్లో బోస్నియా ప్రాంతం ప్రశాంతంగా ఉన్నప్పుడు హెరాయిన్ సరఫరా బాల్కన్ మార్గం ద్వారా జరిగేది. బోస్నియాలో అంతర్యుద్ధం చెలరేగడంతో ఈమార్గం గుండా వ్యాపారం చేయడం కష్టమైంది. దీంతో 'బైపాస్' మార్గంగా స్లోవేకియా నుంచి ఆస్ట్రియాకు హెరాయిన్ ఎగుమతి చేస్తున్నారు. ఇక్కడనుంచి బల్గేరియా చెక్ రిపబ్లిక్‌లకు కూడా కావలసినంతగా అందుతోంది. కమ్యూనిజం పటిష్టంగా ఉన్న రోజుల్లో ఆసియా, ఐరోపాల మధ్య మాదక పదార్థాల రవాణా అంత సులభమయ్యేదికాదు. కమ్యూనిజం పతనం కావడంతో ఐరోపాదేశాలకు సులభంగా రవాణా అవుతున్నాయి. ప్రపంచమొత్తంలో 28000 హెక్టార్లలో గంజాయి పంట పండిస్తుంటే దీనిలో అత్యధిక భాగం ఆఫానిస్థాన్, మయన్మార్‌లలో ఉంది. ప్రపంచంలో తయారయ్యే మాదకద్రవ్యాలలో 40శాతం ఆసియావాసుల వినియోగంలోనే ఉంది. అఫ్ఘనిస్థాన్, మయన్మార్, థాయ్, అమెరికా దేశాల్లో ఔషధాల తయారీ పేరిట అనుమతి సంపాదించిన అనేక లేబరేటరీల్లో మాదకద్రవ్యాలను 'వండివార్చే' ఏర్పాట్లున్నాయని 'యునైటెడ్ నేషనల్ ఇంటర్నేషనల్ డ్రగ్స్ కంట్రోల్ ప్రోగ్రామ్' స్పష్టం చేసింది. పాపిఈ నుంచి హెరాయిన్, ఓపియమ్ మత్తుపదార్థాలను తయారుచేసి, ఆ తర్వాత వాటిని శుద్ధిచేసే స్థాయిని బట్టి వీటిపేర్లు మారతాయి. ఐదుకేజీల ఓపియమ్‌ను శుద్ధిచేసి ఒక కేజీకి తీసుకువస్తే హెరాయిన్ ఉద్భవిస్తుంది. భారత్‌లో కేజీ హెరాయిన్ ధర 7లక్షల రూపాయల వరకూ పలుకుతోంది. జపాన్, న్యూజిలాండ్ అమెరికాల్లో అయితే కోటి రూపాయిల్లో ఉంది.

గంజాయి సిగరెట్లు..

మాఫియా గ్యాంగ్‌లు తక్కువ ధరలకు సిగరెట్లు కొని అందులోని పొగాకు తీసేసి, దానిలో గంజాయిని కలిపి సిగరెట్ల రూపంలో తిరిగి అమ్ముతున్నారు. సాధువుల వేషంలో ఉండే వ్యక్తులు, చిత్తు కాగితాలు ఏరుకునే వ్యక్తులు ఈ సిగరెట్లను ఒక చోటు నుంచి మరో చోటుకు చేరవేస్తుంటారు. నైజీరియాలో స్మగ్లర్లు హెరాయిన్‌ను జంతువుల పేగుల్లో అమర్చి రవాణాచేస్తున్నారు. వైద్యుల సహాయంతో ఎంపిక చేసిన వ్యక్తుల నాభికింద రంధ్రం చేసి పొత్తికడుపులో ఉండే కొవ్వు కణజాలాల్లో హెరాయిన్‌ను అమర్చి రవాణా చేస్తున్నారు. ఈవిధానం ద్వారా ఒక కిలోగ్రాము వరకు రవాణా చేయవచ్చు. నైజీరియాలోని స్మగ్లర్లు అమెరికాకు ఈవిధంగా మత్తు పదార్థాలు రవాణా చేసిన సంఘటనలు అనేకం. విశేషం ఏమిటంటే స్మగ్లింగ్ జరుగుతున్న హెరాయిన్ ఎక్స్-రే పరికరాలకు సైతం అందదు. దీంతో మాఫియా గ్యాంగ్ వ్యాపారం సాఫీగా సాగిపోతుంది. పాకిస్థాన్‌లోని స్మగ్లర్లు సామాన్లు భద్రంగా ఉండేందుకు చుట్టూరా ఉంచే ఎండుగడ్డిలో మత్తుమందులను అమర్చి అమెరికాకు సులువుగా రవాణాచేస్తున్నారు. వీడియో ఫిల్ముల కేసెట్ల ద్వారా మాదకద్రవ్యాలను అక్రమరవాణా చేస్తున్న వారిని డచ్ పోలీసులు పట్టుకున్నారు. ఈరవాణా భారత్‌నుంచి అయినట్లుగా కనుగొన్నారు. హాంకాంగ్, నార్వే, ఆగ్నేయాసియా దేశాలు, ఐరోపా దేశాలు, కెనడా, అమెరికా దేశాల్లోని స్మగ్లర్లు తాజాగా విగ్రహాలు, టెలివిజన్‌ట్యూబ్‌లు, టాల్కమ్ పౌడర్లు, వోల్ట్ మీటర్లు, పోలరాయిడ్ ఫొటోలు, కార్పెట్లు, ప్లైవుడ్‌లలో మాదకద్రవ్యాలను భద్రంగా అమర్చి రవాణా చేస్తున్నారు.

అమెరికా ఒక్కటే...

ప్రపంచంలో ఒక్క అమెరికా తప్ప మిగతా దేశాలకు నార్కొటిక్స్ అదుపుమీద స్పష్టమైన అవగాహనలేదు. అమెరికా ప్రభుత్వం తన నెట్‌వర్క్ సాయంతోను, అంతర్జాతీయ సర్వేల ద్వారా స్మగ్లింగ్ సెంటర్లను పసిగట్టి తగినటువంటి చర్యలు తీసుకొని తన జాగ్రత్తలో తాను ఉంటోంది. అమెరికా ఇందుకు స్పెషల్ పోలీసులను కూడా నియమించింది. ప్రతి ఏటా రెండువేల టన్నుల ఓపియమ్‌ను ఉత్పత్తి చేసే అఫ్ఘనిస్థాన్‌లో పాపీ పంటనాశనానికి శ్రీకారంచుట్టి ప్రత్యామ్నాయ పంటల్ని వేయమని ఆదేశించారు. తాలిబన్ల హయాంలో 34 డ్రగ్స్ ల్యాబ్‌లను ధ్వంసం చేశారు. తాలిబన్లు మొదట్లో మాదకద్రవ్యాలను ప్రోత్సహించారు. తర్వాత పాకిస్తాన్ ప్రధాని జోక్యం వల్ల రవాణాకు గండి పడిందని అంటారు. అయితే అమెరికా ఒత్తిడి వల్ల షరీఫ్ తాలిబన్లను మాదక ద్రవ్యాల రవాణాను ఆపమని తెలిపారు. మాదక ద్రవ్యాలను అణచివేయకుండా కొన్నిదేశాలు మౌనంగా ఉండటం మరి కొన్ని దేశాలు రవాణా కాకుండా రూపుమాపుతామని పేర్కొని, అమలు చేయకుండా ఉండడంతో ఎలాంటి ఫలితాలు కనపడటంలేదు.

హైదరాబాద్‌లో పోలీసులకు పట్టుబడ్డ డ్రగ్స్ రాకెట్

భాగ్యనగరంలో డ్రగ్స్ జోరు..

హైదరాబాద్ నగరంలో మాదకద్రవ్యాల సరఫరా జోరుగా ఉంది. డ్రగ్స్ మాఫియా గట్టి పునాదులు వేసుకొని వారి వ్యాపారాన్ని జోరుగా సాగిస్తున్నాయి. వేల సంఖ్యలో యువకులు, విద్యార్థులను మాదకద్రవ్యాల బానిసలుగా చేసి డ్రగ్స్ మాఫియా వారి వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగిస్తోంది. చాలకాలం నుంచి నిద్రమత్తులో ఉన్న ఎన్‌ఫోర్స్‌మెంటు ఇటీవల దాడులు నిర్వహించి ఒకరిద్దరిని అరెస్టుచేసి రిమాండ్‌కు పంపింది. వారు తిరిగి బెయిలు మీద రావడం, యథావిధిగా డ్రగ్స్ వ్యాపారం చేయడం ఖాయం. ఇలాకాకుండా నగరంలో పాతుకుపోయిన డ్రగ్స్ మాఫియాలను సమూలంగా నాశనం చేసినప్పుడే యువకులు, విద్యార్థుల భవిష్యత్తును కాపాడినవారవుతారు. ఇటీవల ఎన్‌ఫోర్స్‌మెంటు జరిపిన దాడుల్లో వందల సంఖ్యలో విద్యార్థులు మాదకద్రవ్యాలకు బానిసలై అయోమయంలో ఉన్నట్లు తెలిసింది. మాదకద్రవ్యాలకు అలవాటుపడిన ఇంటర్నేషనల్ స్కూళ్లు, ఇంజనీరింగ్ కాలేజీల విద్యార్థులను ఎన్‌ఫోర్స్‌మెంటు విచారణ జరుపుతున్నారు. ఆయా స్కూళ్లు, కాలేజీలకు ఎన్‌ఫోర్స్‌మెంట్ నోటీసులు జారీచేసి వివరణ కోరింది. మాదకద్రవ్యాలు ఎక్కడనుంచి ఎలా వస్తున్నాయన్న వివరాల సేకరణలో అధికారులు నిమగ్నులయ్యారు. అరెస్టుచేసిన కిల్విన్‌తో పాటు అబ్దుల్ వహీబ్, అబ్దుల్ ఖు దూస్‌లను అరెస్టుచేసి డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. వారిని రిమాండ్‌కు పంపారు.

ఏది ఏమైనా మాదకద్రవ్యాల నిరోధానికి ప్రపంచంలోని అన్ని దేశాలు చిత్తశుద్ధితో కృషిచేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

ఆత్మీయుల్లో ఆద్యులు అమ్మానాన్నలు..

జూలై 26 పేరెంట్స్ డే...

తల్లిదండ్రులకు ప్రదక్షిణ, ప్రణామం చేసి అనంతమైన ఆశీర్వాదములు పొందేమార్గం వినాయకవ్రతకథలో విన్నాం. దశరథుడు శబ్దవేధి విద్యతో నిశిరాతిరి జంతువుల వేటకు వెళ్లి శబ్దం వచ్చిన దిశగా బాణం విడువగా ఎవరికీ అపకారం చెయ్యని మునికుమారుడు శ్రవణ కుమారుడికి తగిలింది. దశరథుడు తన పొరపాటును దీనంగా చెప్తూ రోదించాడు. అప్పుడు శ్రవణకుమారుడు 'రాజా! విచారించ వలదు. నా ప్రాణం గురించి నాకు దిగులు లేదు. వృద్ధాప్యంతోను, దాహంతోను అల్లాడు తున్న నా తల్లిదండ్రుల గురించే నా బాధ.. పైగా గుడ్డివారు'. ఆమాటలు వన్ని దశరథుని శరీరం జలదరించింది. భయంతోను, జలద రింపుతోను ఆయన ధనుర్బాణాలు నేల జారాయి. 'రాజా! నా తల్లిదండ్రులు అంధులు. నాకోసం, దాహంకోసం అలమటిస్తుంటారు. అదిగో కానవస్తున్న ఆ దారిగుండా వెళ్లు. నా తల్లిదండ్రుల దాహం తీర్చు రాజా.. కనీసం అద్దైనా చేయిరాజా' దశరథుడు కదలక, మెదలక చూస్తుండి పోయాడు. ఆ బాలుడిని అలా వదలివెళ్లాలో, వెళ్లకూడదో, అక్కడే ఉండాలో అర్థంకాలేదు. అట్టి సమయంలోను ఆ బాలుడు విచారించక 'రాజా. నా దేహంలో గుచ్చుకున్న బాణాన్ని లాగు. సందేహించకు...' చెప్పాడు. దశరథుడు బాణాన్ని లాగివేశాడు. తన తల్లి, తండ్రి గురించి చెబుతూనే శ్రవణకుమారుడు ప్రాణం వదిలాడు. తల్లిదండ్రులను కావడిలో చెరోవైపుకూర్చోబెట్టుకుని కాలినడకన ప్రయాణం చేస్తూ తల్లిదండ్రుల సేవే పరమార్థంగా గడిపిన శ్రవణుడి కథ ఇది.

తండ్రి మాట నిలబెట్టడంకోసం వనవాసానికి వెళ్లిన శ్రీరాముని కథ మనకు తెలుసు. ఇలా ఎన్నో కథల్లో మనం విన్నాం. అయినా నేడు బిడ్డలు వృద్ధులైన తమ తల్లిదండ్రులను విడిచిపెడుతున్నారు. వృద్ధాశ్రమాల్లో ఎందరో వృద్ధులు అనాథలుగా తమ జీవితం గడుపుతున్నారు. తల్లిదండ్రులు పిల్లలు పుట్టాలని ఎన్నోపూజలు చేస్తారు. కొసరి కొసరి గోరుముద్దలు తినిపిస్తూ గారాబంగా పిల్లల్ని పెంచుతూ, పూలబాటలో నడుపుతారు.

ఆ పిల్లలే పెద్దలై... రెక్కలు వచ్చిన కొందరు బిడ్డలు తమ గుండెను రాయిగా చేసుకొని వృద్ధులైన తల్లిదండ్రుల హృదయాలను ముక్కలు చేస్తున్నారు. వాళ్లకు అమృత మిచ్చిన వారిపైనే విషాన్ని విరజిమ్ముతున్నారు. ఆ ప్రేమ మూర్తులపట్ల తమ బాధ్యతను మరుస్తు న్నారు.అమృతాన్ని కురిపించిన అమ్మ కళ్లల్లో అశ్రువులను నింపుతు న్నారు, ఆ మార్గదర్శకులకు బిడ్డలై ముళ్లై బాధిస్తున్నారు.

అందరినీ మరచినా తల్లిదండ్రులను మరువకూడదు. ఎన్ని కోట్లు సంపాదించినా అవి తల్లిదండ్రులకు సమానంకావు. మాతృదేవోభవ, పితృదేవోభవ అని మొదటి స్థానం మాటల్లో వారికి ఇస్తాం, కానీ ఆచరణలో ఎందరు ఇలా ప్రవర్తిస్తున్నారు? తల్లిదండ్రులకన్నా మన మంచి కోరేవారు మరెవరూ ఉండరని గుర్తించాలి. తమను ఎంతో ప్రేమతో పెంచిపెద్దచేసిన తల్లిదండ్రులను, వారి వృద్ధాప్యంలో చంటి పిల్లల్లా చూసుకోవాలి. కొడుకును ఎంతో ప్రేమతో చూస్తూ కోడల్ని కూతురు కంటే ఎక్కువగా చూసే అత్తమామలు ఉన్నారు. అయినాసరే, కొడుకు, కోడలు వారికి దూరంగా ఉండాలనుకుంటారు. ముమ్ముందు తామూ వృద్ధులమవుతామన్న విషయం మరచి ప్రవర్తిస్తుంటారు. స్వచ్ఛమైన తెలుగు భాషలో ఎంతమంది తల్లిదండ్రుల్ని అమ్మా, నాన్నా అని నోరారా పిలుస్తున్నారు?

వృద్ధాప్యం భారంగా వెళ్లదీసేవారి సంఖ్య రానురాను విపరీతంగా పెరిగిపోతోంది. నేడు వైద్యరంగం ఎంతో పురోగమించింది. అందువల్ల మరణాల సంఖ్య గణనీయంగా తగ్గటమే కాదు, ఆయుర్దాయం కూడా పెరుగుతోంది. ఫలితంగా వృద్ధుల జనాభా రోజురోజుకో పెరుగుతోం ది. అయితేఎక్కువకాలం బతికితే అంత ఎక్కువ బాధలు అనుభవిం చాల్సివస్తోంది నేటి వృద్ధులు. వివిధరకాల అనారోగ్యాలు, అయినవారి నిరాదరణ వృద్ధులపట్ల శాపాలుగా పరిణమిస్తున్నాయి. వృద్ధమహిళలలో చాలామంది వితంతువులే. భర్తను పోగొట్టుకొని, ఆర్థిక స్వాతంత్ర్యంలేక, బిడ్డలపై ఆధారపడి, వారు ఎంత దయనీయ పరిస్థితులలో కాలం వెళ్లబుచ్చుతున్నారో మనసుతో చూస్తే అర్థమవు తుంది. మహిళల ఇబ్బందులు, వారి వయసుకన్నా వారిని శారీరకంగా, మానసికంగా వృద్ధులను చేస్తున్నాయి. వింతంతు పింఛన్, సీనియర్ సిటిజన్‌కు ఇటీవల ప్రభుత్వం ఈ సౌకర్యం కల్పించడం సంతోషదాయకం. శక్తి క్షీణించి, అనారోగ్యంతో అసహాయ స్థితిలో ఉండే వృద్ధులను సమాజానికి, కుటుంబానికి భారం అనుకో వడం సంస్కార లక్షణం కాదు. జీవితకాలపు అనుభవాలతో తల పండిన వారిని ఎందుకూ పనికిరానివారిగా జమ కట్టడం మానవత్వం కాదు. సమాజానికి, కుటుంబానికి గొప్ప మూలధనం వారు. ముసలివారి మాటలని తక్కువగా చూడకూడదు.

మనదేశంలోని వృద్ధులైన స్త్రీలలో కనీస వేతనభత్యం ఉన్న ఉద్యోగాలు చేసినవారి సంఖ్యతక్కువ. వారు జీవితమంతా ఇల్లు, పిల్లల్ని పెంచడం తప్ప మరో విషయం తెలియని అమాయకులు. కీళ్లనొప్పులు, మధుమేహం, జ్ఞాపకశక్తి నశించడం, గుండె జబ్బులు.. వంటి అనా రోగ్యాలు వారిని పీడిస్తుంటాయి. ఇతరులపై ఆధార పడి బతకడం తప్పదన్న నిరాశావాదం వారిలో చోటుచేసు కుంటుంది. ఫలితం ఇంకా త్వరగా వారిని బలహీనులవుతారు. వయసు ప్రభావం తమపై పడకుండా చలాకీగా తమ పనులు తాము చేసుకునే వారు అరుదు. వారు తమను ఆప్యాయంగా పలకరించే వారి కోసం ఎదురుచూస్తూ ఉంటారని మరువకూడదు. కుటుంబ సభ్యులు ఇంట్లోని వృద్ధులను ఒంటరిగా వదల కూడదు. అన్నిపనుల్లో వారి సలహా తీసుకుంటూ, తమతో కలుపుకుంటూ, వారి పెద్దరికానికి విలువనివ్వాలి. వారి ఆరోగ్య విషయమై తగిన శ్రద్ధ తీసుకోవాలి.



తల్లితండ్రుల రోజని మనదేశంలో ఈమధ్యే దీనిని వేడుకలా జరుపుకుంటున్నారు. సంగీతం, సాహిత్యం, నృత్యంలాంటి కళలేగాక, చివరికి వేడుకలను కూడా విదేశాలనుండి అనుకరించే పరిస్థితి వచ్చింది. అయితే ఈరకంగా అయినా కొందరు తల్లిదండ్రులతో కొంత సమయం గడుపుతారని, ప్రేమానురాగాలని పంచుకొంటారని ఆశిద్దాం. కేకులు కట్‌చేయడం, స్వీట్లు తినిపించడం అవసరంలేదు. బహుమతు లివ్వక్కర్లేదు, సినిమాలు చూపించనవసరంలేదు. పార్టీలు ఏర్పాటు చేయనవసరంలేదు. కానీ కనీసం ఈ ఒక్కరోజు వారితో మనసారా ప్రేమతో మాట్లాడితే చాలు..వారికి అవే కోటి శుభాకాంక్షలు.

-వనిత విజయ్‌కుమార్ ద్యాప

కృతి

చైతన్యవంత కవిత్వం



అటు ఆడా ఇటు మగా కాని 'మూడో మనిషి'ని కవితావస్తువుగా ఎన్నుకోవడమేకాదు, కవితాసంపుటికి మకుటంగా నిలబెట్టారు ఆచార్య మాడభూషి సంపత్ కుమార్. 'ఎవరిది తప్పు/ఎవరికి శిక్ష?' అని ప్రశ్నిస్తూ వారి అస్తిత్వాన్ని గుర్తించవలసిన అవసరం వుందని, మూడో మనిషిని/ మనిషిగా గుర్తించడానికి/ అంగవై కల్యాల్ని/ ఆదరించడానికి/ మనో వైకల్యం అంతరించాలి' అని సమాజానికి పిలుపునిస్తారు. కవిత్వంలో మడి కాదు/ తడి ఉండాలి' అని నమ్మే కవి సమాజదర్శనంలో, సమస్యల పట్ల స్పందనలో బాధ్యత గలవారు. ఇటీవల చెన్నైనగరాన్ని అతలాకుతలం చేసిన కుంభవృష్టిని 'ఏడ్చినట్టుంది వాన' అని నిరసిస్తారు. కరెన్సీ నోట్లు/ రంగులు మార్చుకుని మళ్లీ/ రంగంమీదికొచ్చాయి/ రంగు కాయితాలు/ నల్లగా మారడానికి క్షణాలు చాలు' అంటూ నల్లధనం పట్ల అప్రమత్తంగా ఉండాలని పాలకుల్ని హెచ్చరిస్తారు. పక్కా ఇళ్లు తప్ప/ పక్కనే ఇళ్లు కట్టలేకపోయారు/ అంటరాని విషయంలో/ అంటీ ముట్టనట్టున్నారు' అంటూ ప్రభుత్వ పథకాలను తూర్పారపడతారు. ఎవరికివారు/ అమ్మ లేక పోతే తామే అధినాయకులమనుకున్నారు/ ఇప్పుడు అమ్మ లేకపోవడంతో/ అందరూ అనాథలే' అంటూ తమిళనాట రాజకీయ అస్థిరపరిస్థితికి అక్షరదర్పణం పట్టారు. మొత్తానికి మంచికవిత్వమందించారు.

(మూడో మనిషి -కవిత్వం:మాడభూషి సంపత్ కుమార్; వెల:రూ.50 ప్రతులకు:పాలపిట్టబుక్స్ 16-11, 20/6/1/1/ 403, విజయసాయి రెసిడెన్సీ, సలీమ్ నగర్ కాలనీ, మలక్‌పేట్, హైదరాబాద్-36)

-రమణ వెలమకన్ని

ఈ కథలు మేలిమి ముత్యాలు..



విలువైన కథలందించే సుప్రసిద్ధ రచయిత సలీం తాజాగా వెలువరించిన కథా సంపుటి 'నీటిపుట్ట'. ఇందులోని తొలి కథ 'గరిమనాభి'లో కస్తూరి సగటు ఇల్లాలికి ప్రతీక. ఇంట్లో అందరి దిగు ళ్లు పంచుకుని, పరిష్కరించే ఆమె తన దిగులును మనసులోనే దిగ మింగుకోవటంతప్ప ఏంచేయలేదు. 'నరకకూపం' కథలో డ్రెయినేజీ పనివారి జీవితాన్ని కళ్లకుకట్టారు. తానుచేసే పని తెలిస్తే కూతురుకి పెళ్లిసంబంధం తప్పిపోతుందని భయపడతాడు. కానీ కూతురు, తండ్రి పనిని ఇష్టపడనివ్యక్తిని పెళ్లేచేసుకోనని, తండ్రి తన హీరో అని కన్న తండ్రి మనసులో పన్నీరుచల్లుతుంది. 'నిఖా' కథలో పాతిక లక్షల కట్నం ఇస్తే పెళ్లికూతురు నాయనమ్మ చేసిన తప్పిదం పట్టించుకోమని పిల్లవాడి తండ్రి అనటం సమాజంలోని డొల్లతనానికి నిదర్శనం. ఐతే హసీనా తమ పూర్వీకుల వ్యక్తిగతాలతో పెళ్లినిముడి పెట్టే వారితో సంబంధమే వద్దంటుంది. 'జోలాలీపాపా' కథలో ప్రభాకర్ పాత్రను తీర్చిదిద్దినతీరు అద్వితీయం. 'బొడ్డుతాడు' కథలో డబ్బు కోసం అద్దెగర్భం ధరించిన ఆమె, చివరకు పరిస్థితులు ప్రతికూలిస్తే పుట్టినబిడ్డను అమ్ముకోక, తానే ఎంతకష్టమైనా పెంచాలనుకోవడం అమూల్యమైన అమ్మ మనసును తెలుపుతుంది. 'నీటిపుట్ట' కథ నేటి జగతికి అద్దంపట్టి, కాంక్రీట్ అరణ్యాలను పడగొట్టి సాగు భూములుగా మార్చాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పింది. మిగిలిన కథలన్నీ కూడా చదివితీరాల్సినవే.

(నీటిపుట్ట (కథా సంపుటి):సలీం; వెల:రూ. 150; ప్రతు లకు: విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు)

-జె.శ్యామల

సమకాలీనానికి చక్కని దర్పణం

కథలు చదవగానే కంచికిపోకుండా పాఠకుడి మనసును కాసేపు అలజడికి గురిచేయాలి. అలాంటి కథలు రాస్తున్నవారిలో లక్ష్మీరాఘవ (డా.కె.వి.లక్ష్మి) ఒకరు. తమకెదురైన ప్రతి సంఘటనను తనదైన భావజాలకోణంలో విశ్లేషించి, కథగా మలచటంలో లక్ష్మీరాఘవ సిద్ధహస్తులు. ఆమె వెలువరించిన 'అనుబంధాల టెక్నాలజీ' సంకలనంలోని 32 కథలూ సగటు వ్యక్తి సమకాలీన జీవితాన్ని ప్రతిబింబించేవే. మంచి ఎత్తుగడ, భాషా సారళ్యత, క్లుప్తత, ఓ చక్కటి సందేశం ఉన్నాయి. అందువల్లనే కథలన్నీ పాఠకుడి మనసులో, చదివాక కూడా అలా నిలిచిపోతాయి. నేటి తరం పిల్లలకు 'హనుమాన్‌కంటే స్పైడర్‌మానే సూపర్' అని చెపుతూ వాళ్లకు దగ్గరవాలంటే మనమూ వాళ్ల దారిలో నడవాలంటారు 'అనుబంధాల టెక్నాలజీ' కథలో. సిటీ మనుషులు కాంక్రీటుతో కట్టబడితే, పల్లెటూరు మనుషుల్ని మనసులతో కట్టారని చెపుతుంది 'పల్లెటూరు మనుష్యులు- పట్నం మనసులూ' కథ. ఒక జీవి మరో జీవిని చంపటం, ఆ జీవి చీమా కావొచ్చు, పాముా కావొచ్చు, ఎలికా కావొచ్చు..అనాగరికం అంటారు 'జెల్‌పాడ్'లో. జీవితంలో ఎన్నో ప్రతికూల పరిస్థితులు ఎదుర్కోవాల్సివస్తుంది, వాటిని తలచుకుని బతుకు భయంకరం చేసుకోవటం కంటే, వాటిని తమకు అనుకూలంగా మలచుకోవాలని చెపుతారు 'పరిష్కారం' కథలో. సమకాలీన మనిషినీ, మనసునూ చదవాలంటే ఈ సంకలనం చదవాల్సిందే.

(అనుబంధాల టెక్నాలజీ..కథా సంపుటి:డా.లక్ష్మీ రాఘవ; వెల: రూ. 100; ప్రతులకు: అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు)

-కూర చిదంబరం

చదివించే కవిత్వం..

రాజకీయ, సామాజిక అంశాలు, లక్షింపేట దళితుల ఊచకోతకు నిరసనగా పలు అంశాలతో 'పుట్టిన రోజు ఒక్కటే' పేరిట చైతన్యవంతమైన కవితల సంకలనాన్ని అందించారు నేతల ప్రతాప్‌కుమార్. అందులో కొన్ని కవితలు ఇలా..జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ పోతే/ అనుభవాల చెలమలు ఊరుతున్నట్లు/ తవ్వకాలు తవ్వుకుంటూ పోతే/ అసలైన చరిత్రకు సిసలైన ఆనవాళ్లు/ తెగిపడ్డ బౌద్ధ బిక్షువుల సాక్షిగా... అంటారు 'బుద్ధభూమి' కవితలో. 'ఇప్పుడు స్వతంత్రం' కవితలో చివరి వాక్యాలు ఎంతో వాస్తవంగా అనిపిస్తాయి. ఇప్పుడు పెట్టుబడిదారుడు/ ఆంగ్లేయుడు కాదనే ఆనందం తప్ప కొత్తగా నా కొచ్చిన స్వతంత్రం ఏమున్నట్టు!!!' అప్పుడు ఒకడిదేశాన్ని/ మరొకడు ఏలడం పరతంత్రం' ఇప్పుడుఎవడి దేశాన్ని/ వాడుదోచుకోవడం స్వతంత్రం!!!' అంటారు. అలాగే భూస్వామ్య పెత్తందారీ గూండాయిజంపై 'మా వంతు' అనే కవితలో మనువంటే/ ఇప్పుడు బ్రాహ్మణ అగ్రహారంకాదు భూస్వామ్య శూద్రావతారం/ దాని విధి దళిత సంహారం.. అంటారు. అంబేద్కరిజాన్ని ప్రచారం చేయాలనే లక్ష్యంగల ఈకవి 'పుట్టినరోజు ఒక్కటే'లో రాసిన చివరి పదాలు పాఠకుల్ని ఆలోచింపజేస్తాయి. మాకు విడివిడిగా పుట్టినరోజులుండవు/ మీ పుట్టినరోజు ఎప్పుడని/ .. అడగ కండి/ మేమంతా పుట్టినరోజు ఒక్కటే! ఏప్రిల్ పద్నాలుగు ఒక్కటే' అంటారు.

(పుట్టినరోజు ఒక్కటే-అంబేడ్కర్ వాద కవిత్వమ్:నేతల ప్రతాప్ కుమార్ వెల:రూ.60;ప్రతులకు: అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు)

-తంగిరాల చక్రవర్తి

సృష్టి.. ప్రేమ వృష్టి

కస్తూరి మురళీకృష్ణ

'షావోండసీ' చుట్టూ చూశాడు.

ఇంకా తెల్లవారలేదు. జగతి చీకటి దుప్పటిని గట్టిగా కప్పుకుని ఉంది. తన సోదరుడు తన పని బద్ధకంగా చేసుకోవడం గమనించాడు షావోండసీ.

రాత్రంతా పని చేస్తూండటం వల్ల, నిద్రను ఆపుకుని ఉండటం వల్ల తన సోదరుడి వేగం తగ్గిందని, ఇంకాస్సేపటిలో తన సోదరుడి స్థానాన్ని తాను తీసుకోవాల్సి వస్తుందని షావోండసీ గ్రహించాడు.

రాత్రికన్నా ఉదయం పనిచేయటమే షావోండసీకి ఇష్టం.

చాలాకాలం క్రితమే తనకూ తన సోదరులకూ నడుమ ఎంతో తేడా ఉందని షావోండసీ గ్రహించాడు.

తన సోదరులు వేగవంతులు. అల్లరి పిల్లలు.

వాళ్లకు పరుగులిడటం చాలా ఇష్టం.

వేగంగా పరుగిడటం, దారిలో ఉన్న వాటన్నిటినీ విసిరివేయటం, అడ్డు వచ్చినదాన్ని తీసేసి, ఎగరేయటం వాళ్లకి ఇష్టమైన ఆట.

ఏదైనా అందంగా కనిపిస్తే దాన్ని తుంచేయందే వాళ్లకి నిద్రపట్టదు.

అందంగా ఉన్న దాన్ని పాడుచేయందే వాళ్లకి తోచదు.

కానీ షావోండసీకి అలా కాదు.

తాను గట్టిగా అడుగులు వేస్తే కాళ్ల కింద ఉన్న అందమైన గడ్డిపరకలు నలుగుతాయేమోనని భయం.

తాను కాస్త వేగం పెంచితే ఏ అందం ఏవైపుది చెడుతుందేమోనన్న బాధ.

అంతేకాదు, తన పని పరుగులిడటం కాదు. అన్నిటినీ నాశనం చేయటం కాదు.

తన పని అందాన్ని అనుభవించటం.

వేగంగా, గుడ్డిగా పరుగెత్తితే చుట్టూ ఉన్న అందమైన ప్రకృతి అణువణువునా అత్యద్భుతమైన రీతిలో ప్రదర్శిస్తున్న అందాన్ని ఎవరు చూస్తారు?

తాను కాకపోతే అందాన్ని దర్శించి ఆనందాన్ని అనుభవించేది ఎవరు?

ఇదే తనను తన సోదరులనుంచే కాదు అధికశాతం జనుల నుంచి వేరు చేస్తోందని షావోండసీ గ్రహించాడు.

తాను ప్రకృతి ప్రేమికుడు.

తాను అందానికి బానిస.

అందం తన హృదయాన్ని ఆనందమయం చేస్తుంది. అందం తన హృదయంలో ఆనందామృత వర్షాన్ని కురిపిస్తుంది.

అందం తన శరీరంలోని అణువణువునూ ఆనందార్ణవంలా మారుస్తుంది. తద్వారా తాను అనంతమైన ఆనంద సముద్రాల సంకలనం అయిపోతాడు.

ఎటుచూసినా ఆనందం.

తనకి ఆనంద సముద్రాలు నెలవుగా మారినప్పుడు ఇక ఏమని చెప్పాలి?

హృదయంలో తీయని బాధ కలుగుతుంది. ఆ బాధలోనూ ఆనందం ఉంటుంది.

అందం చూస్తే చలించిపోతాడు.

ఒకపక్కన ఆనంద తరంగాలు ఉవ్వెత్తున ఎగసిపడుతూంటే మరోవైపున అనంత విషాదాంబుధులు అల్లకల్లోలం చేస్తూంటాయి.

ఎందుకో? ఏమిటో!

తన సోదరులే కాదు ఇతరులెవరూ గమనించని, స్పందించని, పట్టించుకోని వారి దృష్టిలో అందం వేరు. వారికి అంతటా అందం కనబడదు. కనబడ్డా అది వారిపై ఎలాంటి ప్రభావం చూపించదు.

గుడ్డివాడి ముందు చంద్రోదయంలా, చెవిటి వాడి ముందు శంఖంలా వారిపై అందం ఎంత తీవ్రమైనదైనా ఎలాంటి ప్రభావం చూపించదు.

అదే తాను..అందం అణువణువునా దర్శిస్తాడు. చలించిపోతాడు.

దీన్ని సున్నితత్వం అంటారని తెలుసుకున్నాడు షావోండసీ.

తనది సున్నితమైన మనస్సు.

ఇతరులలో అంత సున్నితత్వం లేదు.

సున్నితత్వం ఓ రకమైన వరం. మరో రకమైన శాపం అంటారు. ఎందుకంటే సున్నిత మనస్కుడికి ప్రతి విషయంలో అందం, ఆనందం కలుగుతుంది. ప్రతి విషయం ఎంత తీవ్రమైన ఆనందాన్నిస్తుందో, అంతే తీవ్రమైన విషాదాన్ని కూడా కలిగిస్తుంది. హృదయం ఎంత త్వరగా ఉప్పొంగుతుందో, అంత త్వరగా కుంగిపోతుంది.

తన పని అయిపోయిందన్నట్టు సోదరుడు రావటంతో ఉలిక్కిపడ్డాడు షావోండసీ.

తన పని ఆరంభమవుతుంది.

'ఇవాళ్లయినా కాస్త వేగంగా పని కానిస్తావా?' వ్యంగ్యంగా అడిగాడు సోదరుడు.

తాను నెమ్మదిగా ప్రకృతిలోని అందాలను అనుభవిస్తూ పనిచేయటం వీళ్లకి వెక్కిరింతగా, హేళనగా ఉంటుందని షావోండసీకి తెలుసు.

కానీ వాళ్లు వాళ్లే, తాను తానే.

వాళ్లు ఎలాగ తనలాగా కాలేరో, తాను అలాగే వాళ్లలా కాలేడని షావోండసీకి తెలుసు.

అందుకే వాళ్లెంత ఏడ్పించినా, హేళన చేసినా తనలాగే ఉండాలని ప్రయత్నిస్తాడు. తన ఇష్టం వచ్చినట్టు ఉంటాడు.

నెమ్మదిగా పని ప్రారంభించాడు షావోండసీ.

ఎక్కడ తాను వేగంగా కదిలితే ఏం ధ్వంసమవుతుందో నన్నట్టు మెల్లిగా కదలుతున్నాడు షావోండసీ.

'ఎంత అందాన్ని సృజించాడు భగవంతుడీ ప్రపంచంలో'
అనుకున్నాడు.

కానీ ఎవరు అనుభవిస్తున్నారీ అందాన్ని?

ఎవరి గొడవల్లో వారున్నారు. ఎవరి పనుల్లో వారున్నారు. ఎవరి బాధల్లో వారున్నారు. ఎవరికీ పట్టలేదు ఈ అందం!

ఆలోచిస్తూ, అందాన్ని అనుభవిస్తూ, అంతులేని ఆనందం, అలవికాని విషాద భావనల నడుమ ఉక్కిరి బిక్కిరి అవుతూ ముందుకు సాగుతున్న షావోండసీ హఠాత్తుగా ఆగిపోయాడు.

అతడికి దూరంగా పచ్చటి దుస్తులు ధరించి, పసుపురంగు వెంట్రుకలు విరబోసుకున్న యువతి కనిపించింది.

గుండెలు పిండేసే అందం!

ఒక్కసారిగా ఆనంద సముద్రం ఎగసిపడింది. విషాద సాగరం అల్లకల్లోలమయింది. ఆగిపోయాడు షావోండసీ.

చెట్టు చాటునుంచి ఆమెనే చూడసాగాడు.

ఆమెని చూస్తుంటే అతడి మనస్సు లోలోపల అతడికే అర్థంకాని అనేక భావనలు ఉబికి ఉబికి రాసాగాయి.

పరుగెత్తుకు వెళ్లి ఆమె పాదాలపై వాలాలనిపించింది.

ఆమె ఎదురుగా కూర్చుని ఆమె కళ్లల్లోకి చూస్తూ అనంతసాగారాల లోలోతుల్లోకి అద్భుతమైన ప్రయాణం చేయాలనిపించింది.

పసుపురంగు మృదువైన కురులను తొలగించి ఆమె సుందర వదనారవిందాన్ని చూస్తూ చూస్తూ ప్రాణాలు విడవాలనిపిస్తోంది.

పలు విభిన్నమైన రంగుల పుష్పాలను మోసుకువచ్చి ఆమె పాదాలచెంత ఉంచాలనిపించింది.

అతడికి ఏమేమో చేయాలని ఉంది. కానీ కదలలేకపోయాడు.

ఆమెని చూస్తుంటే కదలాలనిపించటంలేదు.

కాలం ఆగిపోయినట్టనిపిస్తోంది.

తాను తాను కాదు, ఒక అనుభూతి అనిపిస్తోంది.

కానీ..ఎల్లకాలం అక్కడ ఉండలేడు.

ఆమెని కలవాలని ఉంది. మాట్లాడాలని ఉంది.

ఈ ప్రపంచంలో కోరికలు కలగటం సులభం. అవి నెరవేరటం కష్టం.

కోరికలను అణచుకోవటం దుఃఖం.

కానీ అధికశాతం కలిగిన కోరికలను అణచుకుంటూ కొత్తకలలను కంటూ ముందుకు సాగిపోవటమే జీవితం.

ముందుకు సాగిపోయాడు షావోండసీ.

ముందుకయితే కదిలాడు కానీ ఆమె అందాన్ని మనసునుండి తొలగించలేకపోయాడు. అతడికి ఇక మరేమీ కనబడటంలేదు. ఆమె అందమే ఎటుచూసినా కనిపిస్తోంది.

తొలిసారిగా పరిసరాల అందాన్ని గమనించకుండా ఆమె అందాన్ని మాత్రమే మనోనేత్రంతో దర్శిస్తూ, అదో లోకంలో ఉన్నవాడిలా ముందుకు సాగాడు షావోండసీ. కానీ స్థిమితంగా ఉండలేకపోయాడు.

మళ్లీ ఉదయం ఎప్పుడువుతుందోనని ఎదురుచూస్తూ కూర్చున్నాడు.

ఉదయం కాగానే బయలుదేరాడు.

దిక్కులు చూడలేదు. ప్రకృతి అందాన్ని చూడలేదు. తిన్నాగా ఆమె కనిపించిన స్థలానికి వెళ్లాడు. చెట్టుచాటునుంచి ఆమెని చూడసాగాడు.

అప్పుడే రాత్రి కురిసిన మంచుబిందువులతో తడిసి స్వచ్ఛమైన పుష్పంలా ముగ్ధమనోహరంగా ఉందామె.

ఆమెని పలకరించాలనిపించింది. కానీ ధైర్యం చేయలేకపోయాడు.

సూర్యకిరణాల వెలుగులో మెరిసిపోతోందామె.

కళ్లు తిప్పుకోలేకపోయాడు.

ఆమెని చూస్తూ అక్కడే ఆగిపోయాడు.

అక్కడినుంచి కదలాలని లేదు. అలా ఆమెని చూస్తూ ప్రాణాలు విడిచేయాలని ఉంది. కానీ..

బరువైన హృదయంతో మరుసటిరోజు ఆమెని దర్శించేందుకు ఆత్రుతపడుతూ ముందుకు సాగాడు షావోండసీ.

****

షావోండసీలో మార్పును సోదరులు గమనించారు.

తమ సోదరుడు ఇంతకుముందులా లేడని గ్రహించారు.

ఇంతకుముందులా పనిచేయటం లేదనీ అర్థంచేసుకున్నారు.

ఇందుకు కారణం ఏమిటో తెలుసుకోవాలని నిశ్చయించుకున్నారు.

ఒకరోజు షావోండసీకి తెలియకుండా అతడిని అనుసరించారు.

షావోండసీ రహస్యాన్ని కనుగొన్నారు.

ముగ్గరికీ అందాన్ని చూస్తే నాశనంచేస్తే కానీ నిద్రపట్టదు.

ముగ్గరూ తమ్ముడివైపు జాలిగా చూశారు.

ఈ ప్రపంచంలో ఏదీ శాశ్వతంకాదు. అందులో అందం అస్సలు శాశ్వతంకాదు. క్షణికమే. ఎలాగయితే నీరు ఎండకు ఆవిరైపోతుందో, అలా కాలం అందాన్ని అదృశ్యం చేస్తుంది.

పచ్చటి అందమైన ఆకు పండి ఎండి రాలిపోతుంది.

తమ సోదరుడీ నిజాన్ని ఎంత త్వరగా అర్థంచేసుకుని, అందం వ్యామోహం నుంచి ఎంత త్వరగా బయటపడితే అంతమంచిది.

వాళ్లొక నిశ్చయానికి వచ్చారు.

****

తొందరతొందరగా బయలు దేరాడు షోవోండసీ.

నిశ్శబ్దంగా అతడి సోదరులు అతడిని అనుసరించారు.

ఆమె కనబడే దగ్గరకు వచ్చి ఆగిపోయాడు.

ఒక్కక్షణం తనని తాను నమ్మలేకపోయాడు.

అతడి హృదయం విషాదంతో నిండిపోయింది.

ఆమె పసుపురంగు కురులు ఎండిపోయి గోధుమరంగుకు మారిపోయాయి.

ఆమె శరీరం వడలిపోయి, ముడుచుకుపోయి, ముడతలు పడి ఎండిపోయింది.

అతడి హృదయంలో ఆవేదన ఉవ్వెత్తున ఎగసింది.

ఇన్నాళ్లూ ఆమెని రేపు పలకరించవచ్చు, రేపు పలకరించవచ్చు అనుకుంటూ ఎదురుచూశాడు. కానీ ఆలస్యం అయిపోయింది.

ఇదంతా తన సోదరుల పని అని అతడు గ్రహించాడు.

అందాన్ని నాశనం చేయటం వాళ్లకి ఆట అని అతడికి తెలుసు.

ఎవరిని ఏమనీ లాభంలేదు. ఈ సృష్టిలో ఎవరి స్వభావాన్ని అనుసరించి వారు ప్రవర్తిస్తారు.

ధైర్యంచేసి అడుగుముందుకు వేశాడు.

మృదువుగా ఆమెపైనుండి కదిలాడు.

అతడి తాకిడికి ఆమె ఎండిపోయిన కురులు రేకులురేకులుగా విడిపోయి ఎగిరిపోయాయి.

బిత్తరపోయాడతడు.

కానీ సృష్టిలోని గొప్పతనం అతడికి అర్థమయిది. ఎగిరిపోయిన ఒక్కోరేకు ఎక్కడో మళ్లీ ఆమెగా మారుతుంది. సృష్టిని అందంతో నింపుతుంది.

అందం నాశనం అవటం అన్నది అపోహ.

ఈ సృష్టిలో నాశనం అన్నది లేదు. ఒకరూపం నుంచి మరో రూపానికి మారుతూ ఒక స్థలం నుంచి మరో స్థలానికి మారుతుంది.

అంతే..ఇక్కడ ప్రేమించాల్సింది ఒక వస్తువునో, వ్యక్తినో కాదు.. ప్రేమించాల్సింది సృష్టిని. సృష్టిలోని అణువణువుని..ఈ అత్యద్భుతమైన సృష్టిని సృజించిన సృష్టికారుడిని. ఇదే అసలు ప్రేమ.

మళ్లీ మెల్లిగా వీయసాగింది దక్షిణపు గాలి.

****

దక్షిణ అమెరికాకు చెందిన ఈ జానపద ప్రేమగాధ దక్షిణపు గాలి వీయటంతో పూచి, పుప్పొడిని విస్తరించే సింహదంతి పుష్పం, గాలి నడుమ ప్రేమగాధను ప్రదర్శిస్తుందీ కథ.

తేడాలు గుర్తిస్తారా



పిల్లలూ! ఈ రెండు బొమ్మల మధ్య ఉన్న తేడాలను గుర్తిస్తారా



పదాల ఆట

L	P	E	X	E	V	Y	L	F	R	E	T	T	U	B
G	I	B	S	R	I	M	T	M	L	A	E	Z	E	M
S	G	A	U	P	A	T	O	E	S	T	N	A	O	E
I	D	I	T	M	R	L	O	S	K	T	K	T	B	L
L	G	O	W	E	B	I	L	O	Q	C	H	U	E	T
V	H	C	K	R	L	L	N	I	C	U	I	R	W	E
E	D	L	R	X	A	T	E	G	P	W	I	R	M	E
R	Y	B	U	R	G	E	S	B	T	R	S	T	C	B
F	M	R	O	W	H	C	N	I	E	A	E	V	O	Z
I	H	L	I	C	E	R	T	S	R	E	I	T	I	C
S	A	W	E	E	V	I	L	N	Q	B	C	L	A	Y
H	D	I	H	P	A	F	P	S	A	W	B	Y	S	C
R	I	J	G	R	A	S	S	H	O	P	P	E	R	Z
F	L	E	A	L	A	D	Y	B	U	G	N	I	N	D
H	O	N	E	Y	B	E	E	L	T	A	E	B	L	W

పిల్లలూ! ఈకింది పదాలు పైపజిల్‌లో ఎక్కడున్నాయో గుర్తిస్తారా.

ANTS, APHID, BEATLE, BEETLE, BRISTLE TAIL, BUMBLEBEE, BUTTERFLY, CATERPILLAR, COOTIE, CRICKET, EARWIG, FLEA, GRASSHOPPER, GRUB, HONEYBEE, INCHWORM, LADY BUG, LICE, MOSQUITO, MOTH, SILVERFISH, SPRING TAILS, TIC, WASP, WEEVIL

స్వర్గం-నరకం

కథ

రత్నగిరి గ్రామంలో విలోముడనే వ్యాపారి ఉండేవాడు. అతనెప్పుడూ ధర్మ బద్ధంగా వ్యాపారం చేస్తూ దైవచింతనతో వుంటూనే దానధర్మాలు కూడా ఆయా పవిత్ర దినాలలో నిర్వహిస్తూ, తనకుతానే దానకర్ణుడిగా భావించుకునేవాడు. ఎన్ని పుణ్యాలు కోరి ఉపవాసాలు ఆచరించినా ఎప్పుడూ అసంతృప్తి అతణ్ని వెన్నాడుతుండేది. దానివల్ల ఇతరులతో ముఖస్తుతి కోసం సౌమ్యంగా ఉన్నా ఇంట్లో మాత్రం పిల్లల్ని, భార్యను కసురుకోవటం, తల్లిదండ్రులను విసుక్కోవటం చేసేవాడు. ఎప్పటికప్పుడు వ్యాపారంలో ఎక్కడ నష్టాలు వస్తాయోనన్న భీతితో హడావుడిపడుతూ, దుకాణంలోని ప్రతి పనివాడిని అనుమానిస్తూ చిరాకుగా ఉండేవాడు.

అలాంటి సమయంలో ఎప్పుడో దుకాణం మూసివేసి పొరుగు రాజ్యానికి వలసవెళ్లిన ఎదురింటి వజ్రకాంతుడు తన కుమార్తెకు పెళ్లిచేసి, కానుకగా తమ వంశపారంపర్య దుకాణాన్నిఇచ్చినందున అతని అల్లుడు సుధాముడు కొత్తగా వచ్చి వ్యాపారం ప్రారంభించాడు. అనుభవం తక్కువ కారణంగా లాభాలకంటే ఎక్కువగా నష్టాలే రాసాగాయి. అయినా ఎప్పుడూ అతని కుటుంబం చాలా సంతోషంగా కనిపించేది. అది విలోముడికి కంటగింపుగా ఉండేది.

ఒకరోజు కార్తీక సోమవారం కావటంతో శివాలయంలో దానధర్మాలు చేస్తున్న విలోముడికి అర్చన ముగించి వెలుపలికి వస్తున్న సుధాముడు కనిపించాడు. ఎప్పటిలాగే పలకరింపుగా నవ్వాడతను. గుడిముందున్న కొందరు భిక్షగాళ్లకు తన వద్ద ఉన్న కాస్త ధనం పంచి ఇంటికెళ్లిపోయాడు. అలాగే ధనుర్మాసంలో కూడా నిత్య పూజలతో గడప సాగాడు విలోముడు. సుధాముడు మాత్రం కుదిరినప్పుడే పూజలు, దానాలు చేసేవాడు. తర్వాత సుధాముడు కూడా నెమ్మదిగా లాభాలు గడించసాగాడు.

అయినా ఎప్పుడూ అపాత్ర దానాలజోలికి పోయేవాడు కాదు. ఇలా ఉండగా ఒకరోజు ఓవృద్ధుని కుటుంబం వర్షంలో తడిసి విలోముని ఇంటి అరుగునాశ్రయించారు. రాత్రి సమయం కావటంతో చలికి తాళలేక తలుపుతట్టి సహాయం అర్థించారు. ఇంత రాత్రివేళ నిద్ర చెడగొట్టడమేకాక, దానధర్మాలు చేసినా రెట్టింపు పుణ్యం వచ్చే రోజులేమీకాదని భావించి, కోపంతో కసిరి తలుపువేసుకుని వెళ్లిపోయాడు.

మర్నాటి ఉదయం కొత్త దుస్తులు ధరించి, సుష్టుగా పలహారం ఆరగించి సుధాముని కుటుంబాన్ని దీవించి వెళుతున్న వృద్ధుని కుటుంబాన్ని గమనించి నవ్వుకున్నాడు విలోముడు. సుధాముడిని పిచ్చివాడిగా జమకట్టాడు కూడా.

కొంతకాలం తర్వాత అనారోగ్యంతో మంచంపట్టాడు విలోముడు. కొడుకు వ్యాపారం కొనసాగించాడు. ఎదురిల్లే కనుక విలోముడిని పరామర్శించడానికి వచ్చాడు సుధాముడు. చింతింపవద్దని త్వరలో కోలుకుంటారని ఊరడించాడు.

వార్త ఆదివారం

అదేమీ పట్టించుకోకుండా విలోముడు నవ్వుతూ తనకేమీకాదని, ఒకవేళ మరణించినా పుణ్యమాసాలలో చేసిన దానధర్మాలు, పూజల వల్ల స్వర్గానికే వెళ్తానని ధీమాగా అన్నాడు. అంతే కాక, 'నష్టాలను సైతం పట్టించుకోకుండా వృధాదానాలతో గడిపిన నీకు నరకానికి వెళ్తానన్న భయం లేదా?' అంటూ ఎదురు ప్రశ్నించాడు కూడా.

అదివిని ఆశ్చర్యపోయిన సుధాముడు విలోముని అసలు బుద్ధి అర్థమై ఇలా అన్నాడు. 'అయ్యా! స్వర్గం, నరకం అనేవి ఎక్కడో ఉంటాయని మీరు నమ్మటం చూస్తే ఆశ్చర్యంగా వుంది. ఎదుటివాడు కష్టాల్లో ఉన్నప్పుడుకాకుండా, పుణ్యమాసాల పేరుతో కష్టాలు లేనివాడిని కూడా పిలిచి దానం చేయటం వల్ల వాడిని సోమరిగా మార్చినట్లవుతుంది. అదే నిజానికి పాపం. పుణ్యమంటే బయట మంచిపేరు, సంపాదించుకుని ఇంట్లోవాళ్లను కష్టపెట్టడం కాదు. కేవలం పూజలవల్ల పుణ్యం, స్వర్గం రావు. లాభం, నష్టం విధి లిఖితాలు. దానికి చింతించి ప్రయోజనం లేదు. మానసిక ధైర్యాన్ని ఇచ్చే మన కుటుంబం తోడుంటే దేన్నయినాసాధించవచ్చు. కానీ మనో నిబ్బరం కోల్పేతే అదే నరకం. కాబట్టి కళ్ల ముందున్న అన్నార్తుడిని ఆదుకోవటమే నా దృష్టిలో పుణ్యం. మన కోసం నిరంతరం ఆలోచించి మన ఉన్నతిని నిస్వార్థంగా కాంక్షించే కుటుంబంతో కలిసి నవ్వుతూ గడపడమే స్వర్గం' చెప్పి వెళ్లిపోయాడు.

తనకన్నా చిన్నవాడైనా జీవిత పరమార్థాన్ని చక్కగా వివరించిన సుధాముడిని మనసులోనే అభినందించి, త్వరలోనే స్వస్థుడై కష్టాల్లో ఉన్న వారిని ఆదుకుంటూ, సంతోషంగా జీవించాడు విలోముడు.

-దేగల అనితాసూరి

హలో ఫ్రెండ్...

చిన్నారుల ప్రశ్నలకు

వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

గిరీష్ అంకుల్ సమాధానాలు

డి.నాగరాజ్, హైదరాబాద్

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. నేను ఎనిమిదో తరగతి చదువుతున్నాను. జూలై, ఆగస్టు నెలల్లోనే వర్షాలు ఎందుకు పడతాయి? దయచేసి వివరించండి.

జవాబు: నాగరాజ్! రుతుపవనాల ఆధారంగా మనదేశంలో కురిసే వర్షాలు జూలై, ఆగస్టు నెలల్లో పడుతుంటాయి. ఏప్రిల్, మే నెలల్లో గ్రీష్మ రుతువు. తీక్షణమైన సూర్యకిరణాలు మన దేశ భూభాగంలో నిట్టనిలువుగా పడుతుంటాయి. అందువల్లనే వేసవికాలంలో ఉష్ణోగ్రత అధికంగా ఉంటుంది. ఆ వేడి వలన మనదేశ భూభాగంలో ఉండే గాలి కూడా బాగా వేడెక్కుతుంది. అలా వేడెక్కడం వలన గాలి వ్యాకోచించి సాంద్రత క్షీణిస్తుంది. ఇదేవిధంగా అరేబియా సముద్రం మీద కూడా సూర్యకిరణాల తాకిడి వలన ఉష్ణోగ్రత అధికమై, అక్కడి నీరు ఆవిరై మేఘాలు ఏర్పడుతాయి. అయితే తేమ వలన అక్కడి గాలి సాంద్రత పెరుగుతుంది. గాలి, నీరు వంటి ప్రవాహకాలు ఎప్పుడూ అధిక సాంద్రత నుంచి అల్ప సాంద్రత వైపుకు ప్రయాణిస్తాయి. ఈకారణంగా అక్కడి గాలులు మన భూభాగంలో ఏర్పడిన అల్పసాంద్రత వైపుకు ప్రయాణిస్తాయి. ఆ గాలులతో పాటు మేఘాలుకూడా వస్తాయి. వీటినే మన వాతావరణ పరిశోధకులు నైరుతీ రుతుపవనాలు' అంటారు. ఆ విధంగా వచ్చిన మేఘాలు వాతావరణ పరిస్థితుల వల్ల చల్లగాలికి చల్లబడి వర్షాలుగా భూమ్మీద పడతాయి. మన దేశానికి ఆగ్నేయదిశగా ఉన్న బంగాళాఖాతం నుంచి కూడా మేఘాలు రావాలిగాని, బంగాళాఖాతం సూర్యుడు ఉదయించే తూర్పు దిశగా ఉండటం వల్ల అక్కడి జలాల కన్నా అరేబియా సముద్రంలోని జలాలే అత్యధిక స్థాయిలో వేడెక్కుతాయి. ఈ కారణంతోఅరేబియా సముద్రం వలన ఏర్పడిన ఎక్కువ మేఘాల ద్వారా మనకు వర్షం వస్తుంది.

వి.సాధన, అనంతపురం.

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. నేను ఎనిమిదో తరగతి చదువుతున్నాను. మనిషి మెదడుకు నిద్ర అవసరమేమిటి? దయచేసి చెప్పండి.

జవాబు: సాధనా! నిత్యజీవితంలో కొత్తకొత్త నైపుణ్యాలను, నిర్వహణా సామర్థ్యాలనూ పెంచుకోవడానికి మెదడు పనితీరులో నిద్ర దోహదపడుతుంది. సృజనాత్మకత పెంపొందడంలో నిద్ర పాత్ర చాలా కీలకమైంది. మెలకువతో ఉన్నప్పుడు సమకూర్చుకున్న సమాచారాన్నంతటినీ సమీక్షించుకుని, ధృవపరచుకోవడానికి మెదడుకు నిద్ర తోడ్పడుతుంది. ఆలోచనలకు కావలసిన శక్తిని తిరిగి నింపుకోవడానికి, అనవసరమైన, అప్రయోజనకరమైన అంశాలను, ఆయా వివరాలను మెదడులోనుంచి మినహాయించడానికి నిద్ర ఉపయోగపడుతుంది.

సాహిత్యంలో ప్రేమ

ప్రతి రచనను అంతర్లీనంగా ఒక కారణమో, భావోద్వేగమో, అభిప్రాయమో, సంఘటనో, పరిస్థితో, అనుభవమో, పరిచయమో, వేదనో... ఏదో ఒక మోటివ్ నడిపిస్తూ ఉంటుంది. తెలుగు సాహిత్యంలో విభిన్న అంశాల మీద రచనలు వెలువడినా చర్చనీయాంశాలుగా తదుపరి వివాదాస్పదంగా మారినవి మాత్రం ప్రేమ, స్త్రీ-పురుష సంబంధాల మీద రాయబడినవే ఎక్కువ శాతం.

ప్రతి రచనలో కథ, సంఘర్షణ అనే రెండు అంశాలు మిళితమై ఉంటాయి సాధారణంగా పాఠకుడికి ఓ అభిప్రాయం, విశ్లేషకుడికి ఇంకో అభిప్రాయం ఏర్పడుతూ ఉంటాయి. కథకే పరిమితమైతే అది పాఠకుడి జీవనశైలి, అతని వాతావరణం, కథకు ఉన్న సంబంధం, మానసిక ప్రవృత్తి వంటి అంశాలపై పాఠకుడి స్పందన ఆధారపడి ఉంటుంది. అదే విశ్లేషకుడు అయితే రచన జరిగిన కాలం, అప్పటి పరిస్థితులు, ప్రేరణ, వెనుకటి స్థితిగతులు, పాత్రల సహజ స్వభావాలు, మారే నైజాలు వంటి అంశాలకు సమగ్రమైన తన అనుభవాన్ని జోడించి స్పందిస్తాడు.

డి.హెచ్. లారెన్స్ 'సన్స్ అండ్ లవర్స్' అనే నవల్లో ప్రధాన పాత్ర ఫిలిప్‌ను ఒకామె ప్రేమిస్తుంది. ఆమెది చాలా చిత్రమైన ప్రేమ. ఫిలిప్ తన పనిముట్లతో పనిలో మునిగిపోయి ఉన్నప్పుడు ఆమె ఫిలిప్‌ను ఎంతో ఆర్ద్రంగా ప్రేమిస్తుంది. తీరా ఫిలిప్ పని చేయడం పూర్తి చేసి తన దగ్గరికి వచ్చాక అతన్ని ద్వేషిస్తుంది. అసహ్యించుకుంటుంది. ఇది చాలా చిత్రమైన మనస్తత్వం. 'ఈడిసన్ కాంప్లెక్స్' అనేది ఎంత సంక్లిష్టంగా ఉంటుందో నిరూపించే సంఘటన ఇది.

సరిగ్గా ఇలాంటి సంఘటనే పింగళి సూరన కళా పూర్ణోదయంలో మనకు కనిపిస్తుంది. సుగాత్రి శాలీనుల కథలో సుగాత్రి చాలా అందగత్తె. ఆమె ప్రతిరోజూ రాత్రి అందంగా నగలతో అలంకరించుకుని తన భర్త శయ్యా మందిరానికి వస్తుంది. అయితే శాలీనుడు ఆమెను, ఆమె అలంకరణను కనీసం కన్నెత్తి కూడా చూడడు. ఆమెతో మాట్లాడడు. స్తబ్దంగా పడుకుని నిద్రపోతాడు. ప్రతిరోజూ అంతే! తన భర్త ఎందుకు అలా అవుతున్నాడు? సుగాత్రికి అర్థం కాదు. తన అందం, అలంకరణ తన భర్తను ఆకర్షించలేకపోయినందుకు ఆమె స్త్రీ హృదయం గాయపడుతుంది. క్షోభిస్తుంది.

ఒకరోజు శాలీనుడు తన ఉద్యానవనంలో పూలమొక్కలకు పాదులు చేస్తూ, నీరు పెడుతూ ఎండలో చెమటలు కక్కుతూ శ్రమ పడుతుంటాడు. తన భర్త అంత శ్రమ పడుతుంటే చూస్తూ కూచోవడం ఇష్టంలేక తన నాథుడికి పనిలో తోడ్పడాలన్న అభిలాషతో, అలా తోడ్పడితేనన్నా తన మీద జాలి, దయ, ప్రేమ కలుగుతుందేమోనన్న ఆశతో ఆమె మట్టిలో, ఎండలో పని చేసేటప్పుడు బట్టలూ, నగలు మురికవుతాయేమోనని వాటిని తీసేసి అతి సాధారణ దుస్తులతో నిరాలంకరణగా వచ్చి భర్తతోపాటు తోటలో పని చేస్తుంటుంది.

పని మధ్యలో శాలీనుడు తలెత్తి మట్టిలో చెట్లకి పాదులు చేస్తూ చెమటతో అలసిపోయిన భార్యను చూస్తాడు. ఆమె మీద అప్పుడు ఎక్కడ లేని ప్రేమ పుట్టుకొస్తుంది. ఆమె సహజ సౌందర్యం చూసి ముగ్ధుడౌతాడు. చేస్తున్న పని వొదిలి ప్రేమగా ఆమె దగ్గరకు చేరతాడు. ఎంతో కాలంగా తనవైపు కన్నెత్తి చూడని తన నాథుడు అంత ప్రేమగా తన దగ్గరకు చేరేసరికి

సాహితీవనం

ఆనందంతో, సిగ్గుతో ఆమె తలమునకలై ఇంట్లోకి పారిపోతుంది. ఇంత కాలానికి తన భర్త తనకు దగ్గరయ్యాడనే ఆనందంతో రాత్రయ్యేసరికి ఆమె చీని చీనాంబరాలు, నగలు ధరించి, చక్కగా అలంకరించుకుని భర్త శయ్యామందిరానికి వస్తుంది. తన భార్య తెచ్చిపెట్టుకున్న అలంకరణను, సౌందర్యాన్ని చూసి శాలీనుడు మళ్లీ ఆమె ఎడల విరక్తుడవుతాడు. కథ మళ్లీ మొదటికొస్తుంది.

ఇదోరకమైన ప్రేమభావన. 'ప్రేమ' జనించడానికి ఒక్కొక్కరికి ఒక్కో మోటివ్ ఉంటుంది. ఆ మోటివ్ పరిధిలోకి ఎదుటి వ్యక్తి వచ్చినప్పుడే వారు ప్రేమను వెలిబుచ్చగలరు. మామూలు పరిస్థితులు వారిని ప్రభావితం చెయ్యలేవు.

మపాసా రాసిన ఓ కథలో ఇద్దరు ప్రేమికుల విషయాన్ని రాస్తాడు. పేపర్లో ఓ వార్త ప్రచురింపబడుతుంది. అదేమిటంటే ఇద్దరు యువతీ యువకులు ఒకర్నొకరు గాఢంగా ప్రేమించుకుంటారు. యువతి తనని కాక మరొకర్ని ప్రేమిస్తోందన్న విషయం తెలిసి ఆ ప్రియుడు తన ప్రేయసిని హత్య చేసి, ఆత్మహత్య చేసుకుంటాడు. విషయం చాలా చిన్నదిగా అనిపించినా మానవ హృదయంలో సత్యం ఇమిడి ఉంది. అందులో గొప్పగా, గాఢంగా ప్రేమించగలిగినవాళ్లు కేవలం ఒక్కసారే అలా ప్రేమించగలరు. వాళ్లకి ఆ ప్రేమ స్వర్గం. ప్రేమే ప్రపంచం, ప్రేమే జీవితం. అంత గాఢంగా ప్రేమించినవాళ్ల ప్రేమకి ఏ కొంచెం విఘాతం కలిగినా హత్యలు చేస్తారు. ఆత్మహత్యలకు పాల్పడతారు. ప్రేమలో పొసెసివ్‌నెస్ ఉంటుంది. మహాప్రవక్తల్లాంటి వాళ్ల నిస్వార్థ ప్రేమికులయినా, ప్రగాఢ ప్రేమలో స్వార్థం ఉంటుంది. ఇది మానవ హృదయం తాలూకు నగ్నసత్యం.

అదే కథలో మపాసా ఒక పక్షుల వేటని వర్ణిస్తాడు. అది మనుషుల్లోనే కాక పక్షుల్లో కూడా గాఢ ప్రేమ అనేది ఎంత బలవత్తరంగా ఉంటుందో, ఆ ప్రేమ జీవితాల్ని ఎలా పాలిస్తుందో చూపిస్తాడు. ఒక జాతి పక్షులు తమ జంట పక్షి చనిపోతే అవి లేక బతకలేవు. అవీ చనిపోతాయి. చిన్న క్లాసుల పాఠ్యపుస్తకాల్లోని 'కపోత సందేశం' కథ కల్పితం కాదు. నిజం. ఆ పక్షులు తమ జంట పక్షి చనిపోతే అవి లేక బతకలేవు. వాటిని వదిలిపెట్టిపోక వాటి చుట్టూ తిరుగుతూ వాటి దగ్గరకే వస్తాయి. అందుకని ఆ పక్షుల్ని వేటాడేవారు. ఓ పక్షిని చంపి మళ్లీ ఆ చంపిన పక్షుల్ని బయటే ఉంచుతారు. అప్పుడు వాటి జంట పక్షులు కూడా అక్కడికి వస్తాయి. అప్పుడు వాటిని చంపడం తేలిక. తమ జంటని వదల్లేని పక్షుల ప్రేమ ఎంత గొప్పదో నిరూపిస్తుంది ఆ కథ. ప్రేమసూత్రం సృష్టిలోని మనుష్యులనేగాక పశుపక్ష్యాదుల జీవితాల్ని ఎలా శాసిస్తుందో నిరూపిస్తాడు మపాసా.

స్వేచ్ఛా ప్రేమని సుతారం స్పృశిస్తూ చలం రాసినది 'మైదానం'. ఈ నవల లేఖారూపంలో ఉంది. నవలలో ప్రధాన పాత్ర రాజేశ్వరి. తన గత జీవితాన్ని ఒక మిత్రురాలికి విపులంగా రాసిన ఉత్తరం మైదానం నవల. ఈ నవల శోత్రీయులలో విపరీతమైన సంచలనాన్ని రేపింది. బ్రాహ్మణ గృహిణి రాజేశ్వరి, తన లాయరు భర్తను వొదిలి అమీర్ అనే ముసల్మాన్ ప్రియుడితో వెళ్లిపోయి ఏకాంత మైదానంలో అతనితో గొప్ప శృంగార జీవితాన్ననుభవిస్తుంది. ఆ శృంగార జీవిత వెలుగునీడల సంకలనమే మైదానం.

చలం 'మైదానం' నవలని వ్యతిరేకిస్తూ అందులోని స్వేచ్ఛా ప్రేమని ఖండిస్తూ, సాంప్రదాయిక ధర్మాన్ని సమర్థిస్తూ విశ్వనాథ 'చెలియలి కట్ట' నవల రాశారు. కాలగమనంలో సంఘంలో వచ్చే విపరీతమైన మార్పుల్ని గుర్తిస్తూ, వాటి నుండి సంఘం రక్షింపబడాలంటే సాంప్రదాయిక సంఘ ధర్మానికి కట్టుబడి ఉండటమే పరిష్కారమని విశ్వనాథ నమ్మకం.

విశ్వనాథ నవలా ప్రారంభంలోనే ఒక బైరాగిచేత జీవితాన్ని చెలియలికట్ట కట్టడికి లోబడి ఉండవలసిన కల్లోల సముద్రంతో పోలుస్తూ తత్వాన్ని పాడిస్తూ ప్రారంభిస్తారు. జీవితం ఒక కల్లోలిత సముద్రం. అయితే ఎన్ని కల్లోలాలున్నా సముద్రం చెలియలికట్టకు లోబడినట్టు జీవితం కూడా తరతరాలుగా వస్తున్న సాంఘిక కట్టుబాట్లకు లోబడి వుండాలనీ, మనసు ఒక పెంకి గుర్రం లాంటిదనీ, దానికి కళ్లెం వేసి అధీనంలో



ఉంచుకోకపోతే జీవితమనే రౌతును ముళ్లకంచెలో పడవేసి పోతుందనీ, అందుచేత చంచలమైన మనసును అధీనంలో ఉంచుకోవాలని సూచన. తన నవలలోని పరిణామాన్నంతా విశ్వనాథ ఈ పాటతోనే సూచనగా చెప్పారు. మిగిలిన కథనమంతా దానికి సోదాహరణ, విపులీకరణ మాత్రమే.

జీవితం మైదానంలా సువిశాలమైనది. దానికి ఎల్లలు గీయడం అర్థంలేని పని. జీవితం సామాజిక, దేశ, కాల పరిస్థితుల్ని బట్టే కాక వ్యక్తిగత, మానసిక, హృదయ పరిస్థితుల్నిబట్టి తన ఎల్లల్ని తాను నిర్ణయించుకోవలసిందే కదా! మతం, దేవుడు, సాంఘిక కట్టుబాట్లు, పాపభీతి, అనేకానేక ఇతర భయాలు, సరిహద్దుల్ని గీసి ఆపలేవని చలం నమ్మకం.

ఇక 'చెలియలికట్ట' నవలలో రత్నావళి మరిది రంగారావుతో లేచిపోయి మద్రాసు చేరుతుంది. రంగడికి ప్రేమ, జీవితం విషయంలో సరైన అవగాహన, నిశ్చితమైన అభిప్రాయమూ లేవు. రత్నావళి తన ముసలి అన్న సీతారామయ్యను రెండో వివాహం చేసుకుని బాధలను భరిస్తోందనీ, అందుకు మూఢాచారాలు, సాంఘిక కట్టుబాట్లు, జీవితం అంటే సరైన అవగాహన లేకపోవడమూ కారణమని భావించి పుస్తకాల ద్వారా రత్నావళిని చైతన్యురాలిని చేస్తాడు రంగారావు. ఎటొచ్చీ స్వేచ్ఛ ఒక్కటి జీవిత పరమావధిగా భావిస్తాడు. మద్రాసు చేరాక జీవితం విషయంలో ప్రాక్టికల్‌గా ఎదుర్కొనవలసిన ఆర్థిక, సామాజిక ఇబ్బందుల్ని ఒక్కొక్కటిగా స్వానుభవంమీద తెలుసుకుంటాడు. స్త్రీ స్వేచ్ఛగా తను ప్రేమించిన ఇష్టపడినవాడినే వివాహం చేసుకోవాలనే తన సిద్ధాంతానికి తనే నిలవలేడు. చివరికి స్వానుభవం మీద రత్నావళి రంగడి సిద్ధాంతం లోని లోపాన్ని ఎత్తి చూపి అతనికి జ్ఞానోదయమయ్యేట్టు చేస్తుంది. ప్రేమకు నీడ ద్వేషం. రత్నావళి తన మిత్రులతో స్నేహంగా మెలగడం కూడా సహించలేడు. ఇక్కడ మాత్రం సిద్ధాంతాలు జీవితానుభవ ప్రవాహం ముందు నిలవవు అని చూపించే విశ్వనాథ తన నవలనే జీవితాన్ని సిద్ధాంతీకరించే ప్రయత్నానికి, దానిని సమర్థించుకునేందుకు ఉపయోగించుకున్నారు. చివరికి రత్నావళికి జ్ఞానోదయమై మళ్లీ 'సంఘం శరణం గచ్ఛామి' అనిపించి, అక్కడితో తృప్తిపడక, ఆవిడ ఒకసారి అపవిత్రంగా లేచిపోయింది కాబట్టి, స్త్రీగా, భార్యగా బతికేందుకు- ముఖ్యంగా సంఘంలో బతికేందుకు అవకాశం లేకుండా ఆమెను సముద్రంలోకి పంపి ఆత్మహత్య చేయించారు. పాపం సీతారామయ్య తప్పేమీ లేకుండా పవిత్రుడిగా చూపేందుకు మాటమాత్రంగా ఆమెను ఆ ప్రయత్నం నుంచి వెనక్కు రమ్మని పిలిచారు శుష్కంగా. నిజంగా వ్యక్తిత్వం వున్న పాత్ర నవలలో రత్నావళే! తను ఎంచుకున్న జీవితం కోసం అన్నిటిని తెంచుకుపోవడమే కాక నిజమైన ఆత్మాభిమానంతో ప్రాణత్యాగానికి తెగించింది. అలల జడి సముద్రంలాంటి రత్నావళిని బయటకు తెప్పించి మళ్లీ వెనక్కి పంపి చెలియలి కట్టలాంటి సంఘానికి లోబరిచినట్టు తృప్తిపడ్డారు. 'సమాజమే అన్నిట్లో ఒప్పు అన్నట్లు'.



సమాజంలో తారస పడే సజీవ, రక్త మాంసాలు గల పాత్రలున్న నవల 'మైదానం'. 'మైదానం' పాత్రలు వ్యక్తితం ఉన్న పాత్రలు. తమ జీవితాన్ని తామే నిర్ణయించుకుని, తమకు తామే కర్తలుగా, స్థిరచిత్తంతో ముందుకు వెడతాయి. రిగ్రెట్స్, వెనకడుగు వేయడం లాంటివి వాటికి తెలియదు. జీవితంతో కదిలిపోతూ అనుభవానికి, పరిస్థితులకి తట్టుకుంటూ సజీంగా ముందుకు వెడతాయి, సమస్యలను ఎదుర్కొంటాయి.

విశ్వనాథ పాత్రలు సృష్టించబడ్డ పాత్రలని తెలిసిపోతుంటాయి. అక్కడక్కడా చర్చలలో తాము ఏ సిద్ధాంతాల ప్రాతిపదికగా సృష్టించ బడ్డాయో మనకు గుర్తు చేస్తూ ఉంటాయి. స్వేచ్ఛావాదాన్ని అవహేళన చేసేందుకు రత్నావళిచేత భర్తను కొట్టించడం, భర్తను సాత్వికంగా చూపడం జరిగింది.

'ప్రేమ' అనే భావన ఒక్కొక్కరి దృక్కోణాన్నిబట్టి మారిపోతూ ఉంటుంది. దానికి కాలం, అభివృద్ధి, సమాజరీత్యా సంబంధాలకు పెరిగే ప్రాధాన్యాన్ని బట్టి అభిప్రాయాలు మారుతూ ఉంటాయి.

సాహిత్యమంతా తరచి చూస్తే సమకాలికులైన రచయితలు ఒకే అంశమైన 'ప్రేమ'పై రాసినా ఆ పాత్రల వ్యక్తిత్వం, సంఘర్షణ, ముగింపు శైలి భిన్నంగా ఉంటాయి. దానికి ఖచ్చితంగా ఇదే హేతువు అని చెప్పలేకపోయినా అది వారి అనుభవం, నమ్మకాలు, ఏర్పరచు కున్న అభిప్రాయాల పాత్రను కలిగి వుంటుందని చూచాయగా చెప్పవచ్చు. ప్రేమలోని ఏ భావన అయితే సమాజంలో ఎక్కువ మంది చేత ఆమోదించబడదో అది వివాదాస్పదమైంది. సమాజ చిత్రణలో 'ఉత్తమం' అని ముద్రతో సాగే భావనలతో నిండే రచనే వివాదం లేకుండా ప్రశాంతంగా నిలిచింది. రచయితకు సమాజ అవగాహన, విశ్లేషణ మెండు అయినా ఒక్కోసారి నిజ జీవితాల్లో సమాజానికి, వ్యక్తిగత అంశాలకు సంఘర్షణ ఏర్పడినప్పుడు అతను తన స్వాతంత్ర్యం మీద వ్యవహరిస్తాడు... అదే రచనాస్వేచ్ఛ.

ఏది ఏమైనప్పటికీ సాహిత్యంలో ప్రగాఢ ముద్ర వేసిన అంశం 'ప్రేమవాదం'.. అది ఎన్ని కోణాల్లో తిరిగినా, ఇంకో కొత్త కోణానికై వేచే ఉంటుంది.

-శృంగవరపు రచన

కథ

సాగిపోయే ఖాళీలు

– బి.కరుణాకర్

ఇది చాలా సంవత్సరాల కిందటి మాట. అప్పటికి నా వయసు ఇరవై రెండు సంవత్సరాలు. అంతకు రెండేళ్ల ముందు డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగం వేటలో ఉండగా ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజి ఆఫీసునుండి సికిందరాబాద్‌లోని ఒక మిలటరీ ఎకౌంట్స్ ఆఫీసులో రాతపరీక్ష ఉంటుందనీ, ఆ పరీక్షలో పాస్ అయితే ఆడిటర్ ఉద్యోగానికి అర్హులవుతారని ఉత్తరం వచ్చింది.

సికిందరాబాద్ వెళ్లి పరీక్ష రాశాను. పోస్టులు ఎన్ని ఉన్నాయోగాని రాతపరీక్షకు అయిదు వందలకుపైగానే వచ్చారు.

అపపనమ్మకంతోనే రెండు గంటల రాత పరీక్ష ముగించాను. మంచిగా రాశానని నాకు అనిపించలేదు. ఆ ఉద్యోగం గురించి ఎటువంటి ఆశ పెట్టుకోలేదు. నెల తిరగకుండా రాతపరీక్షలో నేను పాసయినట్టు తెలియచేస్తే, అందులో జతపరచిన ఖాళీ మెడికల్ సర్టిఫికెట్ సివిల్ సర్జన్ సంతకం చేయించి వీలయినంత త్వరలో పంపించమని తెలియచేశారు.

ఫిట్‌నెస్ సర్టిఫికెట్ సంపాయించిన మూడు వారాలకు పూనా(అప్పట్లో పూణేను అలా అనేవారు) లోని డిఫెన్స్ ఎకౌంట్స్‌లో వెంటనే చేరమని ఆర్డరు వచ్చింది.

జీతం ఎక్కువేంకాదుగాని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం అవటాన తాత్సారం చేయలేదు. నేను చేరిన ఆఫీసులో తెలుగువాళ్లు ఉండబట్టి అక్కడ బతకగలను అన్న ధైర్యం వచ్చింది. నాకు ఇచ్చిన పని కష్టమయినదేమీ కాదు. ప్రతి నెలా అయిదో తేదీ నుండి ఇరవయ్యో తేదీ వరకు బాగా పని ఉండేది. తర్వాత అట్టే పని ఉండేది కాదు.

అప్పట్లో ఉండేందుకు అక్కడ అద్దెకు ఇళ్లు దొరికేవి కావు. లాడ్జిల్లో ఉండాల్సి వస్తుండేది. హోటళ్లలో అన్నం దొరికేది కాదు. చపాతీలు తినలేక ఇబ్బంది పడేవాళ్లం. ఆ బాధలు పడలేక నాతో వచ్చిన వాళ్లల్లో సగానికి పైగా రాజీనామాలు చేసి వెళ్లిపోయారు. నాకూ వెళ్లిపోదామని అనిపించింది. కానీ మా ఊళ్లోని పరిస్థితుల వలన వెళ్లిపోలేకపోయాను. మేం ఉన్నవాళ్లమేమీ కాదు. నెల చివర్లో చాలా సార్లు పస్తులు ఉండేవాళ్లం. మూడో సంవత్సరంలో చిన్న గది దొరికింది. వంట చేసుకోవడం వచ్చు కాబట్టి ఇబ్బందిని తట్టుకున్నాను.

ఒకరోజు ఆఫీసులో ఉండగా సాయంత్రం నాలుగు గంటల సమయంలో నా కోసం ఎవరో వచ్చారని కబురు వస్తే రిసెప్షన్ గదికి వెళ్లాను. ఆ గదిలో ఒక్కడే ఉన్నాడు. నన్ను చూసి లేచి నుంచుని నమస్కారం పెట్టాడు. ప్రతినమస్కారం చేశాను. అతను ఎవరో నాకు తెలియదు. ఎత్తుగా చామనచాయలో అందంగా ఉన్నాడు. అతన్ని చూడడం అదే మొదటిసారి. అతనెవరో గుర్తు రావడంలేదు.

అతను చొరవగా నా కుడిచేయి అందుకుని, "నా పేరు కనకరాజు. గుంటూరు ఎ.సి. కాలేజీలో మీకన్నా రెండు సంవత్సరాలు సీనియర్‌ను. వాలీబాల్‌లో మన కాలేజీని రిప్రజంట్ చేసేవాడిని.... గుర్తొచ్చిందా?" అడిగాడు.

సోఫాలో ఇద్దరం పక్క పక్కన కూర్చున్నాం. కాలేజీలో నేనూ వాలీబాల్ ఆడేవాడిని. అతని పేరు వినలేదు.

"గుర్తు రాలేదనుకుంటాను. వదిలేయండి. పోనీ మీకు సాలిస్‌బరీ పార్కులో ఉండే సుందరరావు తెలుసు కదా?"

"వరసకు నాకు అన్నయ్య అవుతాడు. ఆయనిక్కడ లేడు. సూరత్‌లో ఉంటున్నాడు" అన్నాను.

"పోయినసారి కలిసినప్పుడు సూరత్‌కు బదిలీమీద వెళ్తున్నానని" అన్నాడు. వెళ్లిపోయాన్నదన్నమాట. సుందరరావుగారు నాకు బాగా తెలుసు. ఆయన ఎప్పుడయినా మీకు ఫోను చేస్తే నా గురించి అడగండి. ఈ రోజు ఏంపని లేదు. మిమ్మల్ని కలుద్దామని వచ్చాను" అన్నాడు.

ఆ సాయంత్రం దక్కన్ జింఖానా వరకు అతని మోటరు బైక్‌మీద వెళ్లి సినిమా చూసి, హోటల్లో భోజనం చేసి నన్ను మా గది దగ్గర వదిలిపెట్టి వెళ్లిపోయాడు. మాటల్లో అతను తన గురించి చెప్పింది ఏమంటే–



తను డిగ్రీ పూర్తి చేశాక చిలకలూరిపేట దగ్గరలో ఉన్న స్పిన్నింగ్ మిల్‌లో కొన్నాళ్లు కూలీగా, కొన్నాళ్లు సూపర్‌వైజర్‌గా పని చేశాక, దగ్గర బంధువు పూనా కాటన్స్‌లో ఫోర్‌మెన్ ఉద్యోగం ఇప్పించాడట. వాళ్ల కంపెనీ దగ్గరున్న చిన్న లాడ్జిలో ఉంటున్నాడు. జీతం అంత గొప్పగా ఏమీ ఉండదు కానీ లోటుగా మటుకు ఉండదని, ఇక్కడ ఎక్స్‌పీరియన్స్ సంపాదించాక ఏ బొంబాయో, అహమ్మదాబాదో వెళ్లిపోదామని ఉందట.

అతని మాటల్లో మర్యాద, మన్నన ఉంది. అతనితో గడిపిన నాలుగయిదు గంటలు చక చక గడిచిపోయాయి.

అతను వెళ్లి పోయేటప్పుడు అతను పని చేస్తున్న కంపెనీ పేరు, అతన్ని కాంటాక్ట్ చేయడానికి ఫోన్ నెంబర్ అడుగుదామనుకుంటూనే మర్చిపోయాను.

మూడు వారాల తరువాత ఆఫీసు నుండి తిరిగి నా గదికి వచ్చేసరికి బయట నా కోసం ఎదురు చూస్తూ తన మోటారు బైక్‌ను ఆనుకుని నిలబడి ఉన్నాడు.

సామాన్యంగా ఆఫీసు అయిపోగానే సైకిల్ మీద అట్టే ఆలస్యం చేయకుండా నా గదికి వచ్చేస్తుంటాను. గది తలుపు తాళం తీసి అతన్ని ఆహ్వానించాను. వచ్చి, లోపల కూర్చున్నాడు. ఈసారి వస్తూ నాకోసం చెక్స్ ఉన్న రెడీమేడ్ షర్ట్ తెచ్చాడు. తీసుకున్నాను. మూడు వారాల కిందట అయిన ఖర్చంతా అతనే భరాయించాడు.

"చెక్స్ మీకు నచ్చాయా?" అడిగాడు.

నిజానికి అటువంటి చెక్స్ ఉన్న చొక్కా కొనుక్కుందామని చాలా రోజుల నుండి అనుకుంటున్నాను. అయితే వచ్చే జీతం డబ్బుల్లో ఎంతో కొంత ఇంటికి పంపగా నెల చివరికొచ్చేసరికి ఇబ్బంది పడుతుంటాను.

"నచ్చాయి. చొక్కా బావుంది. సరిగ్గా ఇటువంటి చొక్కా కొనుక్కుందామని అనుకుం టున్నాను. మీరిచ్చారు. చాలా థేంక్స్. మీ కంపెనీ తయారుచేసిందా?

"కాదు.. మీకోసం కొన్నాను. మీరు త్వరగా రిఫ్రెష్ అయితే అలా వెస్టెండ్ వరకు వెళ్లి ఏదయిన ఇంగ్లీష్ సినిమా చూసి ఏ చైనీస్ హోటల్లో అయినా భోంచేద్దాం. చైనీస్ ఫుడ్ ఉంటే నాకు చాలా ఇష్టం. మరీ ముఖ్యంగా రొయ్యల కూర, వేపుడు".

నా గుండె జారిపోయింది. దీనికి తేలికగా వంద రూపాయలు ఖర్చు అవుతుంది. అంత నా దగ్గర లేదు. ఈసారి కూడా అతన్ని ఖర్చు పెట్టించడం బావుండదు. తన్నుండి చొక్కా తీసుకోడానికే గిల్టీగా అనిపించింది.

చాలా స్నేహాల్లో ఇచ్చి పుచ్చుకోడాలు లేకపోతే బలహీనపడతాయి. ఒకరు నన్ను చిన్నచూపు చూడడం ఇబ్బందికరంగా ఉంటుంది.

రిఫ్రెష్ అయ్యాక "మరో రోజు ఎప్పుడ యినా వెళ్దాం" అన్నాను, తప్పించుకుం దామని.

"వేరే ఏదయినా పనుందా?"

"లేదు. మా డిపార్ట్‌మెంట్ పరీక్షలకు సిద్ధపడుతున్నాను. అవి పాస్ అయితే ఎకౌంటెంట్‌ను అవుతాను"

"పరీక్షలు ఎప్పుడు?"

"మూడు నెలల తర్వాత"

"అబ్బో... చాలా సమయం ఉంది. పరీక్షలు ఇంకా రెండు వారాలుందనగా కూడా వచ్చి మిమ్మల్ని ఇబ్బంది పెడతాను. రండి సార్... తయారవ్వండి".

తప్పలేదు. ఆ పూట బాగానే ఖర్చు అయింది. నా గది దగ్గర నన్ను వదిలి వెళ్లిపోతుంటే పిలిచి అతను పనిచేసే కంపెనీ పేరు, కాంటాక్ట్ నెంబర్ అడుగుదామను కుంటూనే మర్చిపోయాను.

అతను వెళ్లిపోతుంటే చప్పట్లు కొట్టి పిలిచినా మోటరు వెహికిల్ చప్పుడులో వినిపించలేదేమో, ఆగలేదు.

తరువాత నెల గడిచాకగాని అతను నా గదికి రాలేదు. వస్తూ రెండు ఆకుపచ్చని విఐపి సూటుకేసులతో వచ్చాడు. అవి అంత పెద్దవీ కావు, చిన్నవీ కావు. బరువుగా ఉన్నా యనుకుంటాను. మెట్లెక్కి వచ్చేసరికి చొక్కా చెమటతో తడిసిపోయింది. నా గది రెండో ఫ్లోర్‌లో ఉంది. ఇనప మెట్లు మెలికలు తిరిగి ఉంటాయి. అవి నేనందుకునే లోపల తనే నా మంచం కిందకు నెట్టాడు.

"మంచి నీళ్లిచ్చేదా?"

వద్దన్నట్టు తల అడ్డంగా ఆడించాడు.

అయిదు నిమిషాల వరకు, అతన్ని పలకరించలేదు. సేద తీరాక గ్లాసులో మంచినీళ్లు ఇస్తే తాగాడు.

"ఊరెళ్తున్నారా?"

"ఈవేళ కాదు. రెండు మూడు వారాల తర్వాత"

"బొంబాయా?"

"కాదు. ముందు హైదరాబాద్ వెళ్లి, తిరిగివచ్చాక బొంబాయి వెళ్తాను. ప్రస్తుతం నేను పని చేసే కంపెనీ మూతపడే స్థితిలో ఉంది".

ఇప్పుడు కూడా అతను పని చేస్తున్న కంపెనీ పేరు అడగాలన్న ఆలోచనే కలగలేదు.

"హైదరాబాద్‌లో ఎన్ని రోజులుంటారు?"

"వారం. మహా అయితే పది రోజులు. అక్కడి నుండి మా ఊరు వెళ్లాను. మీ గది నుండి స్టేషన్ దగ్గరవుతుందని సూట్‌కేసులు మీ గదిలో పెట్టినందుకు మీకేటువంటి అభ్యంతరం లేదు కదా!"

"లేదు"

లేచి, "వచ్చే ఆదివారంగాని, ఏదయినా పనిబడితే ఆపై ఆదివారంగానీ వస్తాను. ఆ పెట్టెలు చాలా జాగ్రత్తగా చూస్తుండండి. రెండింటిలో చాలా విలువయిన వస్తువులు న్నాయి" అన్నాడు.

"ఏమిటవి?" అని అడుగుదామని నోటి చివరివరకు వచ్చింది. అడిగేలోపల అతను, "వెళ్లొస్తాను" అనేసి వెళ్లిపోయాడు.

రెండు వారాలు గడిచాయి. మూడు వారాలు గడిచాయి. నెల దాటింది. రోజులు గడిచేకొద్దీ నాకు భయం ఎక్కువ కాసాగింది. పెట్టెల్లో విలువయిన వస్తువులు ఉన్నాయ న్నాడు. విలువయినవంటే ఏ బంగారమో, వెండి వస్తువులో అయివుంటాయి. అంత విలువయినవి కనకరాజుకు ఎలా వచ్చాయి? కొంపదీసి అతనేమయినా దందాలు చేస్తుం టాడా? అతనికి ఏమయినా అయిఉం టుందా? అతను నా గదిలో ఉంచింది దొంగసొత్తు అయివుంటుందా? ఒకవేళ అయివుంటే పోలీసులు నన్నూ వదలరు. అక్కడ నాకు సహాయం చేయడానికి ఎవరూ రారు. రాత్రిళ్లు కంటికి నిద్ర పట్టడం లేదు. మెట్లమీద ఎవరు వస్తున్న చప్పుడు వినిపించినా పోలీసులు అనిపించేది. అతను ఎప్పుడు వస్తాడా? అని సాయంత్రాలు ఆఫీసు నుండి ఎక్కడికీ వెళ్లకుండా సరాసరి గదికి చేరుకునేవాడిని. ఆదివారాలు కూడా ఎక్కడికీ వెళ్లేవాడిని కాదు.

ఎలా అయితేనేం మరో వారం గడిచాక ఒక ఆదివారం మధ్యాహ్నం దాటాక అతను వచ్చాకగాని నా తల మీదున్న భారం తీసివే సినట్టు అనిపించలేదు. చేతిలో మరో హేండ్ బేగ్ ఉంది. అది నిండుగా ఉంది. మంచం కిందనుండి పెట్టెలు బయటకు తీసి మూల నున్న పాత గుడ్డ అందుకుని పెట్టెలు శుభ్రం చేసుకుని లాక్‌లు సరిగా ఉన్నాయో లేదో ఒకటికి రెండుసార్లు చూసుకుని సంతృప్తి పడి, అవీ అందుకుని చెరో చేత్తో పట్టుకుని,

"స్టేషన్‌కు మీరు రాకూడదూ?" అడిగాడు.

వెంటనే నేనేమీ మాట్లాడకపోయేసరికి "రండి సార్! జీవితంలో మళ్లీ కలుస్తామో, లేదో?" అన్నాడు.

కార్టూన్లకు ఆహ్వానం

కార్టూనిస్టులనుండి ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతోపాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని కార్టూన్లను తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి.

కార్టూన్లు పంపించాల్సిన చిరునామా:

ఎడిటర్, ఆదివారం వార్త నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.

అతను వెళ్లడమే నాకు ముఖ్యం. "సరే!" అని నేనూ తయారయ్యాను. కింద మా కోసం ఆటో నిలబడి ఉంది. పది నిమిషాల్లో స్టేషన్ చేరుకున్నాను. అతనేదో ఆలోచిస్తూ సీరియస్‌గా ఉండిపోవడం వలన నాకూ ఏం మాట్లాడాలో తెలియక మౌనంగా ఉండిపోయాను.

మునుపటిలా అతనూ ఫ్రీగా ఏం మాట్లాడడం లేదు. అతను ఎక్కిన బండి పూనా స్టేషన్ నుండి కదిలాకగాని నా మనసు తేలిక కాదు. ఈ మధ్యలో ఎటువంటి ఇబ్బందికరమయిన సంఘటన జరగకుండా ఉండాలని పదే పదే అనుకున్నాను.

స్టేషన్ చేరిన తరువాత హమాలీచేత పెట్టెలు బొంబాయి నుండి వచ్చే హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ ఫస్ట్ క్లాస్ కంపార్ట్‌మెంట్ ఆగేచోట పెట్టెలు దింపించి నుంచున్నాం. అతని చేతిలో ఉన్న పెద్ద బేగ్‌ను హమాలీ పట్టుకుంటానని అడిగినా ఇవ్వలేదు.

'మీకు శ్రమ ఇచ్చినందుకు ఏమనుకోవడం లేదు కదా!" అడిగాడు.

"లేదు. అలా ఏమనుకోవడం లేదు" అన్నాను.

అతను రావడానికి అన్ని రోజులు ఎందుకు తీసుకున్నాడో అడగాలని పించింది" అడగలేదు.

కొద్దిసేపు ఆగి, "మళ్లీ పూనా ఎప్పుడొస్తారు?" అడిగాను.

"రాకూడదనే ఉంది"

బండి కదలబోతుండగా తన భుజానికి ఉన్న పెద్ద సంచిలోంచి పేకెట్ తీసి నాకు అందించి,

"దయచేసి దీన్నిక్కడ విప్పొద్దు. మీ గదికి వెళ్లాక విప్పండి.. ఉంటాను. మీ ఆరోగ్యం జాగ్రత్త..." అన్నాడు.

కంపార్ట్‌మెంట్‌లోకి వెళ్లాక అతని ముఖం నాకు కనిపించలేదు. బండి స్టేషన్ దాటాకగాని తేలికగా ఊపిరి పీల్చుకోలేకపోయాను.

గది చేరుకున్నాక పేకెట్ తీసి, అందులోనివి బయటకు తీశాను. రెండు ఖరీదయిన పట్టుచీరలు, ఒక బంగారు గొలుసు, ఉంగరం ఉన్నాయి. గుండె వేగంగా కొట్టుకోవడం మొదలెట్టింది. చీరమీదున్న కవర్ లోంచి ఒక కాయితం జారిపడింది. అందుకున్నాను. అందులో ఇలా ఉంది:

"రెండు చీరల్లో ఒకటి మీ అమ్మగారికి, మరొకటి మీ చెల్లాయికి. ఈసారి మీ ఊరు వెళ్లినప్పుడు ఇవ్వండి. నిజానికి వీటిని మా అమ్మ, చెల్లాయి కోసం తీసుకున్నాను. ఇప్పుడు వాళ్లు ఎక్కడ ఉన్నారో తెలియదు. ఎన్ని ప్రయత్నాలు చేసినా తెలుసుకోలేకపోయాను. వాళ్లు ఎంత దరిద్రంలో ఉన్నారో ఊహించగలను. ఈసారి వాళ్లను తప్పకుండా కలుస్తాననే నమ్మకం ఉంది. గొలుసూ, ఉంగరం మీకు.. నా గుర్తుగా. మీతో నా గురించి చెప్పిన విషయాల్లో కొన్ని నిజాలు, చాలా అబద్ధాలు ఉన్నాయి. నేను మీ కాలేజీలో చదవలేదు. బి.ఎ. మటుకు చేశాను. పూర్తి చేయలేకపోయాను, డబ్బులు లేక. నాన్న ఉన్నదంతా పేకాటకు, తాగుడుకు తగలబెట్టాడు. రోడ్డుమీద పడ్డాం. నా పేరు కనకరాజు కాదు. పది పేర్లు ఉన్నాయి.

చాలా చోట్ల ఉద్యోగ ప్రయత్నం చేసినా నా దురదృష్టంకొద్దీ ఉద్యోగం రాలేదు. కూలిపనులకు వెళ్లాను. రాత్రిళ్లు రిక్షా తొక్కేవాడిని. ఇంటా బయట సూటిపోటి మాటలు భరించలేక పారిపోయి చాలా ఊళ్లు తిరుగుతున్నప్పుడు నాకో నిజం తెలిసింది- న్యాయంగా ఎవడూ డబ్బు కూడగట్టుకుని వెనకేసుకోలేడని. మీ పరిచయంతో మీకు వచ్చే కొద్ది జీతంతో ఎంత తృప్తిగా ఎలా బతకవచ్చో అర్థమయింది. దొంగతనం నా గమ్యం కాదు. తీరు అయింది. తప్పకుండా సరిచేసుకుంటాను".

కింద సంతకం లేదు, పేరు లేదు.

ఆ రాత్రి కుండపోతగా వర్షం కురిసింది. మరుసటి పక్కరోజు దినపత్రికలో వచ్చిన పతాక శీర్షికలో హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదానికి గురై మొదటి నాలుగు కంపార్ట్‌మెంట్‌లు నదిలో పడి, వంద మంది వరకు చనిపోయారని ఉంది. మూడో పెట్టెలో అతను ఉన్నాడు.

■

చిన్న కథ

ఆమె నవ్వింది

ఆఫీసు వదిలారు.

అతనికి ఈ మధ్యే పెళ్లయింది. అతను ఆఫీసునుంచి బయట పడి, ఇంటికి రోడ్డుమీద చకచకా నడిచి వెళ్తున్నాడు.

"స్..స్.." ఎవరో అమ్మాయిది నోటి సైగ వినిపించింది.

అతను అర్థంకాక ఆశ్చర్యపోయి, ఆగి అటు చూశాడు.

ఎవరో అందాల సుందరి ఇంటి గుమ్మం ముందు నిలబడి నవ్వుతూ రమ్మన్నట్లు చేత్తో సైగ చేసి పిలిచింది.

అతనికి అర్థం కాలేదు. అవాక్కయి ఆమెవైపు చూశాడు.

ఆమె నవ్వింది. అంతలో ఎవరో ఒకతను లోపల్నుంచి బయటకొచ్చి ఆమె చేతిలో పది రూపాయలు పెట్టాడు.

"నేను చెప్పింది గంటకి వంద" అన్నది ఆమె.

"నువ్విచ్చిన సుఖానికి ఇదే ఎక్కువ" అని విసుక్కుంటూ ఆ వ్యక్తి వెళ్లిపోయాడు.

"ఆమె ఇలాంటిదా?" ఆశ్చర్యపోయాడు రోడ్డుమీద అతను.

"రండి..." ముఖంమీద నవ్వు పులుముకుంటూ, ఆమె అతన్ని లోపలికి ఆహ్వానించింది.

అతను ఆమె దగ్గరికి వెళ్లాడు. "ఏమిటీ పని?" అతను ఆమెని ప్రశ్నించాడు.

"ఒకడు ప్రేమ పేరుతో, చదువుకుంటున్న నా వెంటపడి, వేధించుకునితిని, నన్ను లేపుకొచ్చి, చివరికి మోసగించి వెళ్లిపోయాడు. ఇప్పుడు కొడుకు హాస్పిటల్‌లో జ్వరంతో బాధ పడుతున్నాడు. వెయ్యి రూపాయలు కావాలి" ఆమె కళ్లనుంచి కన్నీళ్లు బొటబొటా కారాయి.

అతని మనస్సు ఆవేదనతో మూగపోయింది. ఆమె చేతిలో వెయ్యి రూపాయలు పెట్టాడు.

ఆమె ఆశ్చర్యపోయింది. "అవసరానికి వాడుకొని, అడిగితేనే ఇవ్వని ఈ లోకంలో, అడగకుండానే ఇచ్చేవాళ్లు కూడా ఈ లోకంలో వుంటారా?" అవాక్కయి చూసింది ఆమె.

"రండి...." సంతోషంగా లోపలికి ఆహ్వానించింది.

"నేను అలాంటివాడ్ని కాను..." అతను వెనుతిరిగాడు వెళ్లటానికి.

ఆమెకి నోటమాట రాలేదు. సంభ్రమాశ్చర్యాలకి లోనయింది.

"ఇలాంటివాళ్లు కూడా ఈ లోకంలో వుంటారా?" ఆమె కళ్లలోనుంచి ఆనందభాష్పాలు ఉబికి, ఆమె చెంపలపై జాలువారాయి.

అతను ఇంటికి వెళ్తూ, ఎందుకో మళ్లీ ఆమెని చూడాలని పించింది, అభిమానంతో ఆమె వైపు చూశాడు.

ఆమె నవ్వింది. ఇప్పుడు ఆమె నవ్వులో అతనికి జీవం కనిపించింది. అతను బాధతో నిట్టూర్చి "ఆమెకేదైనా న్యాయం చేయాలి. వెళ్తానంటే ఆమె తల్లిదండ్రుల దగ్గరకి ఆమెని పంపించాలి. వెళ్లనంటే నచ్చచెప్పి వెంటపెట్టుకెళ్లి ఆమె తల్లిదండ్రులకి ఆమెని అప్పగించాలి. వెళ్లనని బాగా మొండికేస్తే ఆమెకో ఉద్యోగం చూడాలి. ఆమె కాళ్లమీద ఆమె నిలబడేలా చేయాలి. ఆమెని అన్ని విధాలా ఆదుకోవాలి. ఈ దుర్భర జీవితం నుంచి ఆమెకి విముక్తి కలిగించాలి. ఆమె నవ్వులో జీవముండేటట్లు చేయాలి" అని మనస్సులో కృత నిశ్చయంతో అనుకొని, మంచి మనస్సుతో అతను తన ఇంటిదారి పట్టాడు.

– మా.శ్రీ.రాజు

ఈ వారం కవిత్వం

కంటనీరు

ముంగటేడు మాడు పగలేసిన
ఎండలకి
మంగళంలా మాడింది నేలతల్లి
బంగారమంటి మాగాణి కూడా
సింగరేణిలా మారింది నెరల నోరు
తెరిసింది

తొలకరి చినుకుల చిరుజల్లుల
చిలకరింపుల పలకరింపుల
చల్లగాలుల పులకరింతల
కలలు కంటూ కలవరిస్తూ
కళ్ల కాయలు చేసి చూసింది

వల్లమాలిన వాన చినుకులు
రాలినట్టే రాలెగాని
నాలుగంటే నాలుగే
కళ్లాపిలాగా పల్చగా
చల్లి మెల్లిగ జారుకున్నడు
జాలి లేని వరుణదేవుడు

నీటిఎద్దడి తాళలేక
ఏటికెళ్లిన మూగజీవులు
నీటిచుక్కల వేటలో
ఏటిగట్టున ఏడ్చుకుంటూ
పూటకొక్కటి ప్రాణమొదిలె

తడులు లేక మడులు ఎండి
బీడులాయెను పంటచేలు
గోడు మిగిలిన అన్నదాతకు
సుడులు తిరిగెను కంటనీరు

నిరుటేడు కురిసేను తీరైన వానలు
తెరలు తెరలుగా వచ్చె వర్షాలు
హర్షింప
చెరువు చెలమలనిండ నీరు చెరె

పరవశంగ రైతు నారులేసి
ఊర్చినారు పైరులుత్సాహాన
వేరు దుబ్బు ముదిరి కణుపులే
వేయగా
హరితమాయె నేల పరువాల పదతిలా

నూర్చుకొనగ పంట కోతకాలమొచ్చె
ఓర్చలేని గగనమాగ్రహించి
మూర్ఛబోవగ పిడుగులిసిరె

మెరుపులతో విలయమొచ్చె
ఉరుములతో ప్రళయమొచ్చె
వరదనీటను మునిగిపోయెను
ఏపుగెదిగిన పైరులన్నీ
నీరుగారిన యాశలందున రైతునేస్తం
కుంగిపోగా
ఊరి ఉబికెను పొంగిపొరలెను
కంటనీరు

ఈ యేటను ప్రకృతి కరుణించెను
రైతును
వేళకొచ్చెను వానలు పూరటొందెను
యన్నదాత
చెమట నీటితో రైతురాజులు
సేద్యమెంతో చేసినారు
వాడిపోవని యాశతో వ్యవసాయ
పనులను చేసినారు
పంటలిచ్చెను పుష్కలంగా కనికరించిన

నేలతల్లి
పంట కోసి యమ్మబోగా
దిగుబడెక్కువ వచ్చెనంటూ
దిక్కుమాలిన ధరలు గట్టిరి బేరగాళ్లు
గిట్టుబాటు ధరలు రాక దాచుకోను
చోటు లేక
మట్టిలోనే పోసిపోయిరి కూరగాయలు
తెచ్చినోళ్లు
అప్పు తీర్చే దారి లేక శ్రమకు తగ్గ
ఫలము లేక
చవక ధరకే ధాన్యమమ్మితె
పెట్టుబడులే రాకపోగా
దిక్కుతోచని రైతుబిడ్డకు
ఎగిసి పొంగెను కంటనీరు

వందలాదిగ ఎకరాలున్న పెద్ద రైతుల
బిడ్డలు
డాలర్లకు పాలేర్లై సొమ్ము కూర్చి
పంపుతుంటె
వ్యాపారులుగా మారిపోతిరి
వ్యవసాయమొదిలిన రైతులు

ఆదరించి ఆదుకుందుకు నాథుడెవ్వడు
కానరాక
విసిగి వేసారుతున్న సన్నకారు చిన్న
రైతుల
రగిలి పొగిలే గుండెమంటల
నార్పగలదా కంటనీరు

– తాతపూడి రవీంద్రనాథ్ టాగోర్

గుండె గుడిలో వెలిగే దీపమా!

నా కుంచెకు శక్తివి నీవు.. నా బొమ్మకు ప్రాణం నీవు
శిలలాంటి నన్ను శిల్పంగా మార్చావు నీ గుండె గుడిలో
నిలిపావు...
విధి మన తలరాత మార్చింది మన గూడు చెదిరింది.

విధి ఆడిన వింత నాటకంలో నిన్ను కనురెప్పలా
కాపాడుకోలేని అంధుడనయ్యాను.
నా గుండెకు గాయమైంది. ఏడ్చి ఏడ్చి కన్నీరు ఇంకిపోయింది
నీవు లేని ఈ లోకంలో రెక్క తెగిన పక్షిలా
విలవిలలాడుతున్నాను.

నన్ను ముళ్లలోకంలోకి వదిలి నీవు పూల లోకంలోకి వెళ్లావ్..
నడి సముద్రంలో దారి తప్పిన ఒంటరి నావికుడనయ్యాను.
అర్ధ శరీరంతో జీవిస్తున్న నేను అజ్ఞాతంలో ఉన్న నీవు
ఒక్కటయ్యే మార్గం ఏ
లోకంలో ఉంటుంది
ఏ దేవుడిని
అడుగగలను...
ఎలా
జీవించగలను...

కళ్ల తెరిచినా నీవే..
కళ్ల మూసినా నీవే...
మన ఇంటి అణువణువూ
నీవే....
నా గుండె గుడిలో వెలిగే
దీపమా... ఆరాధ్య దైవమా!

– శిరంశెట్టి ఆనందరావు

సింగిల్ పేజీ కథ

ఉదయం నుంచీ ఒకటే వర్షం. వాతావరణం చాలా చల్లగా, చీకటిగా ఉంది. ఇంట్లో ఒంటరిగా ఉన్న శ్రీరామ్మూర్తికి ఏమీ తోచటం లేదు. ఇంట్లోకి బైటికి నాలుగుసార్లు తిరిగాడు. పనిమనిషి రమణ వచ్చి ఇంట్లో పనంతా చేసి వెళ్లిపోయింది.

మూలగది

– సురేఖా భాస్కర్

శ్రీరామ్మూర్తికి అరవై సంవత్సరాలపైన ఉంటాయి. ఆయనకి ఇద్దరు ఆడపిల్లలు. పిల్లల్ని బాగా చదివించి పెళ్లిళ్లు చేశాడు. భార్య జానకి అపుడపుడు కూతుళ్ల ఇళ్లకి వెళ్లి వస్తూ ఉంటుంది. శ్రీరామ్మూర్తిని కూడా పిల్లలు రమ్మంటారు. కానీ చిన్నప్పట్నుంచీ పుట్టి పెరిగిన ఇంటిని పది రోజులు కూడా వదిలి రానంటాడు. అది ఆయన సిద్ధాంతం.

"మనకి కొడుకులు కూడా లేరు. రేపు మరీ మూలన పడ్డాక కూతుళ్ల దగ్గర చేరితే అప్పటికప్పుడు ఆప్యాయతలు పుట్టుకురావు కాబట్టి కాస్త ఓపికున్నప్పుడు వాళ్లకి చేదోడు వాదోడుగా ఉంటే మంచిదన్నది" జానకి ముందుచూపు.

శ్రీరామ్మూర్తి జీవితం ఇప్పటివరకూ చాలా హాయిగా సాగిందనే చెప్పొచ్చు. పూర్వీకులు కట్టించిన ఇంటిలో తల్లి, ఇద్దరు పిల్లలు, భార్యతో కలిసి కలతలు లేని కాపురం సజావుగా సాగిపోయింది. దానికి ప్రత్యక్షంగాను, పరోక్షంగానూ కూడా శ్రీరామ్మూర్తి తల్లే కారణం అని చెప్పాలి.

శ్రీరామ్మూర్తి తల్లి సావిత్రమ్మ ఆడవాళ్లం దరిలో చాలా భిన్నంగా ఉండేది. కొడుకు పెళ్లయింది మొదలు ఇంటి విషయాలన్నీ కోడలికే అప్పగించింది. అందరూ కలిసే ఉన్నా, ఏనాడూ తన ఆధిక్యతను చాటుకోవటానికి ప్రయత్నించేది కాదు. తన పని తాను చేసుకొని ఆ ఇంట్లో ఉన్న మూలగదిలోనే రోజంతా గడిపేది.

కాపురానికి వచ్చిన కొత్తలో జానకి "ఆవిడ రాణివాసం ఆ మూలగది" అని పుల్లవిరుపుగా అంటుండేది. అత్తగారు రాణివాసం వెలగబెడుతోందని మొదట్లో భావించినా– ఇంటికి వచ్చిన ప్రతివాళ్లతో "ఏ విషయమైనా మా కోడలునడగండి" అంటూ తనకే గౌరవం ఇవ్వటంతో అత్తగారి వలన తన ఉనికికి ఎటువంటి భంగం కలగదని త్వరలోనే గ్రహించింది. అందుకే తెలివిగా ప్రతీ విషయంలోనూ–

"పెద్దవారు మా అత్తయ్యగారున్నారు. ముందు ఆవిడ్ని అడగాలి" అంటూ పెద్దరికాన్ని అత్తగారికే వదిలేసేది.

శ్రీరామ్మూర్తి చాలా తెలివయినవాడు. ఏదైనా ముఖ్య విషయంలో నిర్ణయం తీసుకోవల్సి వస్తే– "నాదేముంది మీ అత్తాకోడళ్లు ఒకటి, మీరే చూసుకోండి" అనేవాడు, మీ ఇద్దరూ ఒకటిగా ఉండాలనే అర్థం వచ్చేట్లుగా!

ఈ విధంగా ఆ ఇంట్లోని ముఖ్యమయిన ఆడవాళ్లిద్దరూ శ్రీరామ్మూర్తి జీవితాన్ని నందనవనం చేశారనే చెప్పాలి.

భార్యనుంచి తల్లిమీద ఎటువంటి కంప్లయింటు లేకపోయినా ఆదివారం రోజున గుడికి తీసుకెళ్లే నెపంతో తల్లిని ఒంటరిగా బైటికి తీసుకొచ్చి–

"అమ్మా! నువ్వు నాన్న లేరని బాధపడుతూ ఒంటరిగా ఆ మూలగదిలోనే ఎప్పుడూ కాలక్షేపం చేయటం నాకేం నచ్చలేదు. ఎందుకు ఎప్పుడూ ఆ గదిలోనే ఉంటావని?" అడిగేవాడు.

దానికి సావిత్రమ్మ నవ్వుతూ–

"నేను ఒంటరిదాన్నని ఎవరన్నారు నాన్నా? మీరంతా లేరూ! ఆ మూలగదిలో కూర్చుంటే ఈ ప్రపంచం అంతా నా చుట్టూ ఉన్నట్లుగా ఉంటుంది. నువ్వు కూడా ఖాళీగా ఉన్నప్పుడు అక్కడ కాలక్షేపం చేస్తుండు. నీకే అర్థమవుతుంది.. అని తేలిగ్గా తీసిపారేసేది.

తల్లికి ఆ గదితో ఉన్న అనుబంధంతో అలా మాట్లాడుతోంది. ఏవో పుస్తకాలు చదువుకొంటూ కాలక్షేపం చేస్తోందిలే… అని సరిపెట్టుకొనేవాడు.

తల్లినుండి కూడా కోడలిమీద ఎటువంటి ఫిర్యాదులూ లేకపోవటంతో శ్రీరామ్మూర్తికి సంసార నౌక సాఫీగా సాగిపోయింది.

ఈ ప్రపంచంలో ఎవ్వరూ శాశ్వతంగా ఉండిపోరు కాబట్టి సావిత్రమ్మకి కూడా చిన్నపాటి అనారోగ్యం చేసి చాలా సునాయాసంగా మరణించింది.

సావిత్రమ్మ మరణం తర్వాత ఆ మూలగదిలోకి పెద్దగా ఎవరూ వెళ్లింది లేదు. ఏదైనా కొత్త వస్తువు వచ్చినప్పుడు అడ్డుగా ఉన్న పాత సామాను ఆ గదిలో పెట్టేవారు. పనిమనిషి రమణ మాత్రం రోజూ గది ఊడ్చి సావిత్రమ్మ వాడిన వస్తువులన్నీ శుభ్రంగా తుడుస్తుంది. అలా జానకి పురమాయించింది. అత్తగారు వాడిన వస్తువులను మూలన పడేయకూడదనేది జానకి కోరిక.

ఆ రోజు కూడా రమణ అన్నీ తుడిచి పెట్టింది.

శ్రీరామ్మూర్తికి ఎందుకో చాలా ఒంటరితనంగా అనిపించింది. తన చిన్నప్పటి విషయాల నుంచి రిటైర్మెంట్ ఫంక్షన్ వరకూ అన్నీ నెమరు వేసుకొంటూ కూర్చున్నాడు. సావిత్రమ్మ ఎప్పుడూ మూలగదిలో కూర్చోవటం గుర్తొచ్చింది.

"అక్కడ కూర్చుంటే ఈ ప్రపంచం అంతా నా చుట్టూ ఉన్నట్లుగా ఉంటుందిరా" అంటూ తనతో తల్లి అన్న మాటలు గుర్తొచ్చి లేచి మూలగది వైపుకి నడిచాడు.

గదిలో తల్లి పడుకునే పట్టెమంచం, ఒక పడక్కుర్చీ, గదిలో మూలగా పూర్వకాలం నాటి పెద్ద ఇనప్పెట్టె ఉన్నాయి. పెట్టెకి చిన్న తాళం, తాళంచెవులు దానికే వేళ్లాడుతున్నాయి. శ్రీరామ్మూర్తి తల్లి ఏం చేస్తోందా? అని పెద్దగా ఆరా తీసింది లేదు. ఎప్పుడూ ఏదో పుస్తకం చదువుకుంటూ కూర్చుంటుందనే తెల్సు. అది ఏ రామాయణమో, భారతమో అయి ఉంటుంది. ఎందుకంటే ఆ వయస్సులో అంతకుమించి వాళ్లు చేసేదేముంది కనుక! అని అందరి అభిప్రాయం. శ్రీరామ్మూర్తి కూడా అలాగే అనుకొనేవాడు.

ఇనప్పెట్టెకి తాళాలు ఉండటం చూసి శ్రీరామ్మూర్తి ఆసక్తిగా పెట్టె తాళం తీశాడు. పెట్టెనిండా రకరకాల పుస్తకాలున్నాయి. ఒక్కొక్కటి ఆశ్చర్యంగా బైటికి తీశాడు. భాషతో సంబంధం లేని భావ పరంపరలతో సాహితీ సౌరభాలు వెదజల్లే ఎన్నో విలువయిన పుస్తకాలున్నాయి. దేవులపల్లి కృష్ణశాస్త్రి సాహిత్యం నుంచి వర్డ్స్ వర్త్ పొయిట్రీ వరకూ రకరకాల పుస్తకాలు పెట్టెలో భద్రంగా పరచి ఉన్నాయి. బెంగాలీ రచయిత శరత్ రాసిన 'బడదీదీ' అనే పుస్తకంపైన సావిత్రమ్మ ముత్యాలాంటి అక్షరాలతో 'నాకిష్టమైన పుస్తకం' అని రాసుకుంది. అది చూడగానే శ్రీరామ్మూర్తి కళ్లల్లో గిర్రున నీరు తిరిగింది. పెట్టెలో అడుగున పట్టుబట్టలో భద్రంగా చుట్టి ఉన్న మాలతీచందూర్ ఒక వారపత్రికలో పాఠకుల ప్రశ్నలకు జవాబులిచ్చినవన్నీ పుస్తకంలా మలచి జాగ్రత్తగా సావిత్రమ్మ దాచుకోవటం విస్మయం కలిగించింది.

తన తల్లి తనదైన గొప్ప ప్రపంచంలో జీవించిందని అప్పుడు అర్థమయింది. తల్లి ఏవో పుస్తకాలతో కాలక్షేపం చేస్తోందని తామంతా అనుకొన్నారు. కానీ ఆవిడ పుస్తకాలతో చేసింది కాలక్షేపం కాదు, స్నేహం. ఆ స్నేహంతోనే ఎంతో పరిణతి చెందిన వ్యక్తిగా సంస్కారం వెదజల్లుతూ తమకు జీవన సాఫల్యం కలిగించింది.

శ్రీరామ్మూర్తికి తల్లిమీద గౌరవం వందరెట్లు పెరిగింది. వెంటనే ఒక తెల్లని కాగితం, పెన్ను తీసుకొని పెద్ద పెద్ద అక్షరాలతో A house without a library is like a temple without God" అని రాసి మూలగది తలుపుమీద అతికించాడు. ■

వాస్తువార్త

వాస్తువిద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్- 3
సెల్స్: 9885446501/ 9885449458

గృహ నిర్మాణానికి ఎలాంటి కలపనుపయోగించాలి?

ఒక గృహ నిర్మాణానికి వాడే కలప స్వచ్ఛమైన దిగా ఉండాలి. 'స్వచ్ఛమైన కలప' అంటే చెదలు పట్టనిది, లోపల డొలుగా లేనిది. ఎండ-వానలకు స్వరూపం మారనిది, చీలికలు లేనిది, సగం కాలనిది, కాలిన వాసన లేనిది.

ప్రకృతి నుండి లభించిన కలపను ఈ కాలంలో అనేక 'ట్రీట్‌మెంట్స్' ఇచ్చి వాతావరణానికి మార్పు చెందకుండునట్లు తయారు చేస్తున్నారు. తీవ్రమైన ఎండలకి, వానలకి కూడా వాటి స్వరూపాలలో మార్పులు రావు. ఇది హర్షించదగిన విషయం. అయితే ఏదైన అగ్ని ప్రమాదం జరిగి ఒక ఇంటి లోపల వస్తువులతోపాటు చెక్క తలుపులు, కిటికీలు, ఫర్నిచరు సగం కాలిపోయివుంటే మాత్రం వాటిని ఎట్టి పరిస్థితుల్లో కూడా ఏ గృహానికైనా సరే ఉపయోగించకూడదు. ఏ కారణం చేతనైనా సరే కొంత భాగం కాలిపోయిన కర్రను గృహ నిర్మాణంలో తలుపులకు, కిటికీలకు, వెంటిలేటరు, ఫర్నిచరుకు ఉపయోగించకూడదు. అలా ఉపయోగించినట్లయితే ఆ ఇంటికి 'దగ్ధ కాష్టవేధ' అనే వాస్తుదోషం ప్రాప్తిస్తుంది. ఈ దోషం కలిగిన గృహ సొంతదారునకు, ఆ ఇంట్లో నివాసించేవారికి మనస్తాపం, చోరాగ్ని భయాలు, వ్రణ (పుండ్లు) బాధలు కలిగే అవకాశాలు ఎక్కువ. కోరి కోరి కాలిన కలప తెచ్చుకొని వాడాలని ఎవరూ అనుకోరు. కాలినంత మేరకి చెక్కను కోసేసి అమ్మటం జరుగుతుంది. తెలియక అటువంటి చెక్కను వాడటం వలన పైన చెప్పిన చెడు ఫలితాలు కలగవచ్చు. ఇండ్లలో జరిగిన చిన్న చిన్న అగ్నిప్రమాదాల వలన స్వల్పంగా కాలిన తలుపులను, కిటికీలను, వెంటిలేటర్లను, ఫర్నిచర్‌ను పట్టించుకోకపోవటంవలన ఈ దోషం కలుగుతుంది.

పైన చెప్పిన దుష్ఫలితాలు పునరావృతమవుతున్నట్లయితే ఈ దోషముందేమోనని ఒకసారి సరిచూసుకోవాలి. ఒకవేళ ఇలాంటి దోషముంటే కలపను మార్చుకొని సవరించుకోవచ్చు. శీఘ్రంగా మంచి ఫలితాలను పొందవచ్చు.

వాస్తుదోషాలున్నాయా?

ఎస్.ఎన్ - కాకినాడ

ప్రశ్న: ఇది మా ప్రొఫెసర్ అమెరికన్ ఇంటి ప్లాను. వీరికి ఈ మధ్య రెండు సార్లు కారు యాక్సిడెంట్స్ జరిగాయి. కారు దెబ్బ తింది. వీరికి ఏమీ కాలేదు. వాస్తు దోషాలుంటే తెలియచేస్తారని ఆశిస్తున్నాను.

జవాబు: ప్రొఫెసర్‌మీద మీకున్న శ్రద్ధ అభినందనీయం. మీరు పంపించిన ప్లాను పరిశీలించాను. అయితే వాళ్లు ఇంట్లోకి వచ్చి ఎంత కాలమయిందో తెలుపలేదు. యు.ఎస్.ఏ.లో ఇండిపెండెంట్ ఇళ్లకు ఎక్కువ శాతం కాంపౌండ్ గోడలుండవు. ఈ ఇంటికి కూడా కాంపౌండ్ గోడలు లేకుండా, ఫెన్సింగ్ ఉన్నదని భావిస్తున్నాను. ఈశాన్య మూలన (ఇంటికి) రెండు కార్లు పట్టే గ్యారేజ్ ఉన్నది. అక్కడినుండి ఇంట్లోకి దారి వున్నది. ఈశాన్య మూల కారు గ్యారేజ్‌లు వుండకూడదు. కిచెన్ ఇంటికి మధ్య భాగంలో ఉన్నది. అలా కాకుండా ఆగ్నేయానికి/వాయువ్యానికి మార్చాల్సి ఉంటుంది. ఈ మార్పులన్నీ చేయటం మీకు సాధ్యం కాదు. విదేశాల నుండి ఎంతో మంది మమ్మల్ని సంప్రదిస్తూ ఉంటారు. కనుక ఈ మార్పుల సాధ్యాసాధ్యాలు మాకు తెలుస్తూ ఉంటాయి. మీరొకసారి ఫోన్‌లో సంప్రదిస్తే నాకు కావలసిన వివరాలు అడిగి తెలుసుకొని, మీకు అనుకూలించే విధంగా వాస్తు సవరణలు చెప్పే ప్రయత్నం చేస్తాను. రెండు సార్లు కారు యాక్సిడెంట్ అయినా కారు దెబ్బతిన్నదిగానీ, ప్రొఫెసర్‌కి ఏమీ కాలేదు, క్షేమంగా ఉన్నారు. కనుక ఆ ఇంటికి తీవ్రమయిన వాస్తు దోషాలు ఉండే అవకాశం లేదని చెప్పవచ్చు.

మాకెవరికీ మంచి జరగడం లేదు!

సి.హెచ్.ప్రశాంత్ - ఖమ్మం

ప్రశ్న: మేం ఒక ఇల్లు కొన్నాం. మేం ఆ ఇంటికి వచ్చినప్పటి నుండి కొంత చెడు జరిగింది. 'మేం ఇంటికి వచ్చిన నెల రోజులకు మా అమ్మాయికి చెయ్యి విరిగింది. ఒక సంవత్సరంలో నాకు గుండెజబ్బు వచ్చింది. నా భార్య నడుముకు దెబ్బ తగి

లింది. మేం వచ్చినప్పటినుండి ఆర్థికంగా, మానసికంగా దెబ్బ తిన్నాం. కొందరిని అడిగితే- వాళ్లు ఇంటివాస్తు సరిగా లేదని చెప్పారు. మేం మీ శీర్షికను రెగ్యులర్‌గా చదువుతుంటాం. మాకు సరైన సలహా ఇవ్వగలరు.

జవాబు: తూర్పు, ఉత్తర ఈశాన్యాలు పెరిగినటువంటి గృహావరణ కలిగివున్న మీరు పలు విధాలుగా సత్ఫలితాలు పొందాల్సి వుంది. కానీ దక్షిణ నైరుతి మూడంగుళాలు పెరిగి ఉండటంవల్ల వాయువ్యంలో, బాత్ రూములు కట్టి మూత వేయటంవల్ల, నైరుతి మూల ఆకాశానికి తెరిచి వుండటంవల్ల మీరీవిధమయిన ఇక్కట్లు పడే అవకాశమున్నది. వాయువ్యంలో వున్న బాత్ రూములను నిర్మూలించండి. నైరుతి మూల గృహానికి తగలకుండా పశ్చిమ, దక్షిణ ప్రహరీ గోడలనానుకుని బాత్ రూమ్ నిర్మించండి. మూడంగుళాలు పెరిగిన దక్షిణ నైరుతి మూలను కూడా గోడ మందం పెంచుతూ సరిచేసుకోవలసి ఉంటుంది. ఈ మార్పులు మీకు తప్పకుండా మంచి ఫలితాలను ఇస్తాయి. ■

వాస్తువిద్వాన్ డా॥ దంతూరి పండరినాథ్ పాఠకుల సమస్యలకు ఆదివారం 'వాస్తువార్త'లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా: సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికింద్రాబాద్-3

వాస్తువార్త

పూర్తి పేరు: ------------------------------------
పుట్టినతేదీ:------------------ ఊరు: ------------
జన్మనక్షత్రం:---------తల్లిపేరు:--------------------
